




www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI








శుక్రవారం | 6-3-2020 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 321

శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి ఉ. 11.48 తదుపరి ద్వాదశి; నక్షత్రం: పునర్వసు ఉ. 10.39 తదుపరి పుష్యమి; వర్జ్యం: సా. 6.08-7.37; దుర్ముహూర్తం: ఉ. 8.55-9.42, మ. 12.50-1.38; అమృతఘడియలు: ఉ. 8.19-9.52, తె. 3.06-4.36; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.34; సూర్యాస్తమయం: 6.20 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore


• కరోనా... జాగ్రత్త!



ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో భాగంగా గన్నవరం విమానాశ్రయంలో నిర్వహించిన కార్యక్రమంలో పూర్తి రక్షణ సూట్‌లో సిబ్బంది, సహాయకులు

# అనుమానితులు 13 మంది

- ఏలూరు, ఒంగోలుల్లో మరో ఇద్దరి గుర్తింపు
- ఐసోలేషన్ వార్డుల్లో ఉంచి చికిత్స
- నేటి నుంచి బాధితుల కోసం 104 కాల్‌సెంటర్
- శిక్షణ కోసం ఢిల్లీకి నలుగురు వైద్యుల బృందం
- రాష్ట్రంలో పరిస్థితిపై నేడు సీఎం జగన్ సమీక్ష
- తెలంగాణలో ఆ ఇద్దరికీ నెగెటివ్
- పుణె వైరాలజీ ల్యాబ్ నిర్ధారణ
- ఊపిరి పీల్చుకున్న సర్కారు, వైద్యులు
- ఆ రాష్ట్రంలో ఇప్పుడు ఒక్కరికే కరోనా
- స్థానికంగా ఎవరికీ వైరస్ సోకలేదు

## కరోనా కలకలం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో కరోనా అనుమానితుల సంఖ్య 13కు చేరింది. బుధవారం నాటికి 11మంది లెక్కతేలగా ఆరోగ్యశాఖ అధికారులు గురువారం మరో ఇద్దరిని గుర్తించారు. ఏలూరులో ఒకరికి, ఒంగోలులో మరొకరికి ఐసోలేషన్ వార్డుల్లో వైద్యం అందిస్తున్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన యువకుడు(24) ఫ్రాన్స్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం నాలుగు దేశాల్లో పర్యటించిన ఆయన ఈనెల 3న బెంగళూరు మీదుగా ఒంగోలు వచ్చారు. జలుబు, జ్వరం లక్షణాలతో గురువారం ఆస్పత్రికి వచ్చిన అతడిని రిమ్స్ వైద్యులు ఐసోలేషన్ వార్డులో చేర్చుకుని చికిత్స అందిస్తున్నారు. అనుమానిత రోగి నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి పంపించారు. కాగా, బుధవారం హైదరాబాద్ పంపిన ఆరుగురి నమూనాల రిపోర్టులు శుక్రవారం రానున్నాయి. మరోవైపు ఇప్పటికే టోల్‌ఫ్రీ నంబర్ ప్రకటించిన

మిగతా 11వ పేజీలో...

### విదేశీ యాత్రలపై పడగ

- కరోనా భయంతో విహార యాత్రల బుకింగ్ రద్దు
- 70శాతానికి పైగా పడిపోయిన ప్యాకేజీ బుకింగ్‌లు

### రైల్వేకూ కోలుకోలేని దెబ్బ

- రిజర్వేషన్లు రద్దు చేసుకుంటున్న ప్రయాణికులు
- ప్రయాణికులకు మాస్కులు ఇచ్చే యోచన

11

### విశాఖకు చైనా నౌక

కరోనా భయంతో పోర్టు సిబ్బంది బెంబేలు

# అసైన్డ్ అంటే అలుసా

## బడుగుల భూములపై రెవెన్యూ జులుం

- పేదల స్థలాల కోసం పేదల భూములే బలి
- గతంలో ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలు పంపిణీ
- ఇప్పుడు.. అసైన్డ్ భూములూ స్వాధీనం
- వాటిని అనుభవించే హక్కు లబ్ధిదారులదే
- విస్తృత ప్రజాప్రయోజనాలకే సేకరించాలి
- ఇళ్ల స్థలాలకు తీసుకోవడం ఇదే తొలిసారి
- ఇచ్చి తీరాలంటూ అధికారుల హెచ్చరికలు
- రాత్రికి రాత్రి పంటలు పీకి.. భూమి చదును
- పరిహారం మాటెత్తకుండానే దౌర్జన్యం
- దిగులుతో ఇద్దరు రైతుల ఆకస్మిక మృతి
- కర్నూలులో మహిళా రైతు ఆత్మహత్య
- అధికారులతో రోజువారీ భూ పోరాటం
- గ్రామకంఠం భూములపైనా ప్రతాపం

## రివర్స్ రాబిన్ హుడ్

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం




పోలీసు జులుం... విన్నాం, చూశాం! ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్నది రెవెన్యూ జులుం! అవసరమైతే పోలీసులను కూడా తీసుకెళ్లి పేదలపై ప్రదర్శిస్తున్న జులుం! కన్నుపడితే చాలు... భూమిని లాగేసుకుంటున్నారు. పచ్చటి పంటలనూ తొక్కేస్తున్నారు. రాత్రికి రాత్రి చదును చేస్తున్నారు. 'పేదలకు ఇంటి స్థలాల' పేరిట రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల పేదలకే కన్నీరు తెప్పిస్తున్నారు. ఉగాది రోజున 25 లక్షల మందికి ఇంటి స్థలాల పంపిణీ పండుగ ఒకవైపు! ఏళ్ల తరబడి తిండి పెడుతున్న భూములు కోల్పోతున్న బడుగు రైతుల గుండెల్లో గుబులు మరోవైపు! ప్రభుత్వం ఇచ్చే ఇంటి స్థలాలు నిజంగానే పేదలకు సంతోషం కలిగిస్తాయి. కానీ... అందుకు పేదల నుంచే బలవంతంగా భూములు లాక్కోవడం ఇందులో మరో కోణం! ఎవరి సంతోషానికి ప్రభుత్వం ఎవరిని బలిచేస్తున్నట్లు?

నిన్న భూ లక్ష్మి! మొన్న సత్యాడ బాలరాజు..

ఇప్పుడేమో చావు బతుకుల మధ్య వెంకట విష్ణుమూర్తి!

అందరూ పేద, బడుగు రైతులే! జీవనాధారమైన భూములను కాపాడుకునేందుకు ఒకరు ఆత్మహత్య చేసుకోగా, మరొకరు గుండె పగిలి మరణించారు. ఇంకో రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఇది ముగ్గురి వ్యథ కాదు. రాష్ట్రంలో వేలాది మంది పేద, బడుగు, బలహీనవర్గాల రైతుల కన్నీటి కథ. నిన్నటిదాకా తమ బతుక్కు ఆసరాగా

మిగతా 9వ పేజీలో...

### పేదలకు జాగా పెద్ద దగా!

- పాతిక లక్షల మందికి ఇవ్వడానికి ప్రభుత్వం ఎక్కడ, ఎంత కొన్నది?
- స్థానిక ఎన్నికల కోసమే హడావుడి
- మేమిచ్చినవీ ఆ 'పాతిక'లోనే: టీడీపీ

ప్రాణాలు పోవడం కలచివేస్తోంది: బాబు

9

# బీసీ కోటా కోసం సుప్రీంకు టీడీపీ

## హైకోర్టు తీర్పుపై స్టే విధించండి



- జీవో 176 ప్రకారమే స్థానిక ఎన్నికలు
- పంచాయతీల ఓటర్ల జాబితా ప్రకారం రాష్ట్రంలో 48.13 శాతం బీసీ ఓటర్లు
- పిటిషన్‌లో సుప్రీంకు టీడీపీ నివేదన

న్యూఢిల్లీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల కుదింపును తెలుగుదేశం పార్టీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ ఎన్నికల్లో బీసీలకు 34 శాతం, ఎస్సీలకు 19.08 శాతం, ఎస్టీలకు 6.77 శాతం..మొత్తం 59.85 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ గతేడాది డిసెంబరు 28న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 176ను హైకోర్టు రద్దు చేసిన సంగతి తెలిసిందే. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు చట్టవిరుద్ధమని కూడా తన తీర్పులో పేర్కొంది. ఈ తీర్పును సవాల్ చేస్తూ టీడీపీ ఎంపీ రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎంపీలు నిమ్మల కిష్టప్ప, కొనకళ్ల నారాయణ, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గురువారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జీవో 176 ప్రకారమే ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలివ్వాలని కోరారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో బీసీలకు రిజర్వేషన్లను

మిగతా 2వ పేజీలో...

### స్వేచ్ఛగా ఎన్నికలు

- శాంతియుతంగా నిర్వహిస్తాం
- నేడు పార్టీలతో సమావేశం
- పరిస్థితులన్నీ అంచనా వేశాక నోటిఫికేషన్‌పై తుది నిర్ణయం
- రిజర్వేషన్లు ఖరారు చేశాక వెబ్‌సైట్‌లో జాబితాలు పెడతాం
- 1.60 లక్షల బ్యాలెట్ బాక్సులు రెడీ
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వెల్లడి

2

### 'పీఎఫ్'పై వడ్డీరేటు తగ్గింపు

8.65 నుంచి 8.5 శాతానికి.. ఏడేళ్లలో కనిష్ఠం

10









## ఇంజనీరింగ్ కాలేజీలకు ఫీజు ఫిక్స్!



### కాలేజీలకు కనిష్ఠం రూ.35 వేలు

- 288లో 150 కాలేజీలకు ఖరారు
- మిగతావాటిపైనా నేడు నిర్ణయం
- ఐదారు కాలేజీలకు లక్షకుపైగానే
- కొన్నింటి విషయంలో పునఃసమీక్ష
- కమిషన్ సిఫారసులు నేడు

అమరావతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంజనీరింగ్ ట్యూషన్ ఫీజుల ఖరారు ప్రక్రియ మొదలయింది. 2019-20 విద్యా సంవత్సరం నుంచి మూడేళ్ల బ్లాక్ పీరియడ్‌కు మొత్తం 288 ఇంజనీరింగ్ కాలేజీలకు ట్యూషన్ ఫీజు ఖరారు కావాల్సి ఉంది. గురువారం ప్రత్యేకంగా సమావేశమైన ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్... ఇందులో దాదాపు 150 కాలేజీల ఫీజులను తేల్చింది. గురువారం రాత్రి వరకు అందిన సమాచారం ప్రకారం, ఈ కాలేజీలకు కనీస ఫీజు రూ.35 వేలుగా

మిగతా 10వ పేజీలో...

### 'నీట్' ర్యాంకుల్లో ఎవరెక్కడ?

పీజీ నీట్‌లో ఏపీ నుంచి 6,600 మందితో జాబితా

వచ్చే వారం కౌన్సెలింగ్

• నాలుగోసారి...



## నిర్భయ దోషులకు 20న ఉరి

- కొత్త తేదీ ఖరారు చేసిన ఢిల్లీ కోర్టు
- ఇదే చివరి తారీఖు కావాలి
- ఆ రోజు మాకు శుభోదయం
- వీలుంటే వాళ్లు చావడం చూస్తా
- నిర్భయ తల్లి ఆశాదేవి వ్యాఖ్యలు

10

### ప్రఖ్యాత పాత్రికేయుడు పొత్తూరి ఇకలేరు



- ఐదు దశాబ్దాలపాటు పాత్రికేయరంగంలో విశేష కృషి
- ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా సేవలు.. పలు రచనలు

10

'హెచ్1బీ' వీసాల మంజూరులో..

### అమెరికాకు మోదం.. భారత్‌కు ఖేదం

- ఇండియా సంస్థల తిరస్కరణ 10 రెట్లు అధికం
- ఈ ఏడాది మరింత కఠినతరం?

10






పరంజ్యోతి



## శరీరం.. ధర్మ సాధనం

*అమరుఁజెవి శాస్త్రమున కుండలమునగాదు*
*వలయముననొప్ప దీవిచే వెలయుఁబాణి*
*ఉరుదయార్ద్రుల మేను పరోపకార*
*కలన రాణించు; గంధంబువలన గాదు*

చెవులు.. వినడం వల్ల రాణిస్తాయి తప్ప, కుండలాల వల్ల కాదు! చేతులు దానం చేయడం వల్ల రాణిస్తాయి తప్ప కంకణాల వల్ల కాదు. గొప్పవారైన దయార్ద్ర హృదయుల శరీరం.. పరోపకారం వల్ల రాణిస్తుంది తప్ప సువాసనలు గల మైపూతతో కాదు అని ఈ సుభాషిత రత్నం అర్థం. నిజమే. 'శరీరం ఖలు ధర్మసాధనం' అని ఆర్యోక్తి. సనాతనుడు, శాశ్వతుడు అయిన జీవుడు... అశాశ్వతం, నశ్వరం, అయిన శరీరంలో ఉన్నంత వరకూ పవిత్రమైన కర్మలను ఆచరించడం ద్వారా జన్మను సార్థకం చేసుకోవాలి. అందుకోసం అవసరమైన అవయవ నిర్మాణాన్ని పరమేశ్వరుడు తన నిర్హేతుకమైన కృపతో కటాక్షించాడు. ఆ పరమాత్మ మనపై ప్రసరించిన కృపను సద్వినియోగం చేసుకోవడమే మనం చేయాల్సిన పని.

అందుకు ఏం చేయాలి? అంటే.. దీపపు వెలుగు ఎల్లప్పుడూ ఊర్ధ్వముఖంవైపు ప్రసరించినట్లు.. సర్వకాల సర్వావస్థలయందూ ధర్మ సంబంధమైన ప్రగతి మార్గంలో పయనించడమే మనం చేయాల్సిన పని. శాస్త్రజ్ఞానాన్ని తెలుసుకోవడం, దాన కర్మాచరణం, పరోపకార పరాయణత్వం అనే మూడు విధానాలు ధర్మసాధనకు ఉపకరిస్తాయి.

మానవుడు జ్ఞానసంపూర్ణుడుగా మనడానికి, లోకోపకారిగా కావడానికి శాస్త్రజ్ఞానం ఎంతైనా అవసరం. అశాశ్వతమైన శరీర భూషణాల వల్ల అలౌకికనందాన్ని సాధించడం అసాధ్యం. వేద వేదాంత శాస్త్ర జ్ఞానం.. వ్యక్తి చేసే సర్వకార్యాలనూ సులభంగా సఫలీకృతం చేస్తుంది. అందుకు అవసరమైన ఆధ్యాత్మిక శక్తిని కలిగించి, వ్యక్తిలో నూతనోత్తేజాన్ని నింపి, శరీరాన్ని జ్ఞానజ్యోతిమయంగా రూపొందించి, ఆత్మానందాన్ని కలిగిస్తుంది. ఇక, ధర్మసాధనలో రెండో ఉపకరణం.. దానగుణం. అది మహత్తరమైన ఆశయాల సమాహారం. అన్నదానం, వస్త్రదానం, భూదానం, గోదానం, ధనదానం, సువర్ణ దానం, ధాన్యదానం, విద్యాదానం.. ఒకటేమిటి? అర్హతకు తగిన విధంగా ఎన్ని దానాలైనా చేయొచ్చు. మరణానంతరం జీవుడి వెంట వచ్చేది.. తన జీవనప్రస్థానంలో చేసిన పాపపుణ్యాల ఫలితాలే. అందుకే జీవించి ఉన్నప్పుడే మంచి పనులు చేయాలి. 'పరోపకారమిదం శరీరం' అనే ఆర్యోక్తిననుసరించి ఇతరులకు ఉపకారం చేయాలి. అందుకోసమే మన శరీరం ఉన్నదని తెలుసుకోవాలి. అనాథలను ఆదుకోవడం, తోటివారిలో దైవాన్ని దర్శించి ప్రేమించడం, చేసిన దానధర్మాల ఫలితాన్ని నిస్వార్థంగా దైవానికి అర్పించడం ఇవన్నీ ముక్తిసాధనాలు. సృష్టిలో 84 లక్షల జీవరాశులున్నా.. ముక్తికి అవసరమైన దైవారాధన చేయగలిగే శక్తి ఉన్నది ఒక్క మానవులకు మాత్రమే. అంతటి ఉత్కృష్టమైన మానవజన్మ ప్రాధాన్యతను తెలుసుకోలేని అజ్ఞానులతో సమాజ అభ్యున్నతి కుంటుపడుతుంది.

**- వల్లూరు చిన్నయ్య, 9948348918**





# ఆధునిక సంప్రదాయాల కలబోత... సంచయిత

**విజయనగరం** రాజవంశానికి వారసురాలు! పేరు... సంచయిత! వైసీపీ సర్కారు ఆమెను సింహాచలం దేవస్థానం పాలకమండలి ఛైర్‌పర్సన్‌గా, వేల కోట్ల ఆస్తులున్న 'మాన్సాస్ ట్రస్టు' సారథిగా నియమించింది. బుధవారం ఆమె ఆగమేఘాల మీద రెండు పదవులను స్వీకరించారు. తెలుగుదేశం సీనియర్ నేత అశోక్ గజపతిరాజుకు ఉద్వాసన పలికి సంచయితను నియమించడం సంచలనం సృష్టించింది. ఎవరీ సంచయిత అంటూ అందరూ ఆసక్తిగా ఆరా తీయడం మొదలైంది. అశోక్ గజపతిరాజు అన్న ఆనంద గజపతి - ఉమా గజపతి దంపతుల పుత్రికే సంచయిత! వీరు విడాకులు తీసుకున్నారు. ఉమా గజపతి ఢిల్లీలోనే స్థిరపడ్డారు. విజయనగరం రాజ వంశానికి చెందినప్పటికీ... సంచయితకు విజయనగరంతో పెద్దగా పరిచయం లేదు. ఆమె చదువుకున్నదీ, పెరిగిందీ ఇతర రాష్ట్రాల్లోనే. ఆమె విజయనగరంలో అడుగుపెట్టిన సందర్భాలు కూడా అతితక్కువ. తన తండ్రి ఆనంద గజపతి మరణించిన రెండో రోజుల తర్వాత సంచయిత విజయనగరం వచ్చారు. ఆ తర్వాత తిరిగి మాన్సాస్ ట్రస్టు ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టేందుకు బుధవారం వచ్చారు. ఎన్టీఆర్ మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు ఆనందగజపతి రాజు ఆయన మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిగా పని చేశారు. ఉమా గజపతి గతంలో కాంగ్రెస్ తరఫున ఎంపీగా గెలిచారు. సంచయిత ప్రస్తుతం బీజేపీ తరఫున మీడియా చర్చల్లో పాల్గొంటూ ఉంటారు. 'సన' అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి సమాజసేవలో పాల్గొంటున్నారు. తల్లీకూతుళ్లు ఢిల్లీలో ఫ్యాషన్ షోలు, ఈవెంట్లకు హాజరవుతుంటారు. ఆ చిత్రాలు ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి.

# స్వేచ్ఛగా ఎన్నికలు

- శాంతియుతంగా నిర్వహిస్తాం
- నేడు పార్టీలతో సమావేశం
- పరిస్థితులన్నీ అంచనా వేసుకున్నాక.. నోటిఫికేషన్‌పై తుది నిర్ణయం
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేశ్‌కుమార్ వెల్లడి

అమరావతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో, ఎలాంటి ప్రలోభాలు లేకుండా ఉన్నత ప్రమాణాలతో నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఎన్.రమేశ్‌కుమార్ తెలిపారు. గురువారమిక్కడ రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నోటిఫికేషన్ ముందుగా రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించడం పరిపాటని.. శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు గుర్తింపుపొందిన పార్టీల నేతలతో సమావేశమై వారి సూచనలు, సలహాలు తీసుకుంటామని వెల్లడించారు. పరిస్థితులన్నీ అంచనా వేసుకున్న తర్వాత నోటిఫికేషన్ విడుదలపై తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. 'గురువారం ఉదయం పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించాం. ఇప్పటికే 50 శాతం రిజర్వేషన్లకు సంబంధించి ఉత్తర్వులిచ్చామని.. దాని ఆధారంగా జిల్లాల్లో రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టామని వారు చెప్పారు.. శుక్రవారం రాత్రికి సమగ్ర స్వరూపం ఇస్తామన్నారు. రిజర్వేషన్ ఖరారుచేసిన జాబితా ఎన్నికల సంఘానికి ఇచ్చేటప్పుడు పబ్లిక్ డొమైన్‌లో కూడా పెట్టాలని సూచించాం. దీంతో మరింత పారదర్శకత ఉంటుందని అధికారులకు చెప్పాను. దానికి వారు అంగీకరించారు' అని తెలిపారు. ఈ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్రంలో 1.60 లక్షల బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయని, మరో 40 వేల బాక్సులు తెలంగాణ నుంచి తీసుకొస్తామని, 5 వేల బాక్సులు ఒడిశా నుంచి సేకరిస్తామని చెప్పారు. స్థానిక సంస్థల్లో వేటికి ముందుగా ఎన్నికలు పెట్టాలో నోటిఫికేషన్ విడుదల నాడు నిర్ణయం తీసుకుంటామన్నారు.



ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

### ఎక్కువ సంఖ్యలో ఓటేయాలి..

ప్రజలందరూ స్వేచ్ఛగా గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకోవాలని కమిషనర్ కోరారు. ఇదివరకు జరిగిన విధంగానే అదే నాణ్యతా ప్రమాణాలతో టెక్నాలజీని కూడా వినియోగించి ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల నిర్వహణలో మన రాష్ట్ర అధికారులు మిగతా రాష్ట్రాల కంటే గణనీయమైన పనితీరు కనపరిచిన చరిత్ర ఉందని చెప్పారు. 'అంతర్‌జిల్లా, అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, అవసరమైన చోట రిజర్వు పోలీసు సిబ్బందిని వినియోగిస్తాం. ఇప్పటికే రాష్ట్ర బలగాలతోపాటు ఇతర రాష్ట్రాల బలగాలను తీసుకునేందుకు మార్గం సుగమం చేశాం. ఎన్నికలు జరపడానికి కావలసిన భద్రతా విధి విధానాలు సంతృప్తికరంగా ఉన్నాయి' అని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వ ఉద్యోగులను కావలసినంత మందిని వినియోగించుకోవాలని, ఈ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేవని సీఎ్‌సతో జరిగిన సమావేశంలో ఆమె స్పష్టం చేశారని చెప్పారు. వలంటీర్లను ఎన్నికల్లో వినియోగిస్తారా అని అడుగగా.. ప్రభుత్వ సిబ్బంది చాలకపోతేనే ఇతర సిబ్బంది గురించి ఆలోచిస్తామని కమిషనర్ బదులిచ్చారు. ఎన్నికల కోసం సిబ్బందికి శిక్షణ కోసం కలెక్టర్లు, ఎస్పీలతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్సు ద్వారా మద్యం, డబ్బు పంపిణీ కట్టడి చేయాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తామని చెప్పారు.

## ఎన్నికల ముందు వ్యవస్థలు నిర్వీర్యం

- ప్రతిపక్షాలను భయపెట్టేందుకే కొత్త చట్టం
- ఎన్నికల కమిషనర్‌కు టీడీపీ ఫిర్యాదు

విజయవాడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): "స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు మొత్తం వ్యవస్థలను ముఖ్యమంత్రి నిర్వీర్యం చేస్తున్నారు. ప్రతిపక్షాలను దెబ్బతీసేందుకు ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది" అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకటరావు విమర్శించారు. ఆయన, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, వర్ల రామయ్య తదితరులు విజయవాడలో ఎన్నికల కమిషనర్‌ను గురువారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వలంటీర్లను పార్టీ కార్యకర్తలుగా ఉపయోగించుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని.. వలంటీర్లలో 90 శాతం మంది వైసీపీ కార్యకర్తలేనని లోగడ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రభుత్వ ఆస్తులకు వేసిన వైసీపీ రంగులను తొలగించాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు.

## కడపలో ఉక్కు కర్మాగారంపై స్విస్ కంపెనీ ఆసక్తి

- 12వేల కోట్ల పెట్టుబడికి ప్రతిపాదన.. సీఎంతో ప్రతినిధుల భేటీ



అమరావతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ కంపెనీ ఐఎంఆర్ ఏజీ ఆసక్తి వ్యక్తం చేసింది. ఏటా కోటి టన్నుల సామర్థ్యం గల కర్మాగారం స్థాపనకు రూ.12వేల కోట్ల పెట్టుబడి పెడతామని ప్రతిపాదించింది. గురువారం ఈ కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఇండోనేసియా, దక్షిణాఫ్రికా, మెక్సికో, కొలంబియా, ఇటలీ, ఉక్రెయిన్, భారత్ సహా పలు దేశాల్లో బొగ్గు, ఇనుప ఖనిజం, బంగారం లాంటి గనుల తవ్వకాలను చేపడుతున్నామని, పలు విద్యుత్, ఉక్కు కర్మాగారాలను నడుపుతున్నామని జగన్‌కు వారు వివరించారు. కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు వారికి ఆయన తెలిపారు.

### ఇసుక, మద్యం అక్రమ రవాణాను అడ్డుకోండి

- గ్రామాల్లో అక్రమాలకు అడ్డుకట్టపడాలి: సీఎం

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎక్కడా బెల్టు షాపులు, అక్రమ మద్యం తయారీ ఉండకూడదని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నామని, బెల్టు షాపులు వాటి ఉద్దేశాన్ని దెబ్బతీస్తాయని చెప్పారు. ఇసుక అక్రమ రవాణా, బెల్టు షాపుల అంశంపై గురువారం క్యాంపు కార్యాలయంలో సీఎం సమీక్షించారు. గ్రామాల సమగ్రాభివృద్ధికి విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్న తరుణంలో అక్రమాలకు పూర్తిగా అడ్డుకట్ట పడాలని, సరిహద్దుల్లో ఇసుక, మద్యం అక్రమ రవాణాను నిర్మూలించాలన్నారు.

### ఇసుకాసురులపై ఉక్కుపాదం: డీజీపీ

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని డీజీపీ గౌతమ్ సవాంగ్ హెచ్చరించారు. ప్రభుత్వ విధానాన్ని అతిక్రమించి ఎలాంటి రశీదులు లేకుండా ఇసుక లోడుతో వెళుతోన్న 125 వాహనాలను సీజ్ చేసినట్లు డీజీపీ కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇసుక అక్రమ తరలింపుపై పోలీసులతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ సురేంద్రబాబు నేతృత్వంలోని ప్రత్యేక పోలీసు బృందం నిఘా పెట్టిందని పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణాను నిరోధించడంలో విఫలమైన క్షేత్ర స్థాయి పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లాల ఎస్పీలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

### మండలికి కొత్త సహాయ కార్యదర్శి

అమరావతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): శాసనమండలికి కొత్త సహాయ కార్యదర్శి నియమితులయ్యారు. అసెంబ్లీలో సహాయ కార్యదర్శిగా ఉన్న విజయరాజును మండలికి సంబంధించి లెజిస్లేషన్ బాధ్యతలు చూసే సహాయ కార్యదర్శిగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇంతకు ముందు ఈ బాధ్యతలను ఉప కార్యదర్శి రాజకుమార్ చూసేవారు. ఇప్పుడు ఆయన స్థానంలో విజయరాజును నియమించారు. మండలి ఛైర్మన్ ఎం.ఎ. షరీఫ్ ఇటీవల గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌ను కలిసి ఫిర్యాదు చేసిన తర్వాత ఈ పరిణామం చోటు చేసుకోవడం విశేషం. మండలికి పూర్తి స్థాయి కార్యదర్శిగా విజయరాజును నియమించాలని ఆయన గవర్నర్‌ను కోరారు. అయితే సహాయ కార్యదర్శిగా విజయరాజును నియమించారు. దీని వల్ల మండలికి సంబంధించిన వివిధ ప్రతిపాదనలు, ఫైళ్లను ఆయన తయారు చేయాల్సి ఉంటుంది. అసెంబ్లీ కార్యదర్శి బాలకృష్ణమాచార్యులే మండలికి కార్యదర్శిగానూ వ్యవహరిస్తున్నారు. పై మార్పు తర్వాతా ఆయన కొనసాగుతారు. విజయరాజు నుంచి వచ్చిన ఫైళ్లపై ఆయన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. తాజా పరిణామం వల్ల ఛైర్మన్‌కు మండలి వ్యవహారాల్లో కొంత వెసులుబాటు లభించే అవకాశం ఉందని అంటున్నారు.

### మీవాళ్లు పంచితే రాజీనామా చేస్తారా: శైలజానాథ్

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): 'స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పక్షానికి చెందిన నేతలు మద్యం, డబ్బులు పంపిణీ చేస్తే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేస్తారా?' అని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షుడు సాకే శైలజానాథ్ ప్రశ్నించారు. ఓటమిపాలైతే పదవులు వదులుకోవాలని మంత్రులను సీఎం జగన్ బెదిరించడాన్ని శైలజానాథ్ తప్పు పట్టారు. గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మంత్రులకు టార్గెట్‌లను ఇవ్వడం, ఎలాగైనా గెలవాలని ముఖ్యమంత్రి బెదిరించడం వంటి వాటిని రాష్ట్ర ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. గెలవక పోతే రాజ్‌భవన్‌కు వెళ్లి మంత్రులు రాజీనామాలను సమర్పించాలనడం ఏమిటని ప్రశ్నించారు.

### బీసీలపై వారిది మొసలి కన్నీరు: తులసిరెడ్డి

విజయవాడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో టీడీపీ, వైసీపీ పుట్టక ముందే బీసీలకు కాంగ్రెస్ రిజర్వేషన్లు అమలు చేసింది. స్థానిక సంస్థల్లో 1994లో బీసీలకు 34% కోటా కల్పించిన ఘనత మాదే" అని పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తులసిరెడ్డి తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై టీడీపీ, వైసీపీలు మొసలి కన్నీరు కార్చుతున్నాయని ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు.

## ఏకకాలంలో ప్రజా, న్యాయ పోరాటం

- రిజర్వేషన్ తగ్గింపు వైసీపీ ఉన్మాద చర్య: చంద్రబాబు



అమరావతి, మంగళగిరి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): "బీసీల పట్ల వైసీపీ ప్రభుత్వం ఉన్మాదంగా వ్యవహరిస్తోంది. పూలే, ఎన్టీఆర్ ఆదర్శాలను వైసీపీ కాలరాస్తోంది. బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24 శాతంకు తగ్గింపు వైసీపీ ఉన్మాద చర్య. దీనిపై అన్ని మండల కేంద్రాల్లో నిరసనలు తెలపాలి. అన్ని నియోజకవర్గాల్లో ఆందోళనలు జరపాలి. దీనిపై ఇప్పటికే బీసీ ప్రత్యేక బృందాన్ని ఢిల్లీకి పంపాం. సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేస్తున్నాం. అటు న్యాయపోరాటాన్ని, ఇటు ప్రజాపోరాటాన్ని ఉధృతం చేయాలి" అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పిలుపు ఇచ్చారు. గురువారం ఉదయం టీడీపీ బీసీ నాయకులతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. "టీడీపీ అంటే బీసీ.. బీసీ అంటే టీడీపీ. అందుకే జగన్ బీసీలపై కక్ష సాధిస్తున్నారు. బీసీ రాజకీయ సాధికారతకు వైసీపీ సమాధి కడుతోంది" అని ధ్వజమెత్తారు. మౌనంగా ఉంటే వైసీపీ ఉన్మాదం పెట్రేగిపోతోందన్నారు. బీసీల హక్కుల రక్షణ కోసం ఉద్యమించాలని, బీసీ రాజకీయ సాధికారతను కాపాడుకోవాలని, 34 శాతం బీసీ రిజర్వేషన్‌ను కాపాడుకోవాలని సూచించారు. బీసీలు పోరాడి సాధించుకున్న హక్కు 34% రిజర్వేషన్ అనీ, ఇప్పుడు పోగొట్టుకుంటే తిరిగి రాదని స్పష్టం చేశారు. దీనిని తాకట్లు పెట్టే అధికారం, పొట్టకొట్టే అధికారం వైసీపీకి లేదన్నారు. కాగా.. స్థానిక సంస్థల్లో 10 శాతం రిజర్వేషన్ కోత విధించిన వైసీపీకి బీసీలు తగిన గుణపాఠం చెప్పాలని టీడీపీ రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఓ ప్రకటనలో పిలుపిచ్చారు. 50 శాతం రిజర్వేషన్లు మించకూడదనే హైకోర్టు తీర్పును అడ్డుగా పెట్టుకుని బీసీలకు జగన్ తీరని అన్యాయం చేశారని.. 60 శాతం రిజర్వేషన్ కోసం ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లాలని టీడీఎల్పీ ఉపనేత నిమ్మల రామానాయుడు పాలకొల్లులో డిమాండ్ చేశారు.

### టీడీపీ-వామపక్షాల పొత్తు యత్నాలు!

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి, వామపక్షాల మధ్య సీట్ల సర్దుబాటు యత్నాలు మొదలయ్యాయి. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అధినేత చంద్రబాబుతో సీపీఐ నేతలు కె.రామకృష్ణ, నేతలు ముప్పాళ్ల నాగేశ్వరరావు, హరనాథరెడ్డి భేటీ అయ్యారు. కలిసి పోటీచేసే అంశంపై వారి మధ్య కొంత చర్చ జరిగింది. ఈ నెల 8న ఉభయ కమ్యూనిస్టు పార్టీల సమావేశం జరుగుతుందని, ఉభయులం కలిసి ఒకే వైఖరితో వెళ్లడానికి ప్రయత్నిస్తున్నామని, తర్వాత మరోసారి కలుస్తామని సీపీఐ నేతలు చెప్పినట్లు సమాచారం. 9నెలల్లో రాష్ట్రాన్ని తొమ్మిదేళ్ల వెనక్కి నెట్టారని, ఇంత జీవన విధ్వంసం కనీవినీ ఎరుగమన్న అభిప్రాయం వ్యక్తమైంది. కూల్చివేతలు, విధ్వంసాలు, కోతలు, రద్దులు, బెదిరింపులు, వేధింపులు, దాడులు, దౌర్జన్యాలు ఈ స్థాయిలో ఎన్నడూ లేవని, అమరావతిని చంపేశారని.. అన్ని ప్రాజెక్టుల పనులను నిలిపివేశారని నాయకులు చెప్పారు. అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు సంఘటితమై వైసీపీ అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని సమావేశం పిలుపునిచ్చింది.

## బీసీ కోటా కోసం సుప్రీంకు టీడీపీ

(మొదటి పేజీ తరువాయి)

24.42 శాతానికి తగ్గించారని పేర్కొన్నారు. 2019 జూన్ 18న ప్రచురించిన గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా ప్రకారం.. రాష్ట్రంలో 48.13 శాతం బీసీ ఓటర్లు ఉన్నారని, ఈ విషయాన్ని హైకోర్టు పరిశీలించాల్సిందని తెలిపారు. గతంలో నాలుగు సందర్భాల్లో సుప్రీంకోర్టు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని అనుమతించిందని గుర్తు చేశారు. కే కృష్ణమూర్తి వర్సెస్ కేంద్రప్రభుత్వం (2010), ఇంద్ర సహానీ వర్సెస్ కేంద్రం (1992) కేసులను పిటిషన్‌లో ప్రస్తావించారు. కాగా..రాష్ట్ర పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, డైరెక్టర్‌లను, 59.85 శాతం రిజర్వేషన్లను సుప్రీంకోర్టులో సవాల్ చేసిన బిర్రు ప్రతాప్‌రెడ్డిని తమ పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చారు.

### బీసీలకు జగన్ తీవ్ర అన్యాయం: రామ్మోహన్

తొలిసారిగా 34 శాతం రిజర్వేషన్లు కుదిస్తూ బీసీలకు అన్యాయం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని టీడీపీ ఎంపీరామ్మోహన్ నాయుడు విమర్శించారు. ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ.. జగన్ తన అనుచరులతో కోర్టులో పిటిషన్ వేయించారని ఆరోపించారు. డిసెంబరు 28న జారీ చేసిన జీవో 176 ప్రకారం ఎన్నికలు జరిపించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు తగ్గించడం వల్ల 15 వేల మంది బీసీలకు రాజకీయంగా అన్యాయం జరుగుతుందన్నారు. బీసీలకు ఎందుకు అన్యాయం చేస్తున్నారని ప్రశ్నించారు. హైకోర్టులో సమర్థ వాదనలు వినిపించేందుకు సరైన న్యాయవాదులను ఎందుకు నియమించలేదని నిలదీశారు. రాజశేఖర్ రెడ్డి హయాంలోనూ 34 శాతంతో ఎన్నికలు నిర్వహించారని, జగన్ తండ్రిని చూసి బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు. రిజర్వేషన్లను తగ్గించి బీసీలను అణగదొక్కేందుకు కుట్ర పన్నుతున్నారని కొనకళ్ల నారాయణ ఆరోపించారు. పథకం ప్రకారమే కోటా తగ్గించారని విమర్శించారు. 'రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లింది వైసీపీ వాళ్లు. అనంతపురంలో జడ్పీటీసీ రామాంజనేయులు. బిర్రు ప్రతాప్ రెడ్డి రెడ్డి సంఘానికి అధ్యక్షుడిగా వైసీపీతో సంబంధంతో ఉన్న వ్యక్తి" అని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ హయాంలో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ప్రారంభమయ్యాయని, తర్వాత 34 శాతానికి పెంచారని తెలిపారు. నిమ్మల కిష్టప్ప మాట్లాడుతూ... పాదయాత్రలో బీసీలకు అనేక హామీలు ఇచ్చారని, బీసీల ఓట్ల వల్లే జగన్ సీఎం అయ్యారని తెలిపారు. ఓట్ల కోసమే ఆనాడు బీసీల జపం చేశారని విమర్శించారు. బీసీల వెన్ను విరిచే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని కొల్లు రవీంద్ర దుయ్యబట్టారు.

### బీసీలు నీకేం అన్యాయం చేశారయ్యా: అచ్చెన్న

"మండలి రద్దుతో 30 మంది బీసీల పదవులకు మంటపెట్టావు. చీకటి జీవో 558తో 16 వేల మంది బీసీ నాయకులకు స్థానిక సంస్థల్లో పదవులు దూరం చేశావు. బీసీల నిధులు రూ.3432 కోట్లు మింగేశావు. జగన్..! నీకేం అన్యాయం చేశారయ్యా బీసీలు? ఇంతలా కక్ష పెంచుకున్నావు" అని టీడీఎల్పీ ఉప నేత అచ్చెన్నాయుడు ట్వీట్ చేశారు. 'జగన్ చీటెడ్ బీసీస్', 'యాంటీ బీసీ జగన్' హ్యాష్ ట్యాగ్స్‌ని తన ట్వీట్‌కు జత చేశారు.

## లోకం తీరు




ఎందుకైనా మంచిదని వివాదాస్పద వ్యాఖ్యలు చేయకుండా ఇలా ఏర్పాటు చేశాను సార్...!

### ఎండాకాలం

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| కడప | 39.0 | 23.0 |
| హైదరాబాద్ | 35.1 | 19.5 |
| గుంటూరు | 34.5 | 21.4 |
| విజయవాడ | 34.3 | 22.5 |
| నెల్లూరు | 33.9 | 24.6 |
| విశాఖపట్నం | 32.2 | 20.8 |

### పలుచోట్ల వర్షాలు

విశాఖపట్నం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ నుంచి విదర్భ, తెలంగాణ మీదుగా తమిళనాడు వరకు ద్రోణి ఆవరించింది. ఇంకా విదర్భ నుంచి తెలంగాణ, తమిళనాడు మీదుగా కొమరిన్ తీరం వరకు మరో ద్రోణి ఉంది. ద్రోణులకు ఉత్తరాదిలో పయనిస్తున్న వెస్ట్రన్ డిస్ట్రబెన్స్ ప్రభావం తోడుకావడం, సముద్రం నుంచి గాలులు వీస్తుండడంతో వాతావరణ అనిశ్చితి నెలకొంది. దీంతో గురువారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురిశాయి. సీతారాంపురంలో రెండు, పెదమేరంగి, పిడుగురాళ్లలో ఒక సెంటీమీటరు వర్షపాతం నమోదైంది. రానున్న ఇరవై నాలుగు గంటల్లో కోస్తా, రాయలసీమల్లో ఉరుములు, పిడుగులతో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా గురువారం రాయలసీమలో ఎండ తీవ్రత పెరిగి కడప, కర్నూలు, అనంతపురంలో 38 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.



### సోనియా 'ఇంటి' నుంచే కరోనా వైరస్ వచ్చిందా?

*సోనియాగాంధీ 'ఇంటి' నుంచే కరోనా వైరస్ వచ్చిందా? అలా అయితే దర్యాప్తు జరపాల్సిందే. ఎందుకంటే వైరస్ బారిన పడినవారిలో ఇటలీవాసులే ఎక్కువ. భారత్‌లో 14 మంది ఇటాలియన్లు కరోనా బారిన పడినట్టు పరీక్షల్లో రుజువైంది. సోనియా 'ఇంటి'(ఇటలీ) నుంచే వైరస్ వ్యాప్తి చెంది ఉంటే నిగ్గు తేల్చాల్సిందే.*

**- హనుమాన్ బేనివాల్, ఆర్ఎల్పీ ఎంపీ**



### హిందూ అతివాదులతో పోరాడండి

*భారత్‌లో ముస్లింల ఊచకోతపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హిందూ అతివాదులు, వారి పార్టీలతో భారత ప్రభుత్వం పోరాడాలి. ఇస్లాం సమాజం నుంచి భారత్ దూరం కాకుండా ఉండాలంటే ముస్లింల ఊచకోతను తక్షణమే అడ్డుకోవాలి.*

**- అయతుల్లా అలీ ఖమేనీ, ఇరాన్ సుప్రీం నేత**

### చేప నూనెతో గుండెకు చేవ

వాషింగ్టన్, మార్చి 5: క్రమంతప్పకుండా చేప నూనె సంబంధిత ఉత్పత్తుల వినియోగం.. అకాల మరణాలు, గుండె వైఫల్య ముప్పును తగ్గిస్తుందని ఓ అధ్యయనం చెబుతోంది. చేప నూనెలో ఉండే ఒమేగా ఫ్యాటీ-3 యాసిడ్స్ ఇందుకు కారణమని పేర్కొంటోంది. ఈ మేరకు అమెరికాలోని బ్రౌన్ యూనివర్సిటీ, చైనాకు చెందిన పరిశోధకులు చేసిన అధ్యయనం ఓ జర్నల్‌లో ప్రచురితమైంది. గుండె సంబంధ, క్యాన్సర్ లేని 40 ఏళ్ల నుంచి 69 ఏళ్ల మధ్య వయసున్న 4,27,678 మంది బ్రిటన్ పౌరులపై ఈ పరిశీలన సాగింది. దాని ప్రకారం చేప నూనె ఉత్పత్తుల వాడకం అన్ని రకాల మరణాల ముప్పును 13 శాతం, గుండె వ్యాధుల మరణాలను 16 శాతం, గుండె సంబంధ మరణాలను 7 శాతం తగ్గిస్తుంది. దీనికి సంబంధించి విస్తృత పరిశోధనల తర్వాత మరిన్ని వివరాలు చెబుతామని పరిశోధకులు అంటున్నారు.

### కార్బొహైడ్రేట్ల వినియోగం తగ్గిస్తే మెదడుకు మేలు

వాషింగ్టన్, మార్చి 5: ఆహారంలో కార్బొహైడ్రేట్ల వినియోగాన్ని తగ్గిస్తే.. మనిషి మెదడులో వయసు రీత్యా వచ్చే ప్రభావాలను నిరోధించవచ్చని అమెరికాలోని స్టోనీ బ్రూక్ యూనివర్సిటీ అధ్యయనంలో తేలింది. న్యూరో బయలాజికల్ మార్పులు వయసుపై ఆధారపడి ఉంటాయని.. 40ల చివర్లో ఇవి మరింత ఎక్కువని వారి పరిశీలనలో స్పష్టమైంది. 18 నుంచి 88 ఏళ్ల వయసు మధ్యనున్న వెయ్యి మందిపై ఈ అధ్యయనం సాగింది. గ్లూకోజ్ స్థాయిలు తగ్గడం, కీటోన్స్ పెరగడం మెదడు పనితీరును స్థిరం చేస్తుందని పీఎన్ఏఎస్ జర్నల్‌లో ప్రచురితమైన కథనం పేర్కొంది.

## శ్రీవారి తెప్పోత్సవాలు ప్రారంభం




తిరుమల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో గురువారం శ్రీవారి తెప్పోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సీతాలక్ష్మణ, అంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి సర్వాంగసుందరంగా అలంకరించిన తెప్పపై పుష్కరిణిలో విహరించారు.

## ప్రశాంతి నిలయంలో సత్యసాయి కాంస్య విగ్రహ ప్రతిష్ఠ


సత్యసాయి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న రత్నాకర్

పుట్టపర్తి, మార్చి 5: సత్యసాయిబాబా 160 కిలోల కాంస్య విగ్రహాన్ని గురువారం పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో ఘనంగా ప్రతిష్ఠించారు. సాయికుల్వంతు హాల్లోని మహాసమాధి వెనుక భజన మందిరంలో ట్రస్టు సభ్యులు ఆర్‌జే రత్నాకర్, పండితులు విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. జూలై 24, 2002లోనే సత్యసాయి ఈ విగ్రహాన్ని గురుపౌర్ణమి సందర్భంగా ఆవిష్కరించారు. ఇటలీకి చెందిన నిమ్మోఆల్‌బెర్లో మూడు సంవత్సరాలు కష్టపడి విగ్రహాన్ని తయారుచేసి సత్యసాయికి అందజేశారు.

## లేపాక్షి ఉత్సవానికీ వైసీపీ రంగులే!



గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వాటర్ ట్యాంకులకూ వైసీపీ రంగులద్దిన అధికార పార్టీ.. చివరికి లేపాక్షి ఉత్సవాలనూ వదలడం లేదు. లేపాక్షి ఉత్సవాల్లో భాగంగా వంద ఎడ్లబండ్లతో శోభాయాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. ఆ ఎడ్లబండ్ల చక్రాలకు వైసీపీ రంగులద్ది ప్రదర్శనకు సిద్ధం చేస్తున్నారు. అధికారుల అత్యుత్సాహంపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి.

-ఆంధ్రజ్యోతి, అనంతపురం

KENDRIYA VIDYALAYA NO2, GOLCONDA, HYDERABAD-08
E-mail:kvgolkd2@gmail.com, Tel. No 040-23566016

TENDER NOTICE

Sealed tenders are invited from reputed and registered firms dealing with the supply of **1. Track suits, 2. T- Shirts and shorts, 3. Sports shoes (joggers), socks and sports caps, 4. Blazers, 5. White shirts. 6. Cricket dress.** Tender documents for the supply of above materials can be obtained from the Vidyalaya office during the working hours (09.00 hrs. to 15.00 hrs.) on payment of Rs.1000/-. The same may be downloaded from the website of KV No2 Golconda. **(http://no2golconda.kvs.ac.in) Last date for the submission of tenders is 27.03.2020 before 16.00 hrs.**

Sd/- PRINCIPAL

## 2014కి ముందు చేసిన ఖర్చుకు.. ఆడిట్ నివేదిక ఇవ్వాల్సిందే!

- అప్పుడే పోలవరానికి నిధుల విడుదల
- లోక్‌సభలో జలశక్తి మంత్రి స్పష్టీకరణ

న్యూఢిల్లీ/అమరావతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన నాటికి.. అంటే 2014కి ముందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుపై ఖర్చుచేసిన రూ.5,135.87 కోట్లకు పూర్తిస్థాయిలో ఆడిట్ నివేదికను సమర్పించాకే కేంద్రం నుంచి నిధులు విడుదల చేస్తామని కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు నిధుల విడుదలపై లోక్‌సభలో టీడీపీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ గురువారం అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ప్రాజెక్టు కోసం నూరు శాతం నిధులు కేంద్రమే ఇస్తుందన్నారు. అయితే 2014 మార్చి 31 వరకు పెట్టిన ఖర్చుకు సంబంధించిన ఆడిట్ వివరాలు సమర్పిస్తే తప్ప తదుపరి నిధులు విడుదల చేయబోమని తేల్చిచెప్పారు. ఈ వివరాలు సమర్పించాలని 2018 జూలై 26న, మళ్లీ నిరుడు నవంబరు 16న కేంద్ర ఆర్థిక శాఖ లేఖలు రాసిందన్నారు. 2014కి ముందు ఖర్చుచేశామంటున్న రూ.5,175.25 కోట్లలో రూ.3,777.44 కోట్లకు హైదరాబాద్‌లోని ప్రిన్సిపల్ ఆడిటర్ జనరల్ (పీఏజీ) కార్యాలయం ఆడిట్ రిపోర్టు సమర్పించిందని వెల్లడించారు. మిగిలిన మొత్తానికి కూడా ఆడిటర్ జనరల్ నివేదిక వచ్చాకే మిగిలిన నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. పోలవరానికి గత నెలలో ఇచ్చిన రూ.1,850 కోట్లతో కలిపి మొత్తం రూ.8,614.16 కోట్లను కేంద్రం విడుదల చేసినట్లు వివరించారు. 2013-14 ధరల నాటికి సవరించిన వ్యయ అంచనాలను పరిగణనలోకి తీసుకుంటే ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.54,466.1 కోట్లు ఉంటుందని కేంద్ర జలసంఘం 2019 మే 7న రాసిన లేఖలో తెలిపిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నివేదికల ప్రకారం.. ఈ ప్రాజెక్టు 2021 డిసెంబరులోపు పూర్తవుతుందని చెప్పారు. కాగా.. ఆడిటర్ రిపోర్టు వస్తేనే నిధులు విడుదల చేస్తామని కేంద్రం స్పష్టం చేయడంతో.. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంటుంది. అంతేగాక.. ప్రాజెక్టును 2021కి పూర్తి చేయాలంటే.. సొంత నిధులు ఖర్చుచేయక తప్పదని జల వనరుల శాఖ వర్గాలు చెబుతున్నాయి.

### జగన్ హయాంలో 2.70% పనులే పూర్తి

ఏపీలో జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పోలవరం పనులు పెద్దగా ముందుకు సాగలేదని..9 నెలల్లో 2.70 శాతం పనులే జరిగాయని కేంద్రం చెప్పకనే చెప్పింది. 2019 ఎన్నికల తర్వాత జరిగిన తొలి పార్లమెంటు సమావేశాల్లో.. చంద్రబాబు హయాంలో ప్రాజెక్టు పనులు 66.74 శాతం పూర్తయ్యాయని జలశక్తి శాఖ సహాయమంత్రి రతన్ లాల్ కటారియా చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరి 27 నాటికి ప్రాజెక్టు నిర్మాణ పనులు 69.54 శాతం పూర్తయ్యాయని గురువారం లోక్‌సభలో జలశక్తి మంత్రి షెకావత్ వెల్లడించారు. అంటే వైసీపీ సర్కారు వచ్చాక 2.70 శాతం పనులే జరిగాయన్న మాట.

# పుర‘పాలకుల’లో అంతా గుంభనమే!

- ‘స్థానిక’ ఎన్నికల తరుణంలో రహస్య జీవోలు
- అధికార పార్టీకి అనుకూలంగా తతంగం?

అమరావతి, మార్చి5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలకు త్వరలో ఎన్నికలు జరగనున్న తరుణంలో పురపాలక శాఖ వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు, ఊహాగానాలకు తావిస్తోంది. కొద్ది రోజులుగా ఈ శాఖ ఉన్నతాధికారులు వరుసగా జారీ చేస్తున్న ‘రహస్య ఉత్తర్వులు (కాన్ఫిడెన్షియల్ జీవోలు)’ ఇందుకు ఆస్కారమిస్తున్నాయి. సాధారణంగా ఉద్యోగుల సర్వీస్ వ్యవహారాలు, శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తదితరాలకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులను లేదా గోప్యంగా ఉంచాల్సిన అధికారిక అంతర్గత సమాచారాన్ని కాన్ఫిడెన్షియల్ జీవోల రూపంలో ప్రభుత్వం ఇస్తుంటుంది. వాటిల్లో చాలా ఉత్తర్వుల్లోని వివరాలు బయటికి తెలియకున్నా, ఆ తర్వాత కొద్ది రోజులకు మాత్రం వెల్లడవుతుండడం పరిపాటి. కానీ పురపాలక శాఖ ఈ వారంలో జారీ చేసిన సుమారు 10 కాన్ఫిడెన్షియల్ జీవోల్లోని వివరాలేమిటో రోజులు గడిచిపోతున్నా ఏమాత్రం బయటికి పొక్కకపోవడం గమనార్హం!. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ప్రజా ప్రతినిధులందరూ తీవ్ర ఉత్కంఠకు గురవుతున్నారు. తమ రాజకీయ భవితను శాసించనున్న పట్టణ స్థానిక సంస్థల్లో తమ పరిధిలోని పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఎలాగోలా జయకేతనాన్ని ఎగురవేసి, పదవులను కాపాడుకోవాలన్న తాపత్రయంలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో పార్టీల జయాపజయాలను నిర్దేశించడంలో రిజర్వేషన్లు అత్యంత కీలక పాత్ర పోషించనున్నాయని భావిస్తున్న వీరు.. ఎక్కడికక్కడ అవి తమకు అనుకూలంగా ఉండేలా జాగ్రత్త పడుతున్నారు. రిజర్వేషన్లను ఖరారు చేసి, ఆ వివరాలను అధికారికంగా ప్రకటించినట్లయితే (జనరల్ జీవోల రూపంలో) ఆ తర్వాత వాటిల్లో మార్పుచేర్పులు, సవరణలు చేయడం కష్టమవుతుందని, వివాదాలకు ఆస్కారమిస్తుందన్న ఉద్దేశంతోనే కాన్ఫిడెన్షియల్ జీవోలను జారీ చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై వివరాలు తెలుసుకునేందుకు పురపాలక శాఖ ఉన్నతాధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ స్పందన లేకపోవడం.. పైన పేర్కొన్న అనుమానాలకు ఊతమిస్తోంది!

### అర్ధరాత్రి 12 ‘రహస్య’ జీవోలు.. అందులో 6 స్థానిక ఎన్నికలవే

రాత్రిపొద్దు పోయాక జీవోలు జారీ చేయడం... అందులోనూ కాన్ఫిడెన్షియల్ పేరిట కొన్నింటి వివరాలను దాచిపెట్టడం! ఈ పరంపర కొనసాగుతోంది. గురువారం అర్ధరాత్రి ఒకేసారి, ఏకంగా 12 రహస్య జీవోలు జారీ చేశారు. అందులో ఆరు స్థానిక ఎన్నికలకు సంబంధించినవే కావడం గమనార్హం. స్థానిక సంస్థల ఎన్నికలకు తూర్పుగోదావరి, నెల్లూరు జిల్లాల్లో జడ్పీటీసీ, మండలాధ్యక్షుల రిజర్వేషన్లను ఆయా జిల్లా కలెక్టర్లు ఖరారుచేశారు. తూర్పుగోదావరిలో ఎంపీటీసీల కోటాను కూడా నోటిపై చేశారు. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి ఉత్తర్వులిచ్చారు. ఈ వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించారు.

### రిజర్వేషన్లపై మార్పుచేర్పుల కోసమేనా!?

ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నెలాఖర్లోగా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి చేయాల్సిందేనని ముఖ్యమంత్రి జగన్ పట్టుదలగా ఉండడం, ఆ దిశగా అధికారగణానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం తెలిసిందే. అదే సమయంలో ఈ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 90కిపైగా స్థానాలను కైవశం చేసుకోవాల్సిందేనని ఆ పార్టీకి చెందిన మంత్రులు, ప్రజా ప్రతినిధులకు స్పష్టం చేయడం, ఈ విషయంలో విఫలమైన మంత్రులకు ఉద్వాసన, ఇతర ప్రజా ప్రతినిధులకు భవిష్యత్తులో రాజకీయావకాశాలు ఉండబోవనడమూ విదితమే.

VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)

'E' Procurement Notice No.43/VMC/AE/2019-20, Dt.05-03-2020

| Sl. No. | Name of Work | Estimate Amount Rs.in Lakhs |
|---|---|---|
| 1 | Providing BT Roads, Providing CC Roads, Providing UGD lines, Providing foot paths , establishment of STP, Construction of Karmal Bhavan, providing piped drains, CC drains, Providing water supply distribution line, Construction of Gym building, Construction of class rooms (38 Works) | 3820.16 |

Contact : Superintending Engineer (Works), VMC, Vijayawada-520 001
Further details can be seen @ 'e' procurement market place @ www.tender.apeprocurement.gov.in
download of bid documents starts : 10-3-2020 @ 04.00 PM
Last date /time for receipt of tenders : 24-03-2020 up to 4.30 PM
S/d- For Commissioner

GOVERNMENT OF ANDHRA PRADESH
MUNICIPAL ADMINISTRATION DEPARTMENT
MACHILIPATNAM MUNICIPAL CORPORATION
'e'- PROCUREMENT NOTICE
Corrigendum Tender Notice No: 15/MMC/MGF/14th FC/2019-20.

| Corrigendum For | Read as |
|---|---|
| 1) Bid document Download starting Date: 04.02.2020, 06:00 PM | 1) Bid document Download starting Date: 04.03.2020, 06:00 PM |
| 2) Bid document Download End Date 12.02.2020 , 03:00 PM | 2) Bid document Download End Date 12.03.2020, 03:00 PM |
| 3) Last Date & time for Receipt of Bids : 12.02.2020, 03:30 PM | 3) Last Date & time for Receipt of Bids : 12.03.2020, 03:30 PM |
| 4) Technical Bid opening date : 12.02.2020, 04:00 PM | 4) Technical Bid opening date 12.03.2020, 04:00 PM |

Name and Address: Municipal Commissioner, Machilipatnam Municipal Corporation Pin code No. 521 001, FAX 08672- 222856, Further details can be seen @ 'e'-procurement market place www.eprocurement.gov.in
Sd/-(S. Sivarama Krishna) Municipal Commissioner Machilipatnam Municipal Corporation

## ‘అమ్మ ఒడి’ రసాభాస


ఏలూరు కలెక్టరేట్ వద్ద అమ్మ ఒడి లబ్ధిదారుల అవస్థలు

ఏలూరు సిటీ, మార్చి 5 : ‘అమ్మ ఒడి’ ప్రత్యేక స్పందన కార్యక్రమం రసాభాసగా మారింది. తోపులాటలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. పశ్చిమ గోదావరి జిల్లాలో వివిధ కారణాల వల్ల 71,044 అమ్మ ఒడి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టారు. వీరి సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు ఏలూరు కలెక్టరేట్‌లో గురువారం ప్రత్యేక స్పందన నిర్వహించారు. ఈకార్యక్రమానికి 20 వేల మందికి పైగా హాజరయ్యారు. దీంతో పరిస్థితి అదుపు తప్పింది. తోపులాట చోటుచేసుకుంది. పలువురు స్పృహ తప్పి పడిపోయారు. అరుపులు, కేకలతో కలెక్టరేట్ ప్రతిధ్వనించింది. దీంతో అధికారులు దరఖాస్తుల స్వీకరణను స్థానిక స్టేడియం గ్రౌండ్‌లోకి మార్చారు. గోదావరి సమావేశ మందిరంలోకి ఒక్కసారిగా దరఖాస్తుదారులను అనుమతించటంతో అక్కడా పరిస్థితి అదుపుతప్పి రసాభాసగా మారింది. తొక్కిసలాట ఏర్పడడంతో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించటం ఎలా ఉన్నా వారిని అదుపు చేయడం పోలీసులకు కష్టమైంది.

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్
వినియోగదారు వ్యవహారాలు, ఆహార & ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ
(వినియోగదారు వ్యవహారాల శాఖ), భారత ప్రభుత్వం
మనక్ భవన్, 9 బహదూర్ షా జాఫర్ మార్గ్, న్యూఢిల్లీ - 110002

ప్రకటన నం. 1/2020/ESTT కి సవరణ

1. టెక్నికల్ అసిస్టెంట్ (ల్యాబ్.) ఉద్యోగానికి ప్రకటించిన ఖాళీల సంఖ్య, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌లో టెక్నికల్ అసిస్టెంట్ (ల్యాబ్.) మరియు సీనియర్ టెక్నీషియన్ ఉద్యోగ నియామకానికి జారీ చేయబడిన ప్రకటన నం. 1/2020/Estt. తేది 14 ఫిబ్రవరి 2020కి పాక్షిక మార్పులను దిగువ విధంగా చదువుకొనగలరు.

| | | |
|---|---|---|
| కెమికల్ - 08 | మెటలర్జీ - 01 | బయో-కెమిస్ట్రీ - 01 |
| ఫుడ్ టెక్నాలజీ - 01 | బయో-టెక్నాలజీ - 01 | మెకానికల్ - 04 |
| ఫిజిక్స్ - 01 | ఎలక్ట్రికల్ - 01 | ఎలక్ట్రానిక్స్ - 01 |
| మైక్రో బయోలజీ - 06 | సివిల్ - 05 | |

2. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు ఆఖరి తేది **15 మార్చి 2020 (సా. 6.00 గం.)** వరకు పొడిగించబడింది.
3. ప్రకటన ఇతర నియమ నిబంధనలలో ఎట్టి మార్పులేదు.

డైరెక్టర్ (ఎస్టాబ్లిష్‌మెంట్)
బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్

DAVP 08103/11/0017/1920

## ఇంటర్ సెకండియర్ పరీక్షకు 97.43% హాజరు

- 12,076 మంది గైర్హాజరు.. నలుగురిపై మాల్‌ప్రాక్టీస్ కేసులు

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2కు 97.43% మంది హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 4,69,203 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా, వీరిలో 4,57,127 మంది హాజరయ్యారు. 12,076 మంది గైర్హాజరయ్యారు. నాలుగు మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1 ప్రశ్నపత్రానికి సంబంధించి సెట్ నం.2ని డ్రా ద్వారా ఎంపికచేసి, అన్ని పరీక్ష కేంద్రాలకు సమాచారం ఇచ్చారు. రాష్ట్రంలోని 1411 సెంటర్లలో పరీక్షలు జరుగుతున్నాయి.

### కొత్త సిలబస్‌కు బదులుగా ‘ఓల్డ్’ ప్రశ్నపత్రం

ఎమ్మిగనూరు టౌన్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలో రెగ్యులర్ విద్యార్థికి న్యూ సిలబస్ ప్రశ్నపత్రం బదులు ఓల్డ్ సిలబస్ ప్రశ్నపత్రం ఇచ్చిన ఘటన కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండియర్ సీఈసీ చదివిన విజయ్‌కుమార్ (హాల్ టికెట్ నం:2010317064) గురువారం వైష్ణవి కాలేజీలో పరీక్ష రాసేందుకు వెళ్లాడు. అతడికి న్యూ సిలబస్ ప్రశ్నపత్రం ఇవ్వాల్సి ఉండగా ఓల్డ్ సిలబస్ ప్రశ్నపత్రం ఇచ్చారు. తాను రెగ్యులర్ స్టూడెంట్ అని చెప్పినా అధికారులు పట్టించుకోలేదని వాపోయాడు. ఈ విషయమై విద్యార్థి సంఘాల నాయకులు అధికారులను నిలదీయగా.. అతడు ఫస్టియర్‌లో కాలేజీకి సక్రమంగా రాలేదని, 75శాతం హాజరు లేకపోవడంతో చలానా కట్టి పరీక్ష రాశాడని, అలాంటి విద్యార్థిని బోర్డు ప్రైవేట్ స్టూడెంట్‌గా పరిగణిస్తుందని అందుకే ఓల్డ్ సిలబస్ ప్రశ్నపత్రం ఇచ్చామన్నారు.

### ఇంట్లో తండ్రి మృతదేహం.. తనయుడు పరీక్షకు!

గరివిడి: విజయనగరం జిల్లా గరివిడి మండలం దుమ్మెద గ్రామానికి చెందిన పతివాడ రాంబాబు తండ్రిని కోల్పోయిన బాధలోనే గురువారం ఇంటర్ పరీక్షకు హాజరయ్యాడు. బుధవారం అర్ధరాత్రి అతని తండ్రి అనారోగ్యంతో మరణించాడు. తండ్రి మరణంతో కన్నీరుమున్నీరైన రాంబాబు పంటిబిగువున బాధను అణచుకుని చీపురుపల్లిలో పరీక్ష రాసి వచ్చి అంత్యక్రియలు నిర్వహించాడు.

## ‘నీట్’ ర్యాంకుల్లో ఎవరెక్కడ?

- పీజీ నీట్‌లో ఏపీ నుంచి 6,600 మందితో జాబితా
- వచ్చే వారం కౌన్సెలింగ్.. జీవో 43పై నివేదికే కీలకం

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పీజీ వైద్య జాతీయ అర్హత పరీక్ష(నీట్)లో 6,600 మంది మన రాష్ట్ర విద్యార్థులకు ర్యాంకులు ప్రకటించారు. ఈ మేరకు ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వైస్ చాన్సలర్(వీసీ) డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ గురువారం జాబితాను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో 1,60,876 మంది నీట్ రాయగా, 96,626 మంది అర్హత సాధించారని, ఏపీ నుంచి 11,635 మంది రాయగా, 6,600 మంది ఉత్తీర్ణులయ్యారని, వీరికి ర్యాంకులు ప్రకటించినట్టు చెప్పారు. డెంటల్ నీట్‌లో 538 మందికి ర్యాంకులు విడుదల చేశామన్నారు. జాబితాలోని అభ్యర్థులు ఏపీలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారేనని చెప్పారు. వచ్చే వారంలో కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదలవుతుందని చెప్పారు. ప్రస్తుతం జీవో43పై కొంత గందరగోళం ఉందని, దీనిపై స్పష్టత ఇచ్చేందుకు ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. క్రమిటీ రిపోర్టు అందేలోగా నోటిఫికేషన్ విడుదల చేసి, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేస్తామని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ శంకర్ తెలిపారు.

**పీజీ, ఎండీఎస్ నీట్ ఫలితాల్లో.. తొలి పది మంది**

| ర్యాంక్ | పీజీ నీట్ | ఎండీఎస్ నీట్ |
|---|---|---|
| 1 | చప్పా ప్రవల్లిక(విశాఖ) | ఎం.వెంకటసౌమ్య(పశ్చిమగోదావరి) |
| 2 | పోతిరెడ్డి శరణ్య(కర్నూలు) | కొమ్మినేని దివ్యశ్రీ |
| 3 | కొలాలి సాయి సమర్థ్(అనంతపురం) | బి.దినకర్‌రెడ్డి(చిత్తూరు) |
| 4 | పి. సౌమ్య(చిత్తూరు) | జి. కావ్యశ్వేత(విశాఖ) |
| 5 | సాయిశ్రీ హర్ష(పశ్చిమగోదావరి) | ఎస్.లక్ష్మీచందన(కడప) |
| 6 | గుడిమెట్ల ప్రియాంక(విజయనగరం) | కళ్లేపల్లి మేఘన(విశాఖ) |
| 7 | అచ్యుత దత్తాత్రయ(నెల్లూరు) | వంగా చందన(గుంటూరు) |
| 8 | సయ్యద్ ఖలీలుల్లా(కర్నూలు) | ఎస్.లలిత శ్రీరోజా(తూర్పుగోదావరి) |
| 9 | డి.సురేశ్(శ్రీకాకుళం) | ఎస్.వినీత రెడ్డి(కడప) |
| 10 | తలసిల కృష్ణ(తూర్పుగోదావరి) | ఎస్. హిమబిందు(పశ్చిమగోదావరి) |







## భ్రష్టుపట్టిన పోలీసు వ్యవస్థ: హర్షకుమార్

మండపేట, మార్చి 5: రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ భ్రష్టుపట్టింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాటాడితే చాలు వారిపై కేసులు నమోదు చేస్తున్నారు” అని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. గురువారం తూర్పుగోదావరి జిల్లా మండపేట ప్రభుత్వాసుపత్రిలో గ్యాంగ్ రేప్ బాధితురాలిని ఆయన పరామర్శించారు. వివరాలు తెలుసుకొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిందితులకు ఉరిశిక్ష వేయాలని, లేకుంటే వారిని తనకు అప్పగించాలని బాధితురాలు కోరినట్టు హర్షకుమార్ చెప్పారు. కులం, మతం చూడకుండా బాధితురాలికి న్యాయం జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉపముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్యే వేగుళ్ల సంఘటన జరిగి రెండురోజులు కావస్తున్నా ఇప్పటివరకు బాధితురాలిని పరామర్శించక పోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. బాధితురాలికి న్యాయం చేయకుంటే రాష్ట్రస్థాయిలో దళిత సంఘాలు ఉద్యమిస్తాయని ప్రకటించారు.

## అప్పులబాధతో కౌలు రైతు ఆత్మహత్య

అచ్చంపేట, మార్చి 5: గుంటూరు జిల్లా అచ్చంపేట మండలం కొండూరు గ్రామానికి చెందిన కౌలు రైతు ఆలా కోటయ్య(35) గురువారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం కోటయ్య తన మూడెకరాలతో పాటు నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి పంటలు వేశాడు. మిర్చి దిగుబడులు తగ్గటం, తాలు కాయలు ఎక్కువ ఉండటంతో అప్పులపాలయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

# అరుదైన వ్యక్తిత్వం

ఆ కాలపు మరొక సంపాదక దిగ్గజం అస్తమించింది. నార్ల వెంకటేశ్వరరావు, నండూరి రామమోహనరావు శ్రేణిలో తరువాతి వారు, విశిష్ట వ్యక్తిత్వంతో తెలుగు సమాజంపై ప్రభావం వేసిన వారు అయిన పొత్తూరి వెంకటేశ్వరరావు సుదీర్ఘమైన, తీవ్రమైన అనారోగ్యంతో గురువారం నాడు మరణించారు. ఎనభై ఆరేళ్ల వయసులో చనిపోవడం కాలధర్మమే అనిపించినా, కడదాకా ఆయన ప్రజాజీవితంలో క్రియాశీలురుగా ఉండడంతో ఈ నిష్క్రమణ అకాలమే అనిపిస్తుంది. ప్రజాస్వామికవాదిగా, మానవ, పౌర హక్కుల కోసం తపించిన వ్యక్తిగా, సంఘంలో అర్థవంతమైన శాంతిని స్థాపించడానికి కృషి చేసినవారిగా ఆయనను తెలుగు సమాజం చిరకాలం గుర్తుపెట్టుకుంటుంది.

1950 దశకంలో 'ఆంధ్రజనత' పత్రికతో ప్రారంభమైన పొత్తూరి పాత్రికేయ జీవితం, అనేక సంపాదకత్వ స్థానాలను అందుకుని, ఉమ్మడి రాష్ట్రంలో ప్రెస్ అకాడమీ అధ్యక్షులు కావడం దాకా కొనసాగింది. అనంతరం కూడా గ్రంథ రచయితగా, పత్రికావ్యాస రచయితగా ఆయన వ్యాసంగం కొనసాగుతూనే వచ్చింది. తెలుగు విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్ ఇచ్చి గౌరవించింది. సంపాదకులుగా, పత్రికారచయితగా ఆయన విశిష్టత, ప్రత్యేకత పాత్రికేయులకు, పాఠకులకు మాత్రమే తెలుసును కానీ, ఆయన ప్రజాజీవితం అంతకు మించిన విస్తృతి కలిగినది. ఆయన పత్రికలలో తీసుకున్న వైఖరుల కంటె, తాను ఒక ప్రముఖ వ్యక్తిగా తీసుకున్న వివిధ వైఖరులు ఆశ్చర్యకరమైనవి, సాహసోపేతమైనవి.

పొత్తూరి వెంకటేశ్వరరావును తెలంగాణ సమాజం కృతజ్ఞతతో స్మరించుకుంటున్నది. ఆంధ్రప్రాంతం నుంచి ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌కు తరలివచ్చిన పొత్తూరి, తన బంధువు వల్లూరి బసవరాజు (వి.బి.రాజు) లాగానే 1969 తెలంగాణ ఉద్యమాన్ని సమర్థించారు. మలిదశ ఉద్యమానికి కూడా ఆయన ఇచ్చిన నైతిక మద్దతును కెసిఆర్ కూడా స్మరించుకున్నారు. తెలంగాణకు ఆయన ఇచ్చిన మద్దతు, తక్కిన చోట్ల విముఖతను కలిగించలేదు. అందరికీ ఆమోదనీయమైన వ్యక్తిత్వ స్థాయిని ఆయన అందుకున్నారు. విలువలు కలిగిన పాత్రికేయుడని చంద్రబాబు, ఆదర్శప్రాయుడని జగన్ నివాళులర్పించారు.

ఆధ్యాత్మికతపై అభినివేశం, దైవభక్తి ఉన్న పొత్తూరి, వాటికి విరుద్ధమైన విశ్వాసాలున్న కమ్యూనిస్టులతో కలసి నడవడం విశేషం. ప్రభుత్వం నక్సలైట్ల మధ్య చర్చలు జరగాలని, శాంతి నెలకొనాలని పౌరస్పందన వేదిక ద్వారా కృషి చేశారు ఆయన. నల్లమల ముఖద్వారం నుంచి నక్సలైట్ ప్రతినిధులను చర్చలకు తోడ్కొని వచ్చినవారిలో ఆయనకూడా ఒకరు. విప్లవకారుల ఆశయాలపై, వ్యక్తిత్వంపై గౌరవం, నమ్మకం లేకపోతే, ఆయన అంతటి ప్రమాదకరమైన బాధ్యతలను తీసుకుని ఉండేవారు కాదు. ఇటీవలి కాలంలో, వరవరరావు నిర్బంధాన్ని, రాష్ట్రంలో పెరుగుతున్న నిర్బంధ చర్యలను ఆయన సభాముఖంగా ఖండించారు. కేన్సర్ వ్యాధితో పోరాడుతూ కూడా, తాను నమ్మిన సామాజిక బాధ్యతను విడనాడలేదు. మృదుభాషి, స్పందనశీలి అయిన పొత్తూరి అధ్యయన శీలతను విడనాడలేదు. సమాజం నేర్పిన పాఠాలను కూడా ఆయన నేర్చుకుంటూనే ఉన్నారు. ఆర్థిక, రాజకీయ సమానత్వాలనే కాదు, సామాజిక న్యాయాన్ని కూడా ఆయన కోరుకున్నారు. ఒక ప్రజాసమస్య ఆందోళనకరమై, ఒక అండ కోరుకున్నప్పుడు, ఆయన తానున్నానంటూ ముందుకు వచ్చేవారు.

నార్ల వెంకటేశ్వరరావు పదునైన రచనకీ, నిర్భయ సంపాదకీయాలకూ పెట్టింది పేరు. పాత్రికేయ జీవితం కాక, ఆయనకు సాహిత్య జీవితం కూడా ఉండేది. హేతువాదిగా, ప్రాశ్నికుడిగా, వేమన మార్గంలో కవిగా ఆయన తెలుగు సమాజానికి తెలుసు. నండూరి రామమోహనరావు పాత్రికేయ రచన సంయమనానికి, నిష్పాక్షికతకు ప్రసిద్ధిచెందగా, శాస్త్రీయ దృష్టి కలిగిన వైజ్ఞానిక రచయితగా, సరళమధురమైన వచనశైలి కలిగిన అనువాదకుడిగా, కవిగా ఆయన అభిమానులను సంపాదించుకున్నారు. పాత్రికేయ జీవితంతో పాటు, నార్లకు, నండూరికి సాహిత్యజీవితం ఉండగా, పొత్తూరికి ప్రజాజీవితం ఉన్నది.

వ్యక్తిగతంగా ఆయన జిల్లెళ్లమూడి అమ్మ భక్తులు. పీఠాధిపతులకు సన్నిహితులు. తెలుగులో ఆధ్యాత్మిక పదకోశం రూపొందించారు. తెలుగు పత్రికల చరిత్రపై ఆయన రాసిన పుస్తకాన్ని ప్రెస్ అకాడమీ ప్రచురించింది. తొలినాటి పత్రికలనేకం గురించి ఆయన అందులో సమాచారం అందించారు. అందుకోసం పరిశోధకుడిగా కృషిచేశారు. 'నాటి పత్రికలు మేటి విలువలు' అన్నది ఆయన మరొక మేలి పుస్తకం. పి.వి. నరసింహారావు పాలనపై ఇంగ్లీషులో ఆయన ఒక పుస్తకం రాశారు. సంపాదకీయాలు, శీర్షికావ్యాసాలు సరేసరి. విశ్వవిద్యాలయాల్లో జర్నలిజం కోర్సులకు పాఠాలను రూపొందించే పనికి కూడా ప్రధాన సంపాదకుడిగా ఆయన వ్యవహరించారు. వృత్తిజీవితంలో ఆయన బహుముఖాలుగా రాణించారు. పత్రికా రచన, సామాజిక వివేచన, ఆధ్యాత్మిక చింతన– ఈ మూడు కలిస్తే పొత్తూరి అవుతారు.

పరుల కోసం ఆలోచించడం, వ్యవస్థను మెరుగుపరచడానికి నిర్భీతితో ముందుకు రావడం– అరుదైపోతున్న సమయంలో పొత్తూరి నిష్క్రమణ బాధాకరం. ఉన్మాదం లేని ఆధ్యాత్మికత, సమాజం గురించిన పట్టింపు, బాధితులపై ఆర్తి, పరువు ప్రతిష్ఠలను ప్రభావశీల ఆచరణగా మార్చగలిగిన తెగువ– వీటన్నిటికి పొత్తూరి ఒక ఉదాహరణగా నిలబడతారు.

## నార్లమాట
# చరిత్ర రచన

**ఏ జాతి చరిత్రలోనైనా మంచి చెడ్డలుంటాయి, బాగోగులుంటాయి, వెలుగునీడలుంటాయి. ఈ విషయాన్ని కప్పిపుచ్చేది ఏమైనా కావచ్చు గాని, చరిత్ర మాత్రం కాదు. అయినా మన దేశ చరిత్రలు పెక్కింటిలో అహంకారమే హెచ్చుగా కానవస్తుంది.**

'చరిత్ర పాఠాన్ని మనను నేర్చుకోమన్నదే చరిత్ర నేర్పే పాఠం' అని హెగెల్ చెప్పిన మాట మన విషయంలో మరింత నిజం! పురాణాలే తప్ప అయిదారు వందల సంవత్సరాల క్రితం వరకు మనకు చరిత్రలే అసలు లేవు. అంతకు ముందు బాణభట్టు హర్ష చరిత్రను వ్రాసినా, దాన్ని చరిత్ర అనడం కంటె కావ్య మనడమే ఎక్కువ సమంజసం. ఆ తర్వాత వచ్చిన రాజతరంగిణి సగం పురాణం కాగా, సగం మాత్రమే చరిత్ర!

ఇదివరలోనే కాక, ఇప్పుడు సయితం ఒక జాతిగా మనకు ఐతిహాసిక దృష్టి తక్కువే! కనుకనే పురాణాలనే చరిత్రలుగా పరిగణించడమేమి, వానిలోని విషయాలను సరిగా పరిశీలించకనే చారిత్రక సత్యాలుగా స్వీకరించడమేమి సంభవిస్తున్నది.

శాస్త్రీయ పద్ధతులపై చరిత్రను వ్రాస్తున్నామని చెప్పు కొంటున్న వారిలో సయితం పెక్కుమంది తమ రాగద్వేషాలకు ప్రాధాన్యమిస్తున్నారు. శ్రీ కె. యం.మున్షీ గారి ప్రాపకంలో కొత్తగా వెలువడుతున్న బృహత్తర చరిత్రనే చూడండికేవలం ఆర్యజాతి దృక్పథం నుంచి దీన్ని వ్రాస్తున్నారు. మరి కొన్నింటిని చూడబోతే, వాటిలో ఏ కులాభిమానమో, ప్రాంతీయాభిమానమో ద్యోతకమౌతూ వుంటుంది!

ఏ జాతి చరిత్రలోనైనా మంచి చెడ్డలుంటాయి, బాగోగులుంటాయి, వెలుగు నీడలుంటాయి. ఈ విషయాన్ని కప్పిపుచ్చేది ఏమైనా కావచ్చు గాని, చరిత్ర మాత్రం కాదు. అయినా మన దేశ చరిత్రలు పెక్కింటిలో అహంకారమే హెచ్చుగా కానవస్తుంది. ఆర్యులెక్కడివారు? ఇక్కడి వారే! మన దేశం నుంచే ఇతర దేశాలకు వారు వలస వెళ్ళారు. ఏది ఉత్తమ సంస్కృతి? మనదే! మనమే సమస్త ప్రపంచానికి సంస్కృతి భిక్షను పెట్టాము ఈ ధోరణి మన చరిత్రలలో హెచ్చుగా కానవస్తున్నది.

అనుచితమైన ఈ ధోరణిని ఖండిస్తూ మొన్న హైదరాబాద్ లో కేంద్రమంత్రి డాక్టర్ హుమాయూన్ కబీర్ చేసిన ప్రసంగం ఎంతైనా హర్షించదగినట్టిది. ఆయన సూచించినట్టు , అన్నిటి చరిత్రల వలెనే భారతదేశ చరిత్ర నిమ్నోన్నతాలతో కూడినట్టిది, ఎన్నెన్నో ప్రభావాలను అంతర్లీనం చేసుకొనడం ద్వారా రూపొందినట్టిది భారతీయ సంస్కృతి. ఈ సత్యాన్ని మరగుపరిచితే చరిత్ర నుంచి మనం ఏ పాఠం నేర్చుకొనమన్నదే కాగలదు!

*1962 సెప్టెంబర్ 15 ఆంధ్రజ్యోతి సంపాదకీయం 'చరిత్ర రచన' నుంచి.*

# కరోనా కల్లోలంలో 'కుట్రల' కాలుష్యం

కరోనా వైరస్ ధరిత్రి నాలుగు దిశలకూ వ్యాపిస్తూనే వున్నది. ప్రపంచ వ్యాప్తంగా కరోనా వైరస్ సోకిన వారి సంఖ్య ప్రతి రోజూ పెరుగుతూనే వున్నది. ఈ విశ్వమారి ఎంత వేగంగా విస్తరిస్తున్నదో అంతేవేగంగా దాని గురించిన కుట్ర సిద్ధాంతాలూ వ్యాపిస్తూనే వున్నాయి! ఈ వైరస్ ప్రపంచం మీద విరుచుకుపడడం వెనుక కొంతమంది శక్తిమంతులు ఉన్నారనేది ఆ సిద్ధాంతాల సారాంశం. భయంకర అంటు వ్యాధుల వ్యాప్తి సమాజాలకు ఎంత ప్రమాదకరమో, ఆ రోగాల విజృంభణ వెనుక కుట్రలు వున్నాయనే వాదాలూ అంతే హానికరమైనవి. వైద్య సంబంధి కుట్ర సిద్ధాంతాల పూర్వాపరాలపై మా విస్తృత పరిశోధన నిర్ధారించిన సత్యమది.

కరోనా వైరస్ వాస్తవంగా ఒక జీవాయుధమని, చైనాపై యుద్ధం చేసేందుకై సిఐఏ (అమెరికా గూఢచార సంస్థ) దాన్ని ప్రయోగించిందని ఒక కుట్ర సిద్ధాంతం ప్రతిపాదించింది. ఒక సంభావ్య వ్యాక్సిన్ విక్రయాల నుంచి లాభాలు దండుకునేందుకే బ్రిటన్, అమెరికా ప్రభుత్వాలు కరోనా విషక్రిమిని మానవాళి మీదకి వదిలిపెట్టాయని ఇతర కుట్ర వాదాలు విశ్వసిస్తున్నాయి.

ఈ కుట్ర సిద్ధాంతాలలో అత్యధిక భాగం నమ్మశక్యం కానివే అయినప్పటికీ దుష్టశక్తులు ఒక రహస్య పథకాన్ని అనుసరిస్తుంటాయనే నమ్మకం ప్రతి సమాజంలోనూ అత్యంత విస్తృతంగా వున్నది. ఈ నమ్మకాలు, తరచు ఆరోగ్య భద్రతకు సంబంధించినవై వుంటాయి. గత ఏడాది స్పెయిన్‌లో నిర్వహించిన ఒక సర్వేకు ప్రతిస్పందించిన వారిలో 16 శాతం మంది హెచ్ఐవిని ఒక రహస్య సమూహం లేదా సంస్థ లక్ష్యం కోసమే సృష్టించి, ప్రపంచమంతటా వ్యాపింపచేశారని విశ్వసిస్తున్నట్టు వెల్లడయింది. 'వ్యాక్సిన్‌ల హానికర ప్రభావాలను ఉద్దేశపూర్వకంగానే ప్రజలకు తెలియజేయడం లేదని ఫ్రాన్స్‌లో 27 శాతం మంది, బ్రిటన్‌లో 12 శాతం మంది విశ్వసిస్తున్నట్టు ఒక సర్వేలో వెల్లడయింది. కరోనా వైరస్ గురించిన నకిలీ వార్తలు, కుట్ర వాదాల వ్యాప్తి ఎంత తీవ్రంగా వున్నదంటే వాటిని ఖండించి వాస్తవాలను వెల్లడించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒక వెబ్ పేజీనే సృష్టించవలసివచ్చింది.

కుట్ర సిద్ధాంతాలు ఊపిరిపోసుకోవడమనేది ఉగ్రవాద దాడులు, రాజకీయ విప్లవాలు, ఆర్థిక కల్లోలాలు మొదలైన సంక్షోభ పరిస్థితులతో ముడిపడివున్నదని పరిశోధనలు ధ్రువీకరించాయి. సమాజంలో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పుడు, ముప్పు వాటిల్లేందుకు అవకాశాలు వున్న సమయాలలో కుట్ర సిద్ధాంతాలు మొగ్గ తొడుగుతాయి. ప్రపంచ అస్తవ్యస్తతను అర్థం చేసుకునేందుకు మనం చేసే ప్రయత్నాలను అవి తప్పక ప్రభావితం చేస్తాయి. విష క్రిములు విజృంభించినప్పుడు కూడా సరిగ్గా ఇటువంటి పరిస్థితులే వుండడం కద్దు. కరోనా వైరస్ విషయమై కుట్ర సిద్ధాంతాల వ్యాప్తికి ఆ పరిస్థితులే కారణమని మరి చెప్పనవసరం లేదు.

2015–16 సంవత్సరంలో జికా వైరస్ సోకినప్పుడు కూడా ఇటువంటి పరిస్థితులే వున్నాయి. ఆ విషక్రిమి ఒక సహజ సంఘటన కాదని, అది యథార్థానికి ఒక జీవాయుధమని జికా కుట్ర సిద్ధాంతాలు గట్టిగా ప్రతిపాదించాయి. కుట్ర సిద్ధాంతాల గురించిన మాటామంతీ జికాతో నెలకొన్న అనిశ్చితిని తట్టుకునేందుకు ప్రజలకు ఒక ఆలంబన అయింది. ఆ మహమ్మారి విరుచుకుపడిన సందర్భంలో సామాజిక మాధ్యమాలలోని వ్యాఖ్యల నిశిత పరిశీలనలో ఈ విషయం వెల్లడయింది.

వైరస్‌ల వ్యాప్తితో వాటిల్లే అనారోగ్యం నుంచి బయటపడేందుకు ఆరోగ్య భద్రతా నిపుణుల, సంస్థల సలహాలు, సిఫారసులను విశ్వసించి, పాటించడం చాలా ముఖ్యం. అయితే కుట్ర సిద్ధాంతాలను విశ్వసించే ప్రజలు సాధారణంగా అటువంటి వారి సలహాలను లక్ష్యపెట్టరు. విశ్వసించని ప్రజలు సహే



**కరోనా వైరస్ విజృంభిస్తున్న సందర్భంలో వైద్య సంబంధిత కుట్ర సిద్ధాంతాలు సమాజానికి చాలా హానికరమైనవి. ఆరోగ్యభద్రత విషయమై వ్యక్తులు తీసుకునే నిర్ణయాలను అవి ప్రభావితం చేస్తాయి. అంతేకాక సమాజంలోని వివిధ వర్గాల మధ్య నిర్హేతుక విరోధభావాన్ని పెంపొందించి, హింసాకాండ ప్రజ్వరిల్లడానికి కారణమవుతాయి. కరోనా వైరస్‌ను నిరోధించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవడంతోపాటు ఆ విషక్రిమిని గురించి తప్పుడు సమాచారం, కుట్ర సిద్ధాంతాల వ్యాప్తిని అరికట్టేందుకూ పూనుకోవాల్సిన నైతిక బాధ్యత ప్రభుత్వాలపై వున్నది.**

తుకమైన వైద్య సలహాలను ఎలా పాటిస్తారు? వైద్య సంబంధి కుట్ర సిద్ధాంతాలు వైద్య నిపుణులపై అపనమ్మకాన్ని పెంచుతాయని పరిశోధకులు వెల్లడించారు. ఇటువంటి అపనమ్మకాల వల్ల ప్రజలు తమను తాము కాపాడుకోవడంలో విఫలమవుతారు. వైద్య నిపుణులను విశ్వసించక పోవడం వల్లే టీకాలు (వ్యాక్సిన్లు) వేయించుకోవడానికి, సూక్ష్మ జీవినాశకాల (యాంటీబయోటిక్స్)ను తీసుకోవడానికి నిరాకరిస్తూ వనమూలికలు, విటమిన్లపై ప్రధానంగా ఆధారపడుతున్నారు. అంతేగాక వైద్య నిపుణులు కాని స్నేహితులు, కుటుంబ సభ్యులు సూచించే చిట్కా వైద్యాలవైపు మొగ్గు చూపుతున్నారు.

ఈ వాస్తవాల నేపథ్యంలో ఇప్పుడు కరోనా వైరస్ గురించిన కుట్ర సిద్ధాంతాలను విశ్వసించేవారు వైద్యనిపుణుల సలహాలను కనీసమాత్రంగా కూడా పాటించకపోయే అవకాశం ఎంతైనా వున్నది. తరచు సబ్బుతో చేతులు కడుక్కోవడం, వైరస్ వ్యాపించిన ప్రదేశాలకు వెళ్ళి వచ్చినవారు తమను తాము ఇతరుల నుంచి వేరుపరచుకుని నిర్దిష్టసమయం సేపు ఒంటరిగా వుండడం మొదలైన సూచనలను విధిగా పాటించాలి. లేనిపక్షంలో పర్యవసానాలు తీవ్రంగా వుంటాయనే సత్యాన్ని వారు అర్థం చేసుకోవాలి. అలా కాకుండా వ్యాధి నిరోధక ప్రవర్తనా పద్ధతుల పట్ల నిర్లక్ష్య ధోరణి వహిస్తూ ప్రమాదకరమైన ప్రత్యామ్నాయ చికిత్సలు చేయించుకోవడం జరిగితే ఆ విషక్రిమి మరింతగా వ్యాపించడమే కాకుండా మరెంతో మంది ప్రజలు ఆ మహమ్మారి భారినపడతారు. కరోనా వైరస్ నుంచి కాపాడుకోవడానికి ఇప్పటికే ఎంతో మంది 'ప్రత్యామ్నాయ చికిత్సా పద్ధతులను' అనుసరిస్తున్నారు. అవి చాలవరకు అత్యంత ప్రమాదకరమైనవి. బాగా ప్రాచుర్యంలో వున్న ఒక కుట్ర సిద్ధాంతం చెప్పుతున్నదేమిటంటే ఈ విషక్రిమిని 'గుప్త రాజ్యం' (రహస్యంగా పనిచేసే రాజ్యవ్యవస్థ అంతర్భాగం డీప్ స్టేట్) ప్రవేశపెట్టిందని పేర్కొంది. అంతేగాక చలువ సున్నపు నీటిని(బ్లీచ్)ను తాగితే ఆ వైరస్ సోకకుండా కాపాడుకోవచ్చని కూడా ఈ కుట్ర సిద్ధాంతాన్ని సమర్థిస్తున్నవారు సూచించారు!

వైద్య సంబంధి కుట్ర సిద్ధాంతాల వ్యాప్తి, సమాజంలోని కొన్ని వర్గాల వారికి విషమ పర్యవసనాలను సృష్టించే ప్రమాదం ఎంతైనా వున్నది. ఐరోపాలో ప్లేగు వ్యాధి ప్రబలినప్పుడు ఆ మహమ్మారి విజృంభణకు యూదులే బాధ్యులని ఆరోపిస్తూ వారిని బలిపశువులను చేశారు. ఈ అహేతుక కుట్ర సిద్ధాంతాల ప్రభావంతో ఐరోపా అంతటా యూదులను పెద్ద ఎత్తున ఊచకోత కోశారు. కరోనా వైరస్ వ్యాప్తి కూడా ప్రపంచవ్యాప్తంగా జాతి సంబంధి దాడుల పెరుగుదలకు దారి తీస్తోంది. తూర్పు ఆసియా దేశాలకు చెందిన ప్రజలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరుగుతున్నాయి. అయితే, ఇటువంటి పరిణామాలకు మనం భయపడవలసిన అవసరం లేదు. కుట్ర సిద్ధాంతాల వ్యాప్తిని మనం అరికట్టగలం. వైద్య సంబంధి కుట్ర సిద్ధాంతాలకు వ్యతిరేకంగా చేసే ప్రతివాదనలు మంచి ఫలితాలను సాధించాయి. వీటిలో నిజం లేదనే సత్యాన్ని ప్రజలు అర్థం చేసుకోవడానికి అవి విశేషంగా తోడ్పడ్డాయి.

కుట్ర సిద్ధాంతాలు సమాజానికి చాలా హానికరమైనవి. ఆరోగ్యభద్రత విషయమై వ్యక్తులు తీసుకునే నిర్ణయాలను ప్రభావితం చేయడంతో పాటు సమాజంలోని వివిధ వర్గాల మధ్య నిర్హేతుక విరోధ భావాన్ని పెంపొందించి, హింసాకాండ ప్రజ్వరిల్లడానికి అవి కారణమవుతాయి. ఈ వాస్తవాలను దృష్టిలో వుంచుకుని కరోనా వైరస్‌ను నిరోధించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవడంతోపాటు ఆ విషక్రిమిని గురించి తప్పుడు సమాచారం, కుట్ర సిద్ధాంతాల వ్యాప్తిని అరికట్టేందుకు పూనుకోవాల్సిన నైతిక బాధ్యత ప్రభుత్వాలపై వున్నది.

**– డేనియల్ జోలే**

**– పియా లేంబర్టీ**

('ది కాన్వర్సేషన్' సౌజన్యం)

## కరపత్రం
# బడిపిల్లల కథలకు ఆహ్వానం

కొత్తనీరు ప్రవాహాన్ని పరివ్యాప్తం చేయడమేకాక జవసత్వాలను ఇస్తుందన్నది నిజం. అది ఇవ్వాళ్ళ మన పిల్లలు చదువుకునే సాహిత్యంలో స్పష్టంగా కనిపిస్తోంది. మన బడి పిల్లలు రాసిన రచనలతో రెండు తెలుగు రాష్ట్రాల నుండి ఈ మధ్య కాలంలో 250కి పైగా పుస్తకాలు రావడం అందుకు నిదర్శనం. ఇక 'బాల చెలిమి' విషయానికి వస్తే తెలుగు బాల సాహిత్య చరిత్రలోనే తొలిసారిగా 'తెలంగాణ బడి పిల్లల కథలు' పేర తెలంగాణలోని పాత పది జిల్లాల వారీగా బడి పిల్లలు రాసిన కథలను ప్రచురించి పది పుస్తకాలను ఒకే వేదికపైన ఆవిష్కరించి కొత్త చరిత్రను సృష్టించింది. ఇవేకాక బాల సాహిత్య లోకంలో మరికొన్ని మేలిమి రచనలు, అనువాదాలు, తెలంగాణలోని కొత్త జిల్లాల వారీగా గేయాలె, కథా సంకలనాలను 'బాల చెలిమి' త్వరలో తేనుంది.

'ఆంధ్రప్రదేశ్ బడి పిల్లల కథలు' పేర పదమూడు జిల్లాల వారీగా మన బడి పిల్లలు రాసిన కథలను సంకనాలుగా ప్రచురించాని బాలచెలిమి సంకల్పించింది. ఈ సంకలనాల కోసం ఆయా జిల్లాలలోని బాలబాలికలు తమ స్వీయ రచనలను/కథలను పంపాల్సిందిగా కోరుతున్నాం. విజ్ఞానం, వినోదం, ఆనందం, మానవ సంబంధాలు, జీవజంతు జాలాలపై ప్రేమ, పర్యావరణ పరిరక్షణ వంటి వివిధ అంశాలపై కథలను ఆహ్వానిస్తున్నాం.

తెల్ల కాగితంపై ఒకవైపునే రెండు ఎ4 కాగితాలకు మించకుండా కథలు రాయాలి. రచయిత పేరు, తల్లితండ్రుల పేర్లు, పాఠశాల చిరునామాతో పాటు కథ వెంట ప్రధానోపాధ్యాయుడి ధ్రువ పత్రాన్ని జతపరచాలి. ఈ నెల 20వ తేదీ లోపు కింద తెలిపిన చిరునామాకు పంపించాలి. పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రశంసా పత్రం, పుస్తకం ఇవ్వడంతో పాటు, పాఠశాలకు కూడా పుస్తకాల సెట్ అందజేస్తాం. వివరాలకు బాలచెలిమి ప్రచురణలు, మొబైల్ నెం. 8686664949లో సంప్రదించవచ్చు. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమి, భూపతి సదన్, 3–6–716, స్ట్రీట్ నెం. 12, హిమాయత్ నగర్, హైదరాబాద్– 500029, తెలంగాణ.

**– మణికొండ వేదకుమార్**

సంపాదకులు, బాల చెలిమి & చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమి

**వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా**

**ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు 70, జుబిలీ హిల్స్, హైదరాబాద్–500033.**

**మెయిల్: editpage@andhrajyothy.com**

# పత్రికాలోకపు సారథి, వారధి

ప్రభుత్వంతో చర్చలకు వచ్చిన మావోయిస్టు అగ్రనేత అక్కిరాజు హరగోపాల్ ఎలియాస్ రామకృష్ణతో ఆయన తన ఇంట్లో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ జరుపుతారు. మధ్యాహ్నం పోలీస్ బాస్ అరవింద రావుతో కలిసి హోంమంత్రి కార్యాలయంలో మంతనాలు సాగిస్తారు. సాయంత్రం సద్గురు శివానంద మూర్తి సభలోనూ సాక్షాత్కరిస్తారు.

డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వర రావు ఏ కొలమానాలకూ అందరు. ఏ సిద్ధాంత భావజాలంలోనూ కొట్టుకు పోరు. కానీ, అందరూ ఆయనను తమ వాడని అనుకున్నారు. పొత్తూరి వారి నిజాయితీని, చిత్తశుద్ధినీ పరిపూర్ణంగా నమ్మారు. ఇదే పొత్తూరి బ్రాడ్ ఇమేజి. ఆధునిక జర్నలిజంలో ఆయన ఒక్కడికి మాత్రమే సాధ్యమైన ప్రత్యేకత ఇది.

ఎడిటర్లే సారథులై, ప్రజాపక్ష వారధులై, రాజీలేని రుషులై, పత్రికా కేతనాన్ని సమున్నతంగా భుజాల మీద మోసిన మహనీయుల స్వర్ణయుగపు చిట్టచివరి లింకు తెగిపోయింది. చిన్ననాటి నుంచి వ్యాయామాలు చేసి పొందికగా రూపు దిద్దుకున్న నిండైన విగ్రహం. పంచె కట్టినా, ప్యాంటు చొక్కా వేసినా ఇమిడి పోగల తీరైన రూపం. దబ్బపండు ఛాయతో, ఆత్మీయమైన పలకరింపుతో అందర్నీ ఆకట్టుకోగలిగిన వ్యక్తిత్వం.

## నివాళి



**పొత్తూరి వెంకటేశ్వర రావు (1934– 2020)**

పొత్తూరి వెంకటేశ్వరరావు గుంటూరు సమీపంలోని పొత్తూరులో 1934 ఫిబ్రవరి 8వ తేదీన వెంకటసుబ్బయ్య, పన్నగేంద్రమ్మ దంపతులకు జన్మించారు. గుంటూరు హిందూ కాలేజీలో డిగ్రీ చేశారు. సత్యవాణిని గృహలక్ష్మిగా స్వీకరించారు. పొత్తూరి దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు.

ప్రసిద్ధ కాంగ్రెస్ నాయకుడు, దగ్గరి బంధువు వి.బి.రాజు ప్రోద్బలంతో 1957లో హైదరాబాద్‌లో ఆంధ్ర జనతలో అక్షరాలు దిద్దుకుని సుదీర్ఘ పాత్రికేయ ప్రస్థానానికి శ్రీకారం చుట్టారు. ఆ తదుపరి ఆంధ్రభూమి, ఈనాడు, ఆంధ్రప్రభ, ఉదయం పత్రికల్లో అయిదు దశాబ్దాలకు పైగా కొనసాగారు. ఆంధ్రప్రభ డెయిలీ, వీక్లీ రెంటికీ సంపాదకత్వం వహించారు. ఆంధ్రప్రభతో పద్నాలుగేళ్ల అనుబంధం ఆయనది.

పేలుడు పదార్థాల అక్రమ రవాణాకు సంబంధించిన ప్రత్యేక వార్తా కథనాలను మధ్యలోనే నిలిపివేయాలని ఉదయం యజమాని మాగుంట సుబ్బరామ రెడ్డి ఆదేశించారు. తాను ఎడిటర్‌గా ఉండగా ఆ ప్రచురణను నిలిపే ప్రసక్తి లేదని చెప్పి, రాజీ పడకుండా రాజీనామా చేసి బయటకు వచ్చారు.

2004 అక్టోబర్ 15వ తేదీన వై.ఎస్.రాజశేఖర రెడ్డి ప్రభుత్వానికి మావోయిస్టులకు మధ్య జరిగిన చర్చల్లో పౌరస్పందన వేదిక సభ్యుడిగా కీలక పాత్ర నిర్వర్తించారు. ప్రెస్ అకాడమీ అధ్యక్షుడిగా పాత పత్రికలను భావితరాల కోసం డిజిటల్ రూపంలో భద్రపరిచారు. నూతన పదకల్పన కోసమూ కృషి సాగించారు. టి.టి.డి. ప్రచురణల గౌరవ సలహాదారుగానూ, వినియోగదారుల స్టేట్ కమిషన్ సభ్యుడిగానూ సేవలందించారు.

ఎంతో పరిశోధన, పరిశ్రమ చేసి ఆంధ్రజాతి అక్షర సంపద తెలుగు పత్రికల పేరిట ప్రామాణిక గ్రంథాన్ని రాశారు. ఆయన రేడియో ప్రసంగాలు 'నాటి పత్రికల మేటి విలువలు' గానూ, ఆంధ్రప్రభ వీక్లీ సంపాదకీయాలు 'వ్యాసప్రభ', 'చింతన', 'చిరస్మరణీయులు' గానూ పుస్తక రూపం తొడిగాయి. వివిధమతాల పరిభాషను సేకరించి కూర్చి, 'పారమార్థిక పద కోశాన్ని' వెలువరించారు. కేంద్ర సాహిత్య అకాడమి కోసం కాశీనాథుని నాగేశ్వరరావు జీవిత చరిత్ర రాశారు. 'విధి నా సారథి' పేరుతో తన జీవనయానాన్ని గ్రంథస్థం చేశారు. వాసిరెడ్డి వెంకటాద్రినాయుడి జీవితచరిత్రను రాశారు.

కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీస్వామితో పొత్తూరికి చిన్ననాటి నుంచి చెలిమి, సాన్నిహిత్యం ఉన్నాయి. వారి జీవిత గమనం మంత్రసిద్ధులపై 'యతి కులపతి' పుస్తకాన్ని రాశారు. జిల్లెళ్లమూడి అమ్మ చూపిన ఆధ్యాత్మిక మార్గంలో నడిచారు. పొత్తూరులో ప్రణవాశ్రమాన్ని నెలకొల్పి అక్కడ గడిపివస్తూ, జపతపాలను నిష్ఠతో సాగించారు.

పొత్తూరి వారికి ఆత్మాభిమానం మెండు. ఆత్మగౌరవానికి రవ్వంత లోపం జరిపినా సహించేవారు కారు. అందరితోనూ అంతే సున్నితంగా, మర్యాద పూర్వకంగా మెలిగేవారు. 2013లో మల్టిపుల్ మైలోమా అనే బ్లడ్‌కేన్సర్‌కు గురయ్యారు. అనారోగ్యం బాధిస్తున్నా ఎన్నడూ వైరాగ్యానికి లోనుకాలేదు. ప్రాపంచిక విషయాలపట్ల ఆసక్తినీ, అనురక్తినీ కొనసాగిస్తూనే వచ్చారు.

**అన్ని వాదాలను, అభిప్రాయాలను అందిస్తూ ప్రజల మధ్య సామరస్య బంధాలను పెంచిపోషించడమే జర్నలిజం మౌలిక కర్తవ్యం. ఈ స్ఫూర్తిని, లక్ష్యాన్ని పొత్తూరి తన వ్యక్తిగత లక్షణంగా మలుచుకున్నారు. దశాబ్దాల తరబడి సాగిన సుదీర్ఘ పాత్రికేయత్వంలో విలువల విషయంలో రాజీపడకుండా, బాధ్యతగల పౌరుడిగానూ తన పాత్రను ఆయన బహుముఖీనంగా దిగ్విజయంగా పోషించారు. పొత్తూరి వెంకటేశ్వరరావు ఆధునిక తెలుగు పత్రికారంగంలో నిలువెత్తు శిఖరం. దారిచూపే లైట్‌హౌస్. ఆయన జీవితం జర్నలిస్టులకే గాక అన్ని రంగాలవారికీ స్ఫూర్తిదాయకం.**

తాను కోస్తాంధ్రకు చెందినా, తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడాలని మనస్ఫూర్తిగా కోరుకున్న తెలంగాణ వాది ఆయన. వైషమ్యాలతో కలిసి ఉండటం కంటే, అన్నదమ్ముల్లా విడిపోయి ఇరుప్రాంతాల వారు ఆత్మీయంగా కలిసి మెలిసి ఉండాలని కోరుకున్నారు.

తెలుగు విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్‌ను, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ జర్నలిస్టు అవార్డును అందుకున్నారు. పలు సంస్థలు అనేక పురస్కారాలను అందించాయి, సత్కారాలు చేశాయి.

అన్ని వాదాలను, అభిప్రాయాలను అందిస్తూ ప్రజల మధ్య సామరస్య బంధాలను పెంచిపోషించడమే జర్నలిజం మౌలిక కర్తవ్యం. ఈ స్ఫూర్తిని, లక్ష్యాన్ని పొత్తూరి తన వ్యక్తిగత లక్షణంగా మలుచుకున్నారు. దశాబ్దాల తరబడి సాగిన సుదీర్ఘ పాత్రికేయత్వంలో విలువల విషయంలో రాజీపడకుండా, బాధ్యతగల పౌరుడిగానూ తన పాత్రను ఆయన బహుముఖీనంగా దిగ్విజయంగా పోషించారు. పొత్తూరి వెంకటేశ్వరరావు ఆధునిక తెలుగు పత్రికా రంగంలో నిలువెత్తు శిఖరం. దారిచూపే లైట్‌హౌస్. ఆయన జీవితం జర్నలిస్టులకే గాక అన్ని రంగాలవారికీ స్ఫూర్తిదాయకం.

**– డాక్టర్ గోవిందరాజు చక్రధర్**

# 'స్థానిక' రిజర్వేషన్లపై ఎందుకీ కక్ష?

బిసి రిజర్వేషన్ల పట్ల జగన్మోహనరెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలలో బిసి రిజర్వేషన్ 50 శాతం మించకూడదంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీమ్ కోర్టుకు వెళ్లకుండా ఎన్నికలు నిర్వహించడానికి కేబినెట్ నిర్ణయించడం అందుకు నిదర్శనం. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అమలు చేయడం జగన్మోహనరెడ్డి ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం కాదు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నాటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు స్థానిక సంస్థల్లో బిసి వర్గాలకు 27 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ తర్వాత రిజర్వేషన్ శాతాన్ని 34 శాతానికి పెంచారు. చంద్రబాబు తర్వాత ముఖ్యమంత్రులుగా పనిచేసిన వై.ఎస్.రాజశేఖరరెడ్డి, కె. రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి సైతం అదే రిజర్వేషన్ విధానాన్ని కొనసాగించారు. క్రితంసారి జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా 34 శాతం రిజర్వేషన్లు అమయ్యాయి. నిజంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చెప్పినట్టుగా రిజర్వేషన్ 50 శాతానికి మించకూడదనేది నిజమైతే తమిళనాడులో 69 శాతం, ఛత్తీస్‌ఘడ్‌లో 72, మహారాష్ట్రలో 68 బిసీకు శాతం రిజర్వేషన్లు ఎలా అమవుతున్నాయి?




మనది ఫెడరల్ రాజ్యాంగం. రాష్ట్రాలకు అనేక అంశాలలో ప్రత్యేక ప్రతిపత్తి వుంది. ఆయా రాష్ట్రాలలో సామాజిక, సాంస్కృతిక పరిస్థితులను బట్టి రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా కొన్ని నిర్ణయాలు తీసుకోవచ్చు. ఆ నిర్ణయాలను రాజ్యాంగబద్ధం చేసుకోవడానికి వీలుగా 9వ షెడ్యూల్ ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వాలు తమ అవసరాల నిమిత్తం ప్రత్యేకంగా తీసుకొన్న నిర్ణయాలను పార్లమెంటుకు పంపి, వాటిని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చినట్లయితే ఆ అంశాలకు రాజ్యాంగ బద్ధత లభిస్తుంది. రాజ్యాంగ బద్ధత లభించిన అంశాలను కోర్టు ప్రశ్నించే అవకాశం వుండదు. రిజర్వేషన్లను 50 శాతానికి మించి అమలు చేస్తున్న తమిళనాడు సహా అన్ని రాష్ట్రాలు వాటిని రాజ్యాంగ బద్ధం చేసుకొన్నాయి. గత ముఖ్యమంత్రులు కాని, నేటి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి కాని ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న 34 శాతం రిజర్వేషన్‌లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్పించినట్టయితే హైకోర్టు ఆ విధమైన తీర్పు చెప్పివుండేది కాదు.

గతంలో ఎన్నడూ లేనివిధంగా మెజారిటీ బిసి సామాజికవర్గాలు గత అసెంబ్లీ ఎన్నికల్లో జగన్మోహనరెడ్డి పార్టీకి ఓటు చేశారు. ఆ కారణంగానే రికార్డుస్థాయిలో 151 అసెంబ్లీ స్థానాల్లో ఆయన పార్టీ విజయం సాధించగలిగింది. కాని ప్రస్తుతం రెడ్డి సామాజికవర్గానికి చెందిన వ్యక్తి హైకోర్టులో బిసి రిజర్వేషన్లను సవాల్‌చేయడం, ఆ నాయకుడు పాలకులకు సన్నిహితుడు కావడంతో ముఖ్యమంత్రి జగన్ ఉద్దేశపూర్వకంగానే బిసిల 34 శాతం రిజర్వేషన్‌లను అడ్డుకుంటున్నారనే అభిప్రాయం కలుగుతోంది. స్థానిక సంస్థల రిజర్వేషన్లపై కోర్టులో కేసు దాఖలవుతున్నట్టు తెలిసిన వెంటనే రాష్ట్రంలో అమవుతున్న 34 శాతం రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించి వున్నట్లయితే బిసి సామాజికవర్గాలో జగన్మోహనరెడ్డికి ఆదరణ మరింత పెరిగేది. స్థానిక సంస్థల్లో కనీసం 90 శాతం స్థానాలు కైవసం చేసుకోవాలంటూ మంత్రులను హెచ్చరించాల్సిన అవసరమూ దాపురించి వుండేది కాదు.

ఇలా ఎందుకు కక్ష సాధిస్తున్నారో అర్థం కావడం లేదు. సమాజంలో మొత్తం వనరులు, అవకాశాలు తమకే దక్కాలని బడుగువర్గాలు కోరడం లేదు. తమవాటా తమకు దక్కాలని మాత్రమే కోరుకొంటున్నారు. తమకు రిజర్వేషన్లు ప్రత్యేకంగా అవసరం లేదని, సమాజంలోని సామాజిక వర్గాల గణనచేసి, వారివారి నిష్పత్తిని బట్టి వనరులు, సదుపాయాలు అందించాలని ఎస్‌సి, ఎస్‌టి, బీసీ సామాజిక వర్గాలు కోరుకొంటున్నాయి. ప్రభుత్వం వద్ద వున్న రికార్డులను పరిశీలిస్తే సమాజంలోని దాదాపు 78 శాతం (52 శాతంగా వున్న ఒబిసీలు, 26 శాతంగా వున్న ఎస్‌సి, ఎస్‌టిలు) బహుజనులకు కనీసం 20 శాతం అవకాశాలు కూడా లభించడం లేదు. చట్టసభలలోనే కాదు, ఉద్యోగాలలో, పారిశ్రామిక, వాణిజ్యరంగాలలోనూ వారి వాటా వారికి దక్కడం లేదు. కేవలం 22 శాతం వున్న అగ్రవర్ణాలకు చెందినవారే మొత్తం వనరులను, సదుపాయాలను అనుభవిస్తున్నారు. పార్లమెంటు మొత్తం సభ్యులలో 117 మంది వ్యవసాయ ఆధిపత్య సామాజికవర్గాల వారు. వీరు కాక, బ్రాహ్మణ, బనియా వర్గాల సభ్యులను కలుపుకొంటే 65 శాతం అగ్రవర్ణాలకు చెందినవారే వున్నారు.

స్థానిక సంస్థలలో బీసీల రిజర్వేషన్లను 24 శాతానికి కుదించడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 15 వేల పదవులను బీసీలు కోల్పోతున్నారని అంచనా. 131 బీసీ కులాలో అయిదారు కులాలు మినహా మంగలి, కుమ్మరి, రజక, విశ్వబ్రాహ్మణ, మేదర వంటి అనేక కులాలు ఇప్పటివరకు చట్టసభలో ప్రవేశించలేదు. కనుచూపు మేరలో వీరు చట్టసభలో ప్రవేశిస్తారన్న నమ్మకం కూడా లేదు. అత్యంత వెనుకబడిన కులాలకు చెందిన వారు చట్టసభలలో ప్రవేశించకపోయినా, గుడ్డి కంటే మెల్ల మేలు అన్నచందంగా 34 శాతం రిజర్వేషన్ అమలు వల్ల కనీసం స్థానిక సంస్థలలో అధికారంలోకి వచ్చే అవకాశం వుండేది. ప్రస్తుతం కోర్టు తీర్పు వల్ల ఆ అవకాశాన్ని కూడా కోల్పోతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రులుగా పనిచేసిన నేతలలో అత్యధికులు రెడ్డి సామాజికవర్గానికి చెందినవారే. అయినా వారు బిసీలకు కనీసం స్థానిక సంస్థలలో కూడా అవకాశం లభించకుండా చేస్తున్నారు. బిసీలైన సాలె, గౌడ్, యాదవులతో పాటు, చెట్ల కింద క్షౌరం చేస్తూ జీవించే నాయీలు, అపార్టుమెంట్లలో కాపాలా వుంటూ ఇస్త్రీ చేస్తూ జీవించే రజకులు, వెదురు బుట్టలు తయారు చేస్తూ పొట్టపోషించుకొనే మేదర్లు, కాయకష్టంతో గోతులు తీసే వడ్డెర్ల వంటి వారిని రాజకీయంగా అణచివేయాలని చూడటం ఎంత వరకు సబబు? రాష్ట్ర ప్రభుత్వానికి నిజంగా బిసి రిజర్వేషన్ల పట్ల చిత్తశుద్ధి వుంటే హైకోర్టు తీర్పును సుప్రీమ్‌కోర్టులో సవాల్ చేయాలి. అదేవిధంగా 50 శాతానికి మించి రిజర్వేషన్ అమవుతున్న రాష్ట్రాల మాదిరిగానే రాష్ట్ర అసెంబ్లీలో ఆంధ్రప్రదేశ్‌లో అమవుతున్న రిజర్వేషన్ల శాతాన్ని తీర్మానం చేసి, పార్లమెంటుకు పంపి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్పించి దానికి చట్టబద్ధత కల్పించాలి.

**– అన్నవరపు బ్రహ్మయ్య**

కరోనా కర



# ఆయుర్వేదంతో కరోనా నుంచి రక్షణ!

**కరోనా వైరస్ నుంచి రక్షణ పొందే మార్గాలు ప్రత్యామ్నాయ వైద్య విధానాల్లోనూ ఉన్నాయి. వాటిని అనుసరించడం ద్వారా ఈ వైరస్ బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. అవేమిటంటే...**

- స్వీయ శుభ్రత పాటించాలి.
- తరచుగా చేతులు సబ్బు నీళ్లతో కనీసం 20 సెకన్లపాటు కడుక్కోవాలి.
- షదంగ్ పనియా (ముస్త, ఉషీర్, పర్పత్, చందన్, ఉదీచ్య, నగర్)లను ఒక లీటరు నీళ్లలో పది గ్రాముల చొప్పున కలిపి ఆ నీళ్లు సగం అయ్యే వరకూ మరిగించాలి. ఈ నీళ్లను సీసాలో నిల్వ చేసి, దాహం వేసిన ప్రతిసారీ తాగుతూ ఉండాలి.
- చేతులు కడుక్కోకుండా కళ్లు, ముక్కు, నోరు తాకకూడదు.



- వ్యాధిగ్రస్థులకు సన్నిహితంగా మసలకూడదు.
- సుస్తీగా ఉంటే ఇంటి పట్టునే ఉండిపోవాలి.
- తుమ్మేటప్పుడు, దగ్గేటప్పుడు నోటికి, ముక్కుకు మడిచిన మోచేతిని అడ్డుపెట్టుకోవాలి. తుమ్మినా, దగ్గినా వెంటనే చేతులు శుభ్రం చేసుకోవాలి.
- తరచుగా తాకే వీలున్న వస్తువుల ఉపరితలాలను శుభ్రం చేసుకోవాలి.
- కరోనా వైరస్ సోకినట్టు అనుమానం కలిగితే, ముఖానికి మాస్క్ ధరించి, దగ్గర్లోని ఆస్పత్రిలో టెస్ట్ చేయించుకోవాలి.

## ఆయుర్వేద మందులు!

**కరోనా వైరస్ సోకకుండా ఉండాలంటే వ్యాధి నిరోధకశక్తిని పెంచే ఆహారం తీసుకోవడంతో పాటు, అందుకు తోడ్పడే జీవనశైలిని అనుసరించాలి. ఇందుకోసం ఆయుర్వేద మందులను కూడా వాడుకోవచ్చు. అవేమిటంటే....**

- అగస్త్య హరితాకి 5 గ్రాములు రోజుకు రెండుసార్లు గోరువెచ్చని నీటితో తీసుకోవాలి.
- సంషామణి వటి 500 గ్రాములు రోజుకు రెండుసార్లు తీసుకోవాలి.
- 5 గ్రాముల త్రికటు (పిప్పళ్లు, మరీచి, శొంఠి) పొడి, 3 - 5 తులసి ఆకులు ఒక లీటరు నీళ్లలో వేసి, ఆ నీళ్లు సగం అయ్యేవరకూ మరిగించి, సీసాలో నింపాలి. ఈ నీటిని రోజంతా తాగుతూ ఉండాలి.
- ప్రతి రోజూ ఉదయం ప్రతిమర్ష నస్య అను తైలం లేదా నువ్వుల నూనె రెండు చుక్కలు నాసికా రంధ్రాల్లో వేసుకోవాలి.

సేకరణ: ఆయుష్ వెబ్‌సైట్ నుంచి

స్ఫూర్తి





# గిరిజన కాంతి!

**ఏజెన్సీ ప్రాంతాల్లోని బాధలు ఆమెకు తెలుసు. అక్కడ గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలు కూడా తెలుసు. తన వారికి అండగా నిలబడాలంటే తానొక శక్తిగా మారాలి. అది చదువుతోనే అని గ్రహించి న్యాయశాస్త్రం వైపు అడుగులు వేశారామె. కృషి, పట్టుదలతో విశాఖ ఏజెన్సీలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా ఎంపికైనా తొలి గిరిజన యువతిగా చరిత్ర సృష్టించారు సంపరి శశి వెంకట కాంతి. ఈ సందర్భంగా ఆమె తన మనోభావాలను 'నవ్య'తో పంచుకున్నారిలా...**

"మా స్వగ్రామం విశాఖ జిల్లాలోని మారుమూల ప్రాంతమైన శరభన్నపాలెం. బ్రిటీష్ పాలనలో స్వాతంత్ర్యం కోసం సాయుధ పోరాటం చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఉద్యమానికి స్థావరమైన గ్రామం ఇది. ఆ తర్వాత మావోయిస్టు కార్యకలాపాలకు కీలక కేంద్రంగా ఉండేది. చింతపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సీపీఐ తరపున రెండు పర్యాయాలు శాసనసభ్యుడిగా ఎన్నికైన గొడ్డేటి దేముడుది కూడా మా శరభన్నపాలెమే. ఈ గ్రామంలోనే నా బాల్యం గడిచింది.

**చిన్నప్పుడే తల్లి ప్రేమకు దూరమయ్యా!**

నాన్న సోమరాజు పోలీస్‌శాఖలో సబ్-ఇన్‌స్పెక్టర్. నేను ఏడో తరగతి చదువుతున్నప్పుడే మా అమ్మ అనారోగ్యంతో చనిపోయింది. నాన్న, పెద్దక్క నన్ను ప్రేమగా పెంచారు. మేము ఐదుగురం సంతానం. పెద్దక్క ప్రమీలా భారతి విశాఖలో న్యాయవాదిగా పనిచేస్తోంది. చిన్నక్క ఉషాహారతి బీఈడీ పూర్తిచేసింది. తమ్ముళ్లు ఇద్దరూ ఇంకా చదువుతున్నారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల అభివృద్ధి కేవలం కాగితాలకే పరిమితం అయ్యింది. నేటికీ అణచివేత, వివక్ష కొనసాగుతోంది. ఎన్నో వనరులున్నా గిరిజనుల్లో చట్టాలపై అవగాహన, హక్కులపై పరిజ్ఞానం లేకపోవడం వల్లనే మా మన్యం ప్రాంతాలు ఇంకా వెనుకబడే ఉన్నాయి. నా చిన్నప్పటి నుంచి ఇప్పటిదాకా అదే పరిస్థితి. వాటిని మార్చాలనేది నా కోరిక. అందుకే న్యాయ విద్య అభ్యసించాలని అప్పుడే నిర్ణయించుకున్నా. ఇంటర్‌లో చదివింది బైపీసీ గ్రూప్ అయినా ఎంసెట్ జోలికి పోకుండా ఎన్‌బీఎం న్యాయ కళాశాలలో మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సు పూర్తి చేశా.

**నా జీవిత లక్ష్యం అదే!**

2016లో న్యాయ విద్య పూర్తి చేశా. తర్వాత విశాఖపట్నంలోని పైడితల్లి నాయుడు అనే సీనియర్ అడ్వొకేట్ వద్ద సహాయకురాలిగా ఉన్నా. జిల్లా కోర్టులో ప్రాక్టీసు చేస్తూ నాలుగు పర్యాయాలు జూనియర్ సివిల్ జడ్జి పోస్టుకు ప్రయత్నించినప్పటికీ ఎంపిక కాలేదు. అయితే ఏపీపీ పోస్టుకు తొలి ప్రయత్నంలోనే ఎంపిక కావడం సంతోషం కలిగించింది. మొత్తం 56 పోస్టులకు రెండు వేల మందికి పైగా పోటీ పడ్డాం. నాకు ఎస్టీ కేటగిరీలో మొదటి ర్యాంకు వచ్చింది. మొత్తంమ్మీద 58వ ర్యాంకు సాధించా. విశాఖ ఏజెన్సీలో ఏపీపీ పోస్టుకు ఎంపికైన తొలి మహిళగా నాకు గుర్తింపు లభించించడం ఆనందంగా ఉంది. మా బంధువులు, గ్రామస్థులు 'ఆడపిల్లలకు పెద్ద చదువులు అవసరమా?' అని అంటున్నా సరే నాన్న, అక్కల ప్రోత్సాహంతోనే ఈ స్థాయికి ఎదిగాను. జడ్జి కావాలనేది నా ప్రస్తుత లక్ష్యం. అందుకోసం కృషి కొనసాగిస్తూనే ఉంటాను.

**ఆదివాసీలకు అండగా ఉంటా!**

గంజాయి రవాణా, మావోయిస్టు కార్యకలాపాలు వంటి నేరాల్లో ఇరుక్కొని జైళ్లల్లో రిమాండ్ ఖైదీలుగా మగ్గుతున్న గిరిజనులకు న్యాయ సహాయం అవసరం ఎంతో ఉంది. ఒక గిరిజన మహిళగా నేను ఆదివాసీలకు న్యాయపరంగా అండగా ఉండాలని నిర్ణయించుకున్నా. ప్రభుత్వం తరఫున పనిచేస్తూనే, నాతో న్యాయ విద్యను అభ్యసించిన కొంతమంది స్నేహితులతో కలిసి ఒక గ్రూపుగా ఏర్పడి, గిరిజన గ్రామాల్లో న్యాయ సహాయ, అవగాహన శిబిరాలు నిర్వహించాలనుకుంటున్నా. ఏజెన్సీలో గిరిజనుల జీవనోపాధి మార్గాలు పెంపొందించే మార్గాలను అన్వేషించాలి. ముఖ్యంగా గిరిజన యువతను సన్మార్గంలో నడిపిస్తూ, అభివృద్ధి పథం వైపు పయనింపజేసేందుకు అన్ని వర్గాల సహాయ సహకారం కావాలి. ఆ దిశగా నా ప్రయత్నాలు సాగుతాయి."

● పీవీ సత్యనారాయణరావు
నర్సీపట్నం, విశాఖ జిల్లా

# వరుసల వయ్యారాలు!

నగ ధగ



నగల్లో సరికొత్త ట్రెండ్లు నిరంతరం పుడుతూనే ఉంటాయి.. వాటి ఆదరణ కూడా అలాగే సాగుతూ ఉంటుంది. అలా చెప్పుకోదగిన జ్యువెలరీ ట్రెండ్...'లేయర్ జ్యువెలరీ'! ఈ తరహా స్టయిల్‌లో నెక్లెస్‌లు, మొదలుకుని ఉంగరాల వరకూ ఉన్నాయి.

**లేయర్ నెక్లెస్:** వేర్వేరు పొడవులతో ఉన్న గొలుసులను ఒక దాని కింద ఒకటిగా అమర్చి తయారుచేసే ఈ రకం నెక్లెస్ మెడలో నిండుగా కనిపిస్తుంది. సన్నటి చెయిన్లే అయినా ఐదు లేదా ఆరు ఉండటం వల్ల భారీ లుక్ కూడా వస్తుంది. నాలుగు వరుసలను కలుపుతూ ఓ వైపు పెద్ద పెండెంట్ ఉన్నవి సరికొత్త ఫ్యాషన్. వేడుకల్లో ఈ రకం నగ పట్టు చీరలు, ఫ్యాన్సీ చీరలు రెండింటికీ నప్పుతుంది.



**లేయర్ బ్యాంగిల్స్:** ఇది కూడా కొత్త ట్రెండే! పెద్ద సైజు మొదలుకుని చిన్న సైజు వరకూ మోచేతి దిగువ నుంచి ముంజేతి వరకూ ధరిస్తే... దాన్నే లేయర్ బ్యాంగిల్ స్టయిల్ అంటారు. ఇందుకోసం పెద్దవి కాకుండా మధ్యస్తంగా ఉండే గాజులు ఎంచుకోవాలి. అన్ని గాజులూ ఒకే రకంగా ఉండాలి. రాళ్లు పొదిగినవైతే అన్నీ అవే ఉండాలి. సాదా గాజులైనా అన్నీ అవే గాజులుండాలి. లేయర్ బ్యాంగిల్స్ టీనేజీ అమ్మాయిలకు చక్కగా నప్పుతాయి.

**లేయర్ బ్రేస్‌లెట్స్:** గాజులు వేసుకోవటానికి ఇష్టపడని వాళ్ల కోసమే ఈ స్టయిల్. ఫ్యాన్సీ డ్రెస్సులను ఇష్టంగా ధరించే అమ్మాయిలకు లేయర్ బ్రేస్‌లెట్లు బాగా సూటవుతాయి. ఒకే చేతికి వేసుకునే ఈ బ్రేస్‌లెట్లు మోకాళ్ల వరకూ ఉండే స్కర్ట్‌లు, మినీలు వేసుకునే వాళ్లకు సూటవుతాయి.

**లేయర్ రింగ్స్:** వేలి ఉంగరాలు నాలుగైదు కలిపి పెట్టుకుంటే చేతికే అందమొస్తుంది. ఒకే ఒక భారీ ఉంగరం బదులు ఇలా సైజులవారీగా ఉంగరాలు ధరించటం లేటెస్ట్ ఫ్యాషన్. ఆధునికం లేదా సాంప్రదాయం....ఎలాంటి వస్త్రధారణకైనా ఈ రకం ఉంగరాల స్టయిల్ బాగుంటుంది. కొన్ని సాదా, మరికొన్ని రాళ్లు పొదిగినవి...ఇలా ప్రయోగాలు చేసి నప్పిన ఉంగరాలను లేయర్లుగా ధరించాలి.



● మంజులా రావు
మంజుల జ్యువెల్స్, హైదరాబాద్

సొగసు

# మిర్రర్ మెరుపుల్!



**లెహంగా మిరుమిట్లు గొలపాలంటే మిర్రర్ వర్క్ జోడించాలి. వేడుకల్లో వెలుగులు వెదజల్లేలా మిర్రర్ వర్క్ లెహంగా ధరిస్తే మెరిసే తార మీరే అవుతారు.**

- మిర్రర్‌లతో పువ్వుల డిజైన్ వర్క్ చూడముచ్చటగా ఉంటుంది. లెహంగా మీద ఫ్లవర్ వర్క్, బ్లౌజ్ మెడ దగ్గర భారీ మిర్రర్ వర్క్ ఉంటే, ఈవినింగ్ ఫంక్షన్లలో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ మీరే కావచ్చు.
- లెహంగాతో పాటు, బ్లౌజ్ మీద పూర్తి మిర్రర్ వర్క్ సమంగా పరుచుకునేలా చూసుకోవచ్చు. ఇలాంటి డ్రెస్‌కు ప్లెయిన్ కలర్ చున్నీ అందంగా ఉంటుంది.
- వేర్వేరు సైజుల్లో ఉండే మిర్రర్ వర్క్ కూడా చూడడానికి బాగుంటుంది. సింపుల్ వర్క్ ఇష్టపడేవారికి ఇదే బెస్ట్ ఆప్షన్. అయితే ఇలాంటి ఫ్యాషన్ కోసం లేత రంగు లెహంగా ఎంచుకోవాలి.
- మిర్రర్ వర్క్‌ను అంచులకు కూడా పరిమితం చేయవచ్చు. లెహంగా, చోళీలకు భారీగా ఉండే ఎంబ్రాయిడరీ ఉండి, అంచుల్లో మిర్రర్ వర్క్ జోడిస్తే సరికొత్తగా ఉంటుంది.

# సమ్మర్ ప్యాక్స్!

ఎండాకాలం వేధించే అతి పెద్ద సమస్య... 'సన్ ట్యాన్'. సన్‌స్క్రీన్ లోషన్లు, గొడుగులు, దుపట్టాలు... వాడుతూ ఎంత జాగ్రత్తగా ఉన్నా ఎండకు చర్మం నల్లగా తయారవటం మానదు. ఇలాంటప్పుడు క్రమం తప్పకుండా ట్యాన్‌ను తొలగించే ఫేస్ ప్యాక్స్ వేసుకుంటూ ఉండాలి.

**కుంకుమ పువ్వు ప్యాక్:** 4 టేబుల్‌స్పూన్ల పాలు వేడిచేసి దానిలో నాలుగు చుక్కల నిమ్మరసం, చిటికెడు

బ్యూటీ



కుంకుమ పువ్వు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖం, చెవులు, మెడలకు పట్టించి ఆరాక చల్లని నీళ్లతో కడిగేయాలి. తర్వాత మాయిశ్చరైజర్ రాయాలి.

**టొమాటో ప్యాక్:** ఒక టొమాటోను తరిగి దానికి ఒక టేబుల్‌స్పూను పాలు చేర్చాలి. ఒక టీస్పూను పసుపు, నాలుగు చుక్కల నిమ్మరసం, ఒక టీస్పూను తేనె వేసి బాగా కలిపి పట్టించాలి. ఆరాక చల్లని నీటితో కడిగేసుకోవాలి.

**సెనగపిండి ప్యాక్:** రెండు టేబుల్ స్పూన్ల సెనగపిండికి చిటికెడు పసుపు, అర టీస్పూను నారింజ తురుము, ఒక టీస్పూను రోజ్ వాటర్ వేసి కలిపి ముఖానికి పట్టించాలి. 20 నిమిషాలు ఆగి ఆరిపోయిన ప్రదేశాల్లో రోజ్ వా టర్ చిలకరించాలి. తర్వాత వేళ్లతో సున్నితంగా రుద్దుతూ ప్యాక్ తొలగించి కడిగేసుకోవాలి. ఇలా రెండు రోజులకోసారి చేయాలి.

విశేషం

**ఋతువుల్లో మొదటిది వసంతం. ఆ వసంత కాలాన్ని స్వాగతిస్తూ చేసుకొనే రంగుల వేడుక హోలీ. ఇది కేవలం సరదా వినోదాల వేడుక కాదు. పౌరాణికంగానూ ఎన్నో విశిష్టతలున్న పండుగ.**

ఈ నెల 9న హోలీ

# రంగుల కేళి

ఫాల్గుణ శుద్ధ పౌర్ణమిని 'హోలీ పున్నమి' అంటారు. 'డోలికా పున్నమి', 'అనంగ పౌర్ణమి'... ఇలా ఈ రోజును అనేక పేర్లతో వ్యవహరిస్తారు.

**పండుగ వెనుక పురాణ కథలు**

ఈ పండుగ వెనుక ఎన్నో కథలున్నాయి. వాటిలో ఒకటి ప్రహ్లాదుడి కథతో ముడిపడి ఉంది. దాని ప్రకారం, రాక్షసులకు రాజైన హిరణ్యకశిపుడు దైవ ద్వేషి. అతని కొడుకు ప్రహ్లాదుడు దీనికి పూర్తిగా వ్యతిరేకం. నిత్యం హరి నామస్మరణ చేస్తూ ఉండేవాడు. ఇది నచ్చని హిరణ్యకశిపుడు తన కుమారుడిని చంపించాలని ఎన్నో విధాలుగా ప్రయత్నించాడు. ఒక సందర్భంలో ప్రహ్లాదుణ్ణి మంటల్లో వేసి చంపాలని నిర్ణయించుకొని తన సోదరి హోళికను రప్పించాడు. హోళికకు మంటల్లో పడినా బతికి బయటపడే వరం ఉంది. ఆమె ప్రహ్లాదుడిని ఒడిలో కూర్చోబెట్టుకొని మంటల్లో దూకింది. అయితే మహావిష్ణువు కృపతో ప్రహ్లాదుడు క్షేమంగా మంటల్లో నుంచి బయటపడ్డాడు. హోళిక సజీవ దహనమైపోయింది. రాక్షసి అయిన హోళిక మరణించినందుకు సంతోషిస్తూ ప్రజలు సంబరాలు చేసుకున్నారు. దీనికి చిహ్నంగా హోళికా దహనాన్ని కొన్ని ప్రాంతాల్లో జరుపుతారు.

మరో కథనం ప్రకారం, కృతయుగంలో రఘు మహారాజు పరిపాలిస్తున్న కాలంలో హోళిక అనే రాక్షసి ఊళ్ళలోకి వచ్చి పిల్లల్ని ఎత్తుకుపోయేది. ప్రజలు వచ్చి రాజుకు మొరపెట్టుకోగా, ఆ రాక్షసిని రఘు మహారాజు సంహరించాడు. అప్పుడు ప్రజలు చేసుకున్న వేడుకలే హోలీగా మారాయి. కాగా. శివుడి తపస్సును భగ్నం చెయ్యడానికి మన్మథుడు ప్రయత్నించగా, అతణ్ణి శివుడు మూడో కన్ను తెరచి దగ్ధం చేసిన రోజు ఇదేనన్న విశ్వాసం ఉంది. అందుకే హోలీ రోజున కామదహనం జరుపుతారు. ఈ రోజుకు 'అనంగ పౌర్ణమి'గా పేరు కూడా అందుకే వచ్చిందంటారు.

ఉత్తరాదిన ఉన్న మరో కథ శ్రీకృష్ణుడితో ముడిపడి ఉంది. 'డోలిక' అంటే ఊయల. శ్రీకృష్ణుడిని ఉయ్యాలలో వేసిన రోజుగా దీన్ని భావిస్తారు. దానికి గుర్తుగా శ్రీకృష్ణుడి బొమ్మను ఊయలలో వేసి డోలికా ఉత్సవం నిర్వహిస్తారు.

**ఈ రోజు ఏం చేయాలంటే...**

ఆచార వ్యవహారాలు ఏవైనా హోలీ పండుగ నాడు రంగులు పూసుకొనే వాడుక అన్ని చోట్లా కనిపిస్తుంది. హోలికా పూర్ణిమ రోజున లక్ష్మీనారాయణ వ్రతం ఆచరించడం, సరస్వతీదేవిని పూజించడం, పితృదేవతలకు తర్పణాలు ఇవ్వడం సంప్రదాయం. రాబోయేది వేసవి కాలం కనుక నీటినీ, పాత్రలనూ, గొడుగులనూ దానం ఇవ్వడం లాంటివి మంచి ఫలితాలు ఇస్తాయనేది పెద్దల మాట!





ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సద్గురువాణి

# ఆయనలో సగం ఆమే!

**ఆది యోగి శివుడు పార్వతిని తన శరీరంలో భాగంగా చేసుకున్నాడు. 'సగం స్త్రీ- సగం పురుషుడు'గా ఉండే అర్ధ నారీశ్వర రూపం ధరించాడు. ఆయనలో సగం భాగం స్త్రీ! కనుకనే ఆయన పురుషులలో సర్వశ్రేష్ఠుడైన పరమ పురుషుడయ్యాడు. ఇదంతా జీవితానికి సంబంధించిన ఒక తాత్త్విక సత్యాన్ని మానవులకు గుర్తు చేయడానికే!**

భౌతికంగా కనిపించే అన్ని లక్షణాలకూ రెండు వ్యతిరేక ధ్రువాలు ఉంటూ ఉంటాయి. 'పాజిటివ్-నెగెటివ్', 'పురుషుడు- స్త్రీ', 'శివుడు- శక్తి'... ఇలా ఇవి అనంతం. ఈ రెండు ధ్రువాలనూ విభజించి చూస్తూ, ఆ ధ్రువం గొప్ప, ఈ ధ్రువం గొప్ప అని ఆలోచిస్తే వాటి మధ్య తగవులూ, తీర్పులూ తలెత్తి తీరుతాయి. ఇలాంటి వాటితో ఎంతో అయోమయం, ఎన్నో విధాలైన వికృత స్పందనలూ, ఎన్నో రకాల దోపిడీలూ, పరపీడనలూ పుట్టుకొచ్చాయి.

అసలు 'స్త్రీత్వం- పురుషత్వం' అంటే ఏమిటి? ఒక వ్యక్తిలో స్త్రీ సహజమైన ధర్మాల్లో, పురుష సహజమైన లక్షణాల్లో ఒక దాని కన్నా మరొకటి కొంత హెచ్చుగా, ప్రస్ఫుటంగా కనిపించడం మాత్రమే! ఒకరు స్త్రీ రూపంలో ఉన్నంత మాత్రాన తండ్రి నుంచి సంక్రమించే పురుష సహజమైన లక్షణాలు అసలు లేనే లేవని కాదు. అలాగే పురుషులలో కూడా తల్లి నుంచి వచ్చే స్త్రీ సహజమైన లక్షణాలు కొన్ని ఉండి తీరుతాయి. ఈ సత్యాన్ని అర్థం చేసుకోవాలంటే ఒక వ్యక్తి తనలో అంతర్గతంగా ఉన్న పురుష- స్త్రీ ధర్మాలు రెండిటినీ ఒక సమన్వయంతో చూడాలి. అప్పుడే అతడు మానవుడిగా ఒక సమతుల్యతతో ఉండగలుగుతాడు. సమాజంలో ఈ రకమైన సమతుల్యత అవసరం. స్త్రీలు, పురుషులు ఎవరికి వారు తామే గొప్ప అని భావిస్తూ పోతే మానవ జాతి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. కాబట్టి ఆ సమతుల్యతను అలవరచుకోవాలి. అప్పుడే జీవితాలు క్షేమంగా సాగుతాయి.

ఆధ్యాత్మిక ప్రక్రియ అంటే- భౌతిక శరీర నిర్మాణ పరిమితులకు అతీతమైన స్థాయికి అనుభూతి పూర్వకంగా చేరడం! ఒకరి జీవితానుభవం ఆ వ్యక్తి భౌతిక శరీర నిర్మాణ భేదాలకు అతీతమై ఉన్నప్పుడు, శరీర నిర్మాణం రీత్యా పురుషుడైతేనేం, స్త్రీ అయితేనేం? జీవితంలో ఒక వ్యక్తి స్త్రీగానో, పురుషుడిగానో తన పాత్ర పోషించవలసి వచ్చేది కొన్ని సందర్భాలలో మాత్రమే! అలాంటప్పుడు ప్రతి సందర్భంలోనూ, అనుక్షణమూ ఈ స్త్రీ, పురుష భేదాన్ని చర్చలోకి తీసుకురావలసిన అవసరమే లేదు. కానీ ఇప్పటికీ మనం ఆ లింగ భేదం మీద ఆధారపడిన అస్తిత్వానికి అవసరానికి మించిన ప్రాధాన్యం ఇస్తున్నాం. దీని వల్ల స్త్రీజాతి సంక్షేమంలో మార్పురాదు. ఒక వ్యక్తి సామాన్య విధులు నిర్వర్తించేటప్పుడు స్త్రీలా, పురుషులా అనే ప్రశ్నకు తావే ఉండకూడదు. అలాంటి సమాజాన్ని మనం నిర్మించుకోవాలి. సామాజికమైన సమతుల్యత ద్వారా మాత్రమే మహిళలు సాధికారత సాధ్యం అవుతుంది. సమాజంలో ఘర్షణలు నెలకొని ఉంటే, పురుషుడు పై చేయి సాధించడం సహజం. సమతూకం, స్థిరత్వం ఉన్న సమాజంలో మాత్రమే స్త్రీలు తమ శక్తియుక్తులను పూర్తిగా ప్రకటించగలుగుతారు. మహిళలు అలా ప్రకటించడం నేడు ప్రపంచంలోని అతి కొద్ది సమాజాలలో మాత్రమే జరుగుతోంది. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం వల్ల స్త్రీలు, పురుషులు సరిసమానంగా భాగస్వాములు కావడానికి అనువైన భౌతిక ప్రపంచం ఏర్పడింది. ఇలాగే స్త్రీ, పురుషులు సమానంగా పాలు పంచుకోగల ఆధ్యాత్మిక, మనో వైజ్ఞానిక ప్రపంచాలను ఏర్పాటు చేసుకోవడానికి అనువైన సమయం వచ్చింది. స్త్రీత్వ, పురుషత్వ ధర్మాలు రెండూ సమానంగా పని చేస్తేనే, మనుషులు అంతర్గతమైన వికాసాన్ని అనుభవించగలుగుతారు. జీవితానుభవాలలో శిఖరాగ్రాలు ఎలా ఉంటాయో గ్రహించగలుగుతారు.



● సద్గురు జగ్గీవాసుదేవ్

సందేశం

## ఆమె స్థానం అత్యున్నతం

ఒక సమాజం మంచి చెడ్డలను మహిళలకు ఇచ్చే ప్రాధాన్యం ఆధారంగానే అంచనా వేయగలం. మహిళల పట్ల గౌరవ మర్యాదలతో వ్యవహరించే సమాజం ఉత్తమ సమాజం అవుతుంది. కనుకనే ఇస్లాం ధర్మం మహిళలకు సముచితమైన స్థానాన్ని కల్పించింది. దైవ ప్రవక్త మహమ్మద్ ఆవిర్భావానికి పూర్వం మహిళల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉండేది. వారి హక్కులన్నీ పురుషుల పాదాల కింద అణచివేతకు గురవుతూ వచ్చాయి. ఆత్మలేని శరీరంలా వారు జీవితాలను గడిపేవారు. తల్లి గర్భంలోంచీ బయటకు వచ్చిన ఆడ శిశువులను సజీవ సమాధి చేసే దారుణాలు కూడా జరిగేవి. మహిళల శ్రేయస్సే ధ్యేయంగా కరుణామయుడైన అల్లాహ్ నిర్దేశించిన హక్కులను దైవ ప్రవక్త ప్రకటించారు. మహిళలు వారి హక్కులను నెరవేర్చుకోవడంలో ఆటంకం కల్పించిన వారు ఇహ, పరలోకాలలో శిక్షలకు అర్హులవుతారని హెచ్చరించారు. ఆ హక్కులు ఏమిటో ఇస్లామ్ ధర్మం స్పష్టంగా తెలిపింది. షరియత్ కోటలో ఆమె స్థానాన్ని సురక్షితం చేసింది. మహిళలు శుభప్రదమైన వారనీ, వారిని పెంచి, పోషించిన వారు అనేక బహుమతులు పొందుతారనీ, ఉన్నతమైన లోకాలలోకి ప్రవేశిస్తారనీ అల్లాహ్ వాగ్దానం చేశాడు. ఆడబిడ్డల పుట్టుకను అశుభంగా భావించి, వారి పట్ల మంచిగా ప్రవర్తించని తల్లితండ్రుల ముఖాలను ప్రళయ దినాన కన్నెత్తి కూడా చూడనని హెచ్చరించాడు. అలాగే తల్లి పాదాల కింద స్వర్గం ఉన్నదనీ, తల్లిని సేవించి స్వర్గాన్ని కైవసం చేసుకోవాలనీ ఉత్తేజపరిచాడు. తల్లిని సేవించని, గౌరవించని సంతానానికి స్వర్గంలో ప్రవేశం లేదని స్పష్టం చేశాడు. అలాగే, తల్లితండ్రులు, భర్త, కుమారులు, అన్నదమ్ముల ఆస్తిలో మహిళలకు హక్కును ఇస్లాం అందించింది.

వ్యక్తిత్వాన్నీ, స్వభావాలనూ తీర్చిదిద్దడంలో, నైతిక, ఆధ్యాత్మిక, ఆర్థిక వికాసాలలో విద్య కీలకపాత్ర వహిస్తుంది. విద్యావంతుడయిన ప్రతి పురుషుడూ 'తల్లి ఒడి' అనే బడి నుంచి ప్రాథమిక శిక్షణ పొందుతాడు. ఆమె పరిశీలనాత్మకమైన పెంపకంలో నైతికత, ఆధ్యాత్మికత అలవరచుకుంటాడు. ఆ తరువాతే ప్రాపంచికమైన పరీక్షలను ఎదుర్కొంటాడు. కాబట్టే మొదటి గురువైన మహిళకు విద్యా హక్కును ఇస్లాం ప్రకటించింది. తన ధర్మంలో స్త్రీకి అత్యున్నత స్థానం కల్పించింది.

● మహమ్మద్ వహీదుద్దీన్



నవజీవన వేదం

## అతిథి సత్కారమే యజ్ఞం!

జీవితాన్ని యజ్ఞంలా భావించాలి. ప్రకృతిని బలపరచాలి. 'దేవుడికి నైవేద్యం పెట్టడమంటే మొక్కలకు నీళ్లు పోయడం, వాటిని సంరక్షించడమే!' అని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీత మూడో అధ్యాయం పదమూడో శ్లోకంలో స్పష్టంగా వివరించాడు.

**యజ్ఞశిష్టాశినః సంతో ముచ్యంతే సర్వ కిల్బిషైః**
**భుంజతే తే త్వఘం పాపా యే పచంత్యాత్మకారణాత్**

ఆధునిక జీవనంలో మనం కోల్పోయిన ఒక అవకాశం అతిథి సేవ. ఇవ్వాళ ఇంటికి చుట్టాలొస్తే భరించగలిగే శక్తి లేదు. మేనత్తలు, మేనమామలు, పినతండ్రులు ఇంటికి రావడమే మానేశారు. మన ఆదరణ అలాగే ఉంది. వాళ్ల ఆత్మీయతా అలాగే ఉంది. ఎక్కడో హోటల్‌లో దిగుతారు. "బిజినెస్ పని మీదొచ్చాను. బిజీగా ఉన్నాను. మళ్లీ వచ్చినప్పుడు కలుస్తాను" అని చెప్పి వెళ్లిపోతుంటారు. వచ్చేంత తీరిక వారికి ఉన్నా, రమ్మనేంత ప్రేమ మనకు లేదు. పండిన పంట, ఉన్న పాడిలో ప్రకృతి శక్తుల్ని బలపరచడం కోసం యజ్ఞం రూపంలో సమర్పించవలసింది సమర్పించిన తరువాతే మిగిలిన దాన్ని మనం ఆహారంగా స్వీకరించాలి. జీవితాన్ని యజ్ఞంలా భావించాలి. పంచభూతాలను, అతిథులను పోషించిన తరువాత మిగిలిన ఆహారాన్నే తినాలి. అప్పుడే పాపం లేకుండా ఉంటుంది. అలాకాకుండా పాపాత్ములు పాపాన్ని వండుకొని తింటున్నారు. "అతిథులనే వారే లేకుండా, తన కుటుంబం మాత్రమే వండుకుని తింటున్నారంటే పాపాన్ని వండుకొని తింటున్నట్టే లెక్క!" అని ఋగ్వేదంలోనే చెప్పారు. ఒక్క అతిథికైనా భోజనం పెట్టాలి. ఎవరూ దొరక్కపోతే కాస్త ఆహారం తీసుకెళ్లి చెట్టు పక్కన వదిలేయాలి. సూక్ష్మజీవులు తింటాయి. దీన్ని అందరం పాటిద్దాం!



చిత్రం: కేశవ్



● డా. గరికిపాటి నరసింహారావు

దైవమార్గం

## దైవమే ఆలంబన

"నేను ద్రాక్ష తీగను. నా తండ్రి ద్రాక్ష రైతు. నాలో ఏ కొమ్మ ఫలించకపోయినా, ఆయన దాన్ని తొలగిస్తాడు. పండ్లు కాసే కొమ్మలను కూడా ఆయన కత్తిరిస్తాడు. ఎక్కువ ఫలాలు అవి కాసే విధంగా వాటిని సరి చేస్తాడు. ద్రాక్ష కొమ్మ తీగతో ఉంటేనే ఫలాలు ఇస్తుంది. దానతంట అదిగా పండ్లు కాయలేదు. మీరు కూడా అంతే! మీరు నాతో ఉంటేనే ఫలిస్తారు. నాలో ఎవరు ఉంటారో, నేను ఎవరిలో ఉంటానో వారే ఎక్కువగా ఫలిస్తారు"- ఒక సందర్భంలో ఏసు ప్రభువు అన్న మాటలు ఇవి! దైవాన్ని ఆలంబనగా చేసుకున్న వ్యక్తి జీవితంలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా ధైర్యంగా ఉంటాడు. స్థిర చిత్తంతో వాటిని ఎదుర్కొంటాడు. విశ్వాసం లేని వ్యక్తులు ఫలించని కొమ్మలలాంటివారు. దైవమే తమకు ఆసరా అని నమ్మిన వారు పండ్లు కాసే కొమ్మల లాంటివారు. అలాంటి వారికి కష్టాలు కలిగినా, అవి మంచి ఫలితాలు లభించడానికే! అదే ఏసు ప్రభువు చెప్పిన మాటల్లోని సారాంశం.



స్మరణ

## మతం అంటే...



"ఒకసారి నా దగ్గరకు వచ్చిన కొందరు పండితులు నన్ను ఒక ప్రశ్న అడిగారు, 'మతం' అనే పదానికి అర్థం ఏమిటి? అని. 'దాన్ని తిరిగి చేరడం' లేదా 'దానితో మళ్ళీ ముడిపడడం'... ఇదే ఆ పదానికి అర్థం అని వారికి చెప్పాను. 'చేరడం', 'మళ్ళీ' అనే మాటలకు విశిష్టమైన అర్థం ఉంది. ప్రారంభంలో భగవంతుడితో కలిసి ఉన్న మనిషి అతని నిర్లక్ష్యం కారణంగానో, అతని కర్మ కారణంగానో దేవుడి నుంచి వేరు పడతాడు. తన కార్యాలన్నిటినీ తానే స్వతంత్రంగా నడిపిస్తున్నానని అతను భావిస్తాడు. 'వేరుతనం' అనే ఈ భావనను తొలగించి, అతణ్ణి తిరిగి భగవంతుడితో చేర్చడం, అతని అసలైన, ప్రాకృతికమైన లక్షణాలను తిరిగి అతనికి పరిచయం చేయడం మతం తాలూకు ప్రయోజనం. ఏ మతానికి ఆ మతం వేరుగా కనిపిస్తున్నప్పటికీ, అన్ని మతాల ప్రయోజనం, లక్ష్యం ఒక్కటే!"

● స్వామి జయేంద్ర సరస్వతి
(కంచి కామకోటి పీఠం పూర్వ అధిపతి జయేంద్ర సరస్వతి స్వామి ఆరాధన రేపు)

యోగానందం

## మీలో దీపం వెలిగించండి!



"మీలో ఉన్న బలహీనతలను తొలగించుకోవడానికి అత్యుత్తమమైన మార్గం- వాటి గురించి ఆలోచించక పోవడమే! లేనట్టయితే మీరు వాటిలో మునిగిపోతారు. మీ లోపల దీపాన్ని వెలిగించుకోండి, ఆ చీకటి ఎన్నడూ లేనట్టు మీకు అనిపిస్తుంది. నా జీవితానికి గొప్ప స్ఫూర్తిని ఇచ్చిన ఆలోచనల్లో ఇదొకటి. వేల సంవత్సరాల నుంచీ చీకటిలో మగ్గుతున్న ఒక గుహలోకి మీరు ఒక చిన్న దీపాన్ని తీసుకువెళ్లారనుకోండి, ఆ చీకటంతా అప్పటికప్పుడే మాయమైపోతుంది! అలాగే 'దైవం' అనే జ్యోతిని మనలోకి తీసుకువస్తే మన తప్పులూ, లోపాలూ అన్నీ అదృశ్యమైపోతాయి. 'నిర్లక్ష్యం' అనే చీకటి ఇక ఎన్నడూ మీలో ప్రవేశించలేదు."

● పరమహంస యోగానంద
(రేపు పరమహంస యోగానంద వర్ధంతి)

దర్మపథం

## బుద్ధుడి ఏకాగ్రత

బుద్ధుడు తన సిద్ధాంతాన్ని మూడు ప్రధాన భాగాలుగా విభజించాడు. అవి: ప్రజ్ఞ, శీలం, సమాధి. వీటిలో ప్రజ్ఞ జ్ఞానానికి సంబంధించినది. శీలం సంస్కారానికీ, నడతకూ సంబంధించినది. మూడోదైన సమాధి మానసిక చైతన్యానికి సంబంధించినది. చిత్త ప్రక్షాళనకూ, మనో వికాస పరిపూర్ణతకూ చెందినది. ఒక్క మాటలో చెప్పాలంటే, ఏకాగ్రతకు సంబంధించినది. మనస్సును మగత నిద్రలోకి పంపే ప్రక్రియలు చాలా ఉన్నాయి. ఆ అచేతన స్థితి వల్ల ప్రయోజనం లేదన్నాడు బుద్ధుడు. మనిషి స్పృహలో ఉంటూనే... అంటే ఎరుకతో ఉంటూనే ఇతర విషయాలను గ్రహించని స్థితిని ఆయన ఆవిష్కరించాడు. అదే విపస్సన- ధ్యానం.

ఒక రోజు బుద్ధుడు అనారోగ్యం పాలయ్యాడు. ఆయనకు భరించరాని పొట్ట నొప్పి వచ్చింది. ఒక వైపు ఔషధాలు తీసుకుంటూనే మరోవైపు ధ్యాన స్థితిలో ఆ నొప్పిని భరించాడు. 'ఆ భాగంలో నాకు నొప్పి లేదు' అని మనస్సును మలచడం ద్వారా ఆ నొప్పిని నిగ్రహించాడు.

అలా ఒకనాడు కుశీ నగరం శివారులోని రెండు సాల వృక్షాల కింద ఆయన కూర్చొని, ధ్యానంలో నిమగ్నమయ్యాడు. ఆ పక్కన ఉన్న దారిలోంచీ వందల బండ్లు వెళ్ళాయి. ఆ బండ్ల చక్రాలు కర్రు కర్రున శబ్దాలు చేశాయి. ఎద్దుల గంటలు గణగణ మ్రోగాయి. రైతులు 'అహై అహై' అంటూ ఎడ్లను అదిలించే అరుపులు వినిపించాయి. ఆ బండ్లు వెళ్ళిన కొంత సేపటికి బుద్ధుడు ధ్యానం నుంచి బయటకు వచ్చాడు.

తన శిష్యుడితో "ఆనందా! దాహంగా ఉంది. నదీ తీరానికి వెళ్ళి, స్వచ్ఛమైన నీళ్ళు తీసుకురా!" అన్నాడు.

ఆనందుడు నదీ తీరానికి వెళ్ళాడు. ఆ తీరంలోనే వందలాది బండ్లు దిగి, అవతలి ఒడ్డుకు వెళ్ళాయి. దాంతో నీరంతా మురికి మురికిగా ఉంది. ఆనందుడు తిరిగి వచ్చాడు.

ఇదంతా ఆ దగ్గరలో ఉన్న ఒక యోగి చూస్తూనే ఉన్నాడు. అతని పేరు మల్ల పుత్రుడు. అతనికి బుద్ధుడు, ఆనందుల ప్రవర్తన వింతగా తోచింది. అతను బుద్ధుడి దగ్గరకు వచ్చి, తనను పరిచయం చేసుకొని "భగవాన్! నేను ఎప్పటి నుంచో తమరిని దర్శించాలని చూస్తున్నాను. ఈనాటికి నాకు మీ దర్శన భాగ్యం కలిగింది. కానీ, మీ ప్రవర్తన వింతగానూ తోచింది" అన్నాడు.

"మల్లపుత్రా! ఎందుకు ఎలా అడిగావు?" అని ప్రశ్నించాడు బుద్ధుడు.

"భగవాన్! ఇంతకుముందే మీ పక్క నుంచీ వందల బండ్లు వెళ్ళాయి. అవి రేవులోకి దిగుతాయనీ, అవి దిగితే నీరు మురికి అవుతుందనీ తెలిసి కూడా స్వచ్ఛమైన నీరు తేవాలని ఆనందుణ్ణి మీరు ఎలా పంపారు?" అని అడిగాడు.

"మల్లపుత్రా! నిజమా! ఆ బండ్లు వెళ్ళిన విషయమే నాకు తెలీదు" అన్నాడు బుద్ధుడు.



..అలాగా భగవాన్! అద్భుతం భగవాన్! అద్భుతం! ఆశ్చర్యం భగవాన్! ఆశ్చర్యం! మీ ధ్యానంలోని విశిష్టత అదే నన్నమాట. నేను విన్నది ఈ రోజు కనులారా చూశాను. ఎంతటి ఏకాగ్రత! ఎంతటి ఎరుక! ఎంతటి ధ్యానం!" అంటూ మల్లపుత్రుడు మోకరిల్లాడు.

..ఆనందా! నీవు వెళ్ళు! నీరు తేరుకొనే ఉంటుంది. వెళ్ళి తీసుకురా!" అన్నాడు బుద్ధుడు.

ఆనందుడు వెళ్ళి, కొద్ది సేపటికి మంచి నీరు తీసుకువచ్చాడు. బుద్ధుడు దప్పిక తీర్చుకున్నాడు. అదే బుద్ధుని ఆఖరి దప్పిక!

● బొర్రా గోవర్ధన్

సమాచారం

## కల్యాణ నారసింహుడు



తెలుగు రాష్ట్రాల్లోని పలు నృసింహ క్షేత్రాలు బ్రహ్మోత్సవ శోభతో అలరారుతున్నాయి. అంగరంగ వైభవంగా స్వామివారి కల్యాణ వేడుకల కోసం ముస్తాబవుతున్నాయి.

- తెలంగాణలోని ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం అవుతాయి. శనివారం స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవాలు ఈనెల 18 వరకూ కొనసాగుతాయి.
- ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని ఈ నెల ఎనిమిదో తేదీన నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 29న ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఈ నెల 11న ముగుస్తాయి.
- ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా అహోబిలంలో ఫిబ్రవరి 28న బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. వీటిలో భాగంగా మార్చి 6న ఎగువ అహోబిలంలో శ్రీ జ్వాలా నృసింహస్వామి, చెంచులక్ష్మి, లక్ష్మీదేవిల కల్యాణం, మార్చి 7న దిగువ అహోబలంలో శ్రీ ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవిల కల్యాణం నిర్వహిస్తారు. ఈ నెల 13వ వరకూ ఉత్సవాలు జరుగుతాయి.

### డైలీ సుడోకు -299

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 8 | | | 1 | 9 | | | |
| | 2 | | | | | | | |
| | | 3 | | 4 | 2 | | | 1 |
| | 5 | | | | | 4 | | |
| | 9 | 6 | 7 | | 1 | 3 | 5 | |
| | | 1 | | | | | 9 | |
| 9 | | | 5 | 8 | | 1 | | |
| | | | | | | | 3 | |
| | | | 1 | 7 | | | 6 | |

**సుడోకు - 298 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | 9 | 4 | 3 | 5 | 8 | 2 | 1 | 7 |
| 3 | 8 | 7 | 2 | 6 | 1 | 9 | 5 | 4 |
| 1 | 5 | 2 | 4 | 9 | 7 | 8 | 6 | 3 |
| 2 | 6 | 3 | 8 | 1 | 4 | 5 | 7 | 9 |
| 7 | 4 | 8 | 5 | 3 | 9 | 1 | 2 | 6 |
| 5 | 1 | 9 | 6 | 7 | 2 | 4 | 3 | 8 |
| 8 | 2 | 5 | 7 | 4 | 3 | 6 | 9 | 1 |
| 4 | 7 | 1 | 9 | 2 | 6 | 3 | 8 | 5 |
| 9 | 3 | 6 | 1 | 8 | 5 | 7 | 4 | 2 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.


B&W PICTURES
POORVI
నేడే విడుదల
అనుకున్నది ఒక్కటి అయినది ఒక్కటి
HIMA VELAGAPUDI
BAALU ADUSUMILLI
VEGI SRINIVAS


bhavya creations
నేడే విడుదల
ఓ..పిట్టకథ
it's a long story...
వి.ఆనందప్రసాద్
చెందు ముద్దు


Panchakshari PRESENTS
వైతరణీ
V. AMBHIKA VIJAY
BANA VENKATA KONDA REDDY
V.VIJAYARAJU
Contact Distributors & Exhibitors for Area wise Distribution & Theatrical Rights.Ph No. 87904 26229, 91006 71368, 97036 51111
Releasing in March 2020


MR PICTURES
LAKSHMAN GOWDA PRESENTS
DISTRIBUTION
నేడే విడుదల
కాలేజ్ కుమార్
PRODUCER L.PADMANABHA
WRITTEN AND DIRECTED BY HARI SANTHOSH
MUSIC QUTUB E KRIPA
DOP GURU PRASHANTH RAI
ACTION A VIJAY


HIGH INTENSITY THRILLER
WALL POSTER CINEMA
NANI PRESENTS
BIG
2ND WEEK
VISHWAK SEN IN
HIT
THE FIRST CASE
PRODUCED BY PRASHANTI TIPIRNENI
WRITTEN & DIRECTED BY Dr SAILESH KOLANU
#HITMOVIE


EXPERIENCE THE POWER OF SUBMISSION IN LOVE
DR.K ARUNA KUMARI PRESENTS
నేడే విడుదల
స్క్రీన్ ప్లే
SCREENPLAY
OF AN INDIAN LOVE STORY
WRITTEN & DIRECTED BY K.L. PRASAD
PRODUCER DR.K.ARUNA KUMARI


తెలుగువారు గర్వపడే అరుదైన చిత్రం
THAMMAREDDY BHARADWAJ PRESENTS
SUDHAS MEDIA
media9
SURESH PRODUCTIONS RELEASE
RAKSHIT IN
1978
పలాస
Written & Directed by KARUNA KUMAR
PRODUCER DHYAN ATLURI CO PRODUCER MANOJ KUMAR (MEDIA9) DOP ARUL VINCENT MUSIC RAGHU KUNCHE
EDITOR KOTAGIRI VENKATESWAR RAO LYRICS SUDDALA ASHOKTEJA
A R BELLANA BHASKARABATLA RAVIKUMAR LAKSHMI BHUPALA BANDI SATHYAM
RAM SUNKARA VIJAY POLAKI NAGENDRA KASI SURESH MARPINA GSK MEDIA I QUBE DIGITALS
#PALASA1978
ADITYA MUSIC
నేడే విడుదల

| | సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం (ముంబై 10 గ్రాములు (99.9 శాతం స్వచ్ఛత)) | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|---|
| మార్పు | 61.13 ↑ | 18.00 ↑ | 70 ↑ | 35 ↓ | (6 పైసలు) ↑ | ↓ |
| ధర | 38,470.61 | 11,269.00 | 43,373 | 46,170 | 73.33 | 51.04 |

# ఎస్‌బీఐ కార్డ్స్ ఐపీఓ బ్లాక్‌బస్టర్!

## 22 రెట్లకు పైగా ఇష్యూ సబ్‌స్క్రిప్షన్

న్యూఢిల్లీ: కరోనా దెబ్బకు మార్కెట్ సెంటిమెంట్ ప్రతికూలంగా మారిన తరుణంలో తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు వచ్చిన ఎస్‌బీఐ కార్డ్స్‌కు ఇన్వెస్టర్లు బ్రహ్మరథం పట్టారు. బలమైన ఆర్థిక మూలాలు కలిగిన ఈ కంపెనీ ఈక్విటీ వాటాలను దక్కించుకునేందుకు భారీగా పోటీపడ్డారు. దాంతో ఇష్యూ సైజుకు 22.45 రెట్ల బిడ్లు దాఖలయ్యాయి. ఐపీఓ ప్రక్రియలో భాగంగా కంపెనీ.. గత నెల 29న 74 మంది యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.2,769 కోట్లు సేకరించగలిగింది. ఈ నెల 2న ప్రారంభమైన ఈ ఇష్యూ గురువారం నాడు ముగిసింది. దేశంలోని అతిపెద్ద బ్యాంకైన ఎస్‌బీఐ అనుబంధ విభాగమే ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్. ఈ మధ్య కాలంలో ఐపీఓ ద్వారా మార్కెట్ నుంచి భారీగా నిధులు సేకరించిన కంపెనీల్లో ఒకటి. ఎస్‌బీఐ కార్డ్స్‌లో ప్రస్తుతం ఎస్‌బీఐకి 76 శాతం వాటా ఉంది.

### రూ.2 లక్షల కోట్ల విలువైన బిడ్లు!

సవాళ్ల సమయంలోనూ ఎస్‌బీఐ కార్డ్స్ ఐపీఓకు మార్కెట్లో బ్లాక్‌బస్టర్ స్పందన లభించిందని విశ్వసనీయ వర్గాలన్నాయి. ఈ ఇష్యూ సైజుతో పోలిస్తే 26 రెట్లకుపైగా బిడ్లు వచ్చాయని, వాటి విలువ దాదాపు రూ.2 లక్షల కోట్లని వారన్నారు. రూ.750-755 ధర శ్రేణితో వచ్చిన ఈ ఇష్యూ ద్వారా కంపెనీకి రూ. 10,355 కోట్లు సమకూర్చుకోనుంది.

# ఎస్‌బీఐ కన్సార్షియం చేతికి యెస్ బ్యాంక్

▸▸ త్వరలో వెలువడనున్న ప్రకటన

న్యూఢిల్లీ/ముంబై: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), ఇతర ఆర్థిక సంస్థల సారథ్యంలోని కన్సార్షియం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రైవేటు రంగంలోని యెస్ బ్యాంక్‌ను సొంతం చేసుకోనున్నట్టు తెలుస్తోంది. ఇందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉందని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న విశ్వసనీయ వర్గాలు గురువారంనాడు తెలిపాయి. ఈ నేపథ్యంలో గురువారం ఎస్‌బీఐ బోర్డు సమావేశం జరగడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా యెస్ బ్యాంక్‌లో వాటా విషయంపై చర్చ జరిగినట్టు సమాచారం. అయితే ఇందుకు సంబంధించిన వివరాలు మాత్రం వెల్లడికాలేదు. యెస్ బ్యాంక్‌లో వాటా తీసుకునేందుకు ఎస్‌బీఐతో చేతులు కలపాలని ఎల్‌ఐసీని కూడా కోరినట్టు సమాచారం. ఇప్పటికే ఎల్‌ఐసీకి యెస్ బ్యాంక్‌లో 8% వాటా ఉంది. కాగా ఒక వేళ డీల్ కుదిరితే చాలా ఏళ్ల తర్వాత ప్రైవేటు రంగంలోని ఒక బ్యాంకును ప్రభుత్వ రంగ బ్యాంకు కాపాడినట్టు అవుతుంది.

### 27 శాతం పెరిగిన యెస్ బ్యాంక్ షేరు

ఎస్‌బీఐ సారథ్యంలోని కన్సార్షియం యెస్ బ్యాంక్‌ను టేకోవర్ చేస్తుందన్న వార్తల నేపథ్యంలో గురువారం యెస్ బ్యాంక్ షేరు జోరుగా పెరిగింది. బీఎస్ఈలో 25.77 శాతం పెరిగి రూ.36.85 వద్ద ముగిసిన షేరు ఎన్ఎస్ఈలో 26.96 శాతం ఎగబాకి రూ.37.20 వద్ద క్లోజైంది.

### యెస్ బ్యాంక్ విత్‌డ్రాయల్స్‌పై ఆంక్షలు

నిధుల కొరత ఎదుర్కొంటున్న యెస్ బ్యాంక్‌పై ఆర్‌బీఐ ఆంక్షలు విధించింది. బ్యాంకు ఖాతాదారులెవరూ తమ ఖాతాల నుంచి నెలకు రూ.50,000కు మించి విత్‌డ్రా చేసుకునేందుకు వీల్లేదని పేర్కొంది. తదుపరి ప్రకటన వెలువడే వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయి. అలాగే బ్యాంక్ బోర్డునీ రద్దు చేసి ఎస్‌బీఐ మాజీ సీఎఫ్ఓ ప్రశాంత్ కుమార్‌ను అడ్మినిస్ట్రేటర్‌గా నియమించింది.

# కరోనాకు బీమా కవరేజీ

## ప్రస్తుత పాలసీలతోనే పొందొచ్చు

### జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ వెల్లడి



ముంబై: కరోనా వైరస్ వంటి అంటువ్యాధి చికిత్సకు మార్కెట్లో విక్రయిస్తున్న దాదాపు అన్ని హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలతో కవరేజీ లభిస్తుందని జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ స్పష్టం చేసింది. దేశంలోని 44 సాధారణ బీమా కంపెనీలకు ఈ కౌన్సిల్ ప్రాతినిధ్యం వహిస్తోంది. ప్రస్తుత హెల్త్ పాలసీల్లో కరోనా వైరస్ చికిత్సకూ బీమా కవరేజీ కల్పించాలని, ఈ కేసుల్లో క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించాలని భారత బీమా అభివృద్ధి, నియంత్రణ మండలి (ఐఆర్‌డీఏఐ) బుధవారం ఇన్సూరెన్స్ కంపెనీలను కోరింది. ఈ నేపథ్యంలోనే కౌన్సిల్ స్పష్టతనిచ్చింది.

## ఎయిర్‌లైన్స్ రాబడికి రూ.8.25 లక్షల కోట్ల గండి

సింగపూర్: కరోనా వైరస్ దెబ్బకు ఈ ఏడాది ప్రపంచ ఎయిర్‌లైన్స్‌కు 11,300 కోట్ల డాలర్ల వరకు ఆదాయాన్ని నష్టపోవచ్చని ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) అంచనా వేసింది. మన కరెన్సీలో ఈ విలువ రూ.8.25 లక్షల కోట్లు. ఈ మొత్తం ప్రపంచ ఎయిర్‌లైన్స్‌ల వార్షికాదాయంలో 19 శాతానికి సమానమని ఐఏటీఏ పేర్కొంది. అంతే కాదు, 2008 ఆర్థిక మాంద్యం సమయంలో విమానయాన రంగం నష్టపోయిన మొత్తానికి సమానమని అంటోంది.

## భారత ఎగుమతులకు రూ.2,540 కోట్ల నష్టం

కరోనా ప్రభావంతో భారత ఎగుమతి వాణిజ్యం 34.8 కోట్ల డాలర్ల (రూ.2,540 కోట్లు) తగ్గవచ్చని ఐక్యరాజ్య సమితి తాజా నివేదిక అంచనా వేసింది. అంతేకాదు, ఎగుమతి వాణిజ్యం తీవ్రంగా ప్రభావితమైన 15 దేశాల్లో భారత్ కూడా ఒకటని రిపోర్టులో పేర్కొంది. కరోనా దెబ్బకు గతనెలలో ప్రపంచ వస్తు ఎగుమతులు 5,000 కోట్ల డాలర్ల (రూ.3.65 లక్షల కోట్లు) మేర తగ్గి ఉంటాయని ఐక్యరాజ్య సమితి ఆర్థిక వేత్తల అంచనా.

## ఇంటి నుంచే పనిచేయండి: జోహో

క్లౌడ్ సేవల కంపెనీ జోహో కార్ప్ తన ఉద్యోగులందరికీ వర్క్ ఫ్రమ్ హోమ్ (ఇంటి వద్దనే నుండి పనిచేయడం) ఆదేశాలు జారీ చేసింది. "ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ కార్యాలయాల ఉద్యోగులందరినీ ఇంటి వద్ద నుంచే ఆఫీసు కార్యకలాపాలు చక్కబెట్టాలని కోరడం జరిగింద"ని జోహో కార్ప్ వ్యవస్థాపకులు, సీఈఓ శ్రీధర్ వెంబు తెలిపారు.

# కార్లు, ద్విచక్ర వాహనాలపై థర్డ్ పార్టీ ప్రీమియం పెంపు



| వాహనం సామర్థ్యం | ప్రస్తుత ప్రీమియం | ప్రతిపాదిత ప్రీమియం |
|---|---|---|
| 1000 సీసీ లోపు కార్లు | రూ. 2,072 | రూ. 2,182 |
| 1000-1500 సీసీ కార్లు | రూ. 3,221 | రూ. 3,383 |
| 1500 సీసీ పైన | రూ. 7,890 | మార్పు లేదు |
| 75 సీసీ లోపు టూవీలర్లు | రూ. 482 | రూ. 506 |
| 350 సీసీ పైన | రూ. 2,323 | రూ. 2,571 |
| విద్యుత్ వాహనాలు | | |
| 30 కిలోవాట్లు లోపు కార్లు | రూ.4,493 | రూ.5,167 |
| 3 కిలోవాట్లు మించని టూవీలర్లు | రూ.888 | రూ.1,040 |

న్యూఢిల్లీ : కార్లు, ద్విచక్ర వాహనాలు, రవాణా వాహనాలపై ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి థర్డ్ పార్టీ ప్రీమియం పెరిగే ఆస్కారం ఉంది. కొత్త ఆర్థిక సంవత్సరంలో వాహనాలపై థర్డ్ పార్టీ ప్రీమియం పెంపును ప్రతిపాదిస్తూ ఐఆర్‌డీఏఐ గతంలో చేసిన సిఫారసు చేస్తూ ప్రతిపాదిత రేట్లతో ముసాయిదాను కూడా విడుదల చేసింది. ఈ ముసాయిదాపై అన్ని వర్గాల నుంచి కామెంట్లు కోరింది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ ప్రతిపాదిత ప్రీమియంలు అమలులోకి రానున్నాయి. అలాగే విద్యుత్ కార్లపై కూడా ప్రీమియం పెంపును కూడా ప్రతిపాదించింది. అదే విధంగా బస్సులు, లారీలు, ట్రక్కులు అన్నింటి పైనా ప్రీమియం పెంపు ఆ ప్రతిపాదనల్లో ఉంది.

## ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | |
|---|---|
| 5వ తేదీకి.. | |
| హైదరాబాద్ | 275 |
| 6వ తేదీకి.. | |
| చిత్తూరు | 323 |
| గోదావరి | 310 |
| విజయవాడ | 310 |
| విశాఖపట్నం | 350 |
| వరంగల్ | 278 |
| డజను గుడ్లు రూ. 54 | |

## ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | |
|---|---|
| హైదరాబాద్ | 47 |
| వరంగల్ | 47 |
| మహబూబ్‌నగర్ | 47 |
| కరీంనగర్ | 47 |
| కర్నూలు | 47 |
| విశాఖపట్నం | 44 |
| గోదావరి | 40 |
| విజయవాడ | 51 |
| గుంటూరు | 51 |
| ఒంగోలు | 51 |
| చిత్తూరు | 65 |
| నెల్లూరు | 65 |
| అనంతపురం | 46 |

## బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 42,230 | 43,750 | 44,980 | 43,600 | 43,280 |
| క్రితం ముగింపు | 42,230 | 43,840 | 44,710 | 43,800 | 43,340 |
| 22 క్యారెట్లు | 40,220 | 40,500 | 41,380 | 40,310 | 41,220 |
| క్రితం ముగింపు | 40,220 | 40,600 | 41,130 | 40,560 | 41,280 |
| వెండి (కిలో) | 45,800 | 48,000 | 47,800 | 47,500 | 49,700 |
| క్రితం ముగింపు | 46,700 | 48,000 | 47,700 | 47,700 | 50,000 |

# ఐదేళ్లలో భారత సంపన్నులు డబుల్

▸▸ నైట్ ఫ్రాంక్ వెల్త్ రిపోర్ట్ అంచనా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఓ వైపు భౌగోళిక రాజకీయపరమైన ఆందోళనలు మరోవైపు ఆర్థిక వ్యవస్థలో మందగమన పరిస్థితులు ఇలాంటి తరుణంలో ఎలాంటి పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందోనన్న భయాలు నెలకొంటున్నాయి. ఇందుకు భిన్నంగా దేశంలో మాత్రం సంపన్నుల సంఖ్య పెరుగుతోంది. 2019 సంవత్సరంలో మన దేశంలో 3 కోట్ల డాలర్లకన్నా ఎక్కువ సంపద ఉన్న వారి (అల్ట్రా హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్- యూహెచ్ఎన్‌డబ్ల్యూఐ) సంఖ్య 5,986గా ఉంది. వచ్చే ఐదేళ్ల కాలంలో (2024 నాటికి) ఈ సంఖ్య 73 శాతం పెరగనుంది. అంటే రెండింతలు పెరిగి 10,354కు చేరుకోవచ్చని ప్రాపర్టీ కన్సల్టెంట్ నైట్‌ఫ్రాంక్ వెల్త్ రిపోర్ట్ 2020 అంచనా వేస్తోంది. 2022నాటికి దేశ ఆర్థిక వ్యవస్థలో వృద్ధి 7 శాతానికి చేరుకుంటుందన్న అంచనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో సంపన్న సంఖ్య వృద్ధికి అవకాశం ఏర్పడనుంది. ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థలో మందగమనం నెలకొంది. కానీ దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థలో బలమైన వృద్ధి ఉంటుందని ప్రపంచ ఆర్థిక వేత్తలు అంచనావేస్తున్నారని నైట్‌ఫ్రాంక్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శిశిర్ బైజల్ తెలిపారు. భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండటంతోపాటు భారీ స్థాయిలో వినియోగదారులున్న కారణంగా సంపద వృద్ధికి దోహదపడుతున్నట్టు ఆయన చెప్పారు. ప్రపంచ ఉత్పత్తులు, సర్వీసులకు భారత్ కీలకమైన మార్కెట్‌గా ఎదుగుతోందన్నారు.

# ఆంధ్రా బ్యాంక్ విలీనానికి లైన్ క్లియర్

▸▸ ఖరారైన షేర్ల కేటాయింపు నిష్పత్తి

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)లో విలీనం అయ్యే బ్యాంకుల వాటాదారులకు చెల్లించాల్సిన షేర్ల నిష్పత్తి ఖరారైంది. యూబీఐలో విలీనమయ్యే ఆంధ్రా బ్యాంక్ వాటాదార్ల దగ్గర ఉన్న ప్రతి 1,000 షేర్లకు 325 యూబీఐ షేర్లు, ప్రతి 1,000 కార్పొరేషన్ బ్యాంక్ షేర్లకు 330 యూబీఐ షే ర్లు లభిస్తాయి. ఏప్రిల్ 1 బ్యాం కుల విలీనం అమల్లోకి రానుంది.

**27న బ్యాంక్ ఉద్యోగుల సమ్మె:** బ్యాంకుల విలీనానికి వ్యతిరేకంగా ఈ నెల 27న దేశవ్యాప్తంగా సమ్మెకు దిగుతున్నట్టు అఖిల భారత బ్యాంకింగ్ ఉద్యోగుల సంఘం ప్రకటించింది. ఈ నెల 28న నాలుగో శనివారం, 29న ఆదివారం బ్యాంకులకు సాధారణ సెలవులు. ఉద్యోగులు సమ్మెతో ఈ 27 నుంచి 29 వరకు బ్యాంకులు పని చేయవు.

# 'ఐటీ'లో ప్రయాణాలు బంద్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డచ్ కంపెనీ డీఎస్ఎంలో ఉద్యోగికి కరోనా సోకినట్లు ఆ కంపెనీ ప్రకటించి.. ఉద్యోగులను ఇంటికి పంపించడంతో హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీలు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. శానిటైజేషన్ చర్యలను మరింత పటిష్ఠంగా అమలు చేయడంతో పాటు ప్రతి ఉద్యోగిని స్క్రీనింగ్ చేసి లోపలకు అనుమతిస్తున్నాయి. మరోవైపు క్లయింట్ల వద్దకు వెళ్లి ప్రాజెక్టులను పర్యవేక్షించే వారి విదేశీ ప్రయాణాలను వాయిదా వేస్తున్నాయి. కరోనా వైరస్ యూరప్, అమెరికా, భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తుండడంతో ఆయా దేశాలు విదేశీ ప్రయాణాలపై ట్రావెల్ అడ్వైజర్లను జారీ చేస్తున్నాయని, విదేశాల నుంచి భారత్‌కు వచ్చే క్లయింట్లు కూడా తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకుంటున్నారని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. కాగా అంతర్గతంగా నిర్వహించే అన్ని ఈవెంట్లను, ఫంక్షన్లను హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీలు రద్దు చేశాయి. ఇప్పటికే మార్చి 8న నిర్వహించే మహిళా దినోత్సవాన్ని కొన్ని కంపెనీలు రద్దు చేశాయి.

### ఉద్యోగులకు పెగా సిస్టమ్స్ లేఖ

అధిక రిస్క్ ఉన్న దేశాల నుంచి వచ్చిన ఉద్యోగులు రెండు వారాల పాటు ఇంటి వద్దే ఉండి అక్కడి నుంచి పని చేయాలని పెగా సిస్టమ్స్ ఉద్యోగులను కోరింది. కరోనా వైరస్ వ్యాప్తి కాకుండా ఉద్యోగులు తీసుకోవాల్సిన చర్యలు తదతరాలపై కంపెనీ ఎండీ సుమన్ రెడ్డి ఉద్యోగులకు లేఖ రాశారు. ముఖ్యం కానీ వ్యాపార ప్రయాణాలను నిలిపివేయాలని సూచించారు.

### కాగ్నిజెంట్ హైదరాబాద్ కార్యాలయం మూత!

హైదరాబాద్‌లోని కార్యాలయాన్ని తాత్కాలికంగా మూసివేసి ఇంటి నుంచి పని చేయాలని ఉద్యోగులను కాగ్నిజెంట్ కోరినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని రహేజా మైండ్‌స్పేస్ పార్కులో కాగ్నిజెంట్ కార్యాలయం ఉంది. ఈ మేరకు ఉద్యోగులకు ఈ-మెయిల్ పంపినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.



కరోనా ప్రపంచవ్యాప్తంగా విస్తరించడంతో ఐటీ కంపెనీలు తమ ఉద్యోగుల ప్రయాణాలను నిలిపివేసున్నాయి. ఈ ప్రభావం ఐటీ కంపెనీలపై పడుతుంది. గత పది రోజుల్లో భారత్ రావాలనుకున్న ఖాతాదారులందరూ తమ ప్రయాణాలను రద్దు చేసుకున్నారు. కరోనా ప్రభావం ఎంత తొందరగా తగ్గితే పరిశ్రమకు అంత మంచిది. ఎండాకాలం వచ్చేసింది. ఇప్పటికే ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఇది భారత్‌కు అనుకూల పరిస్థితి. త్వరగా కరోనా ప్రభావం తగ్గుతుందని భావిస్తున్నాం.
- వీ రాజన్న, టీసీఎస్ ప్రాంతీయ అధిపతి

*మొబైల్ రిటైల్ చెయిన్ సెలెక్ట్‌లో సామ్‌సంగ్ ఎస్20 సిరీస్ మొబైల్స్‌ను సంస్థ బ్రాండ్ అంబాసిడర్, టాలీవుడ్ హీరో జూనియర్ ఎన్‌టీఆర్ విడుదల చేశారు. చిత్రంలో సెలెక్ట్ సీఎండీ వై గురు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళి రేతినేని, సామ్‌సంగ్ ప్రతినిధి బాలాజీ ఉన్నారు. తెలంగాణ, ఏపీ, మహారాష్ట్రల్లోని స్టోర్లలో ఈ ఫోన్లు అందుబాటులో ఉంటాయని సెలెక్ట్ సీఎండీ వై గురు తెలిపారు.*




## నిరోధ స్థాయిలు 11310, 11350

**టెక్ వ్యూ**

నిఫ్టీ మరింత అప్‌ట్రెండ్‌లో ప్రారంభమై 11400 వరకు వెళ్లి 140 పాయింట్ల ఇంట్రాడే లాభం నమోదు చేసింది. కాని రెండో సెషన్‌లో నిలదొక్కుకోలేక బలమైన రియాక్షన్‌లో పడింది. చివరికి 18 పాయింట్ల స్వల్ప లాభానికే సరిపెట్టుకుంది. స్పష్టమైన దిశ కోసం ఇప్పుడు బలంగా క్లోజ్ కావడం తప్పనిసరి. మార్కెట్ డే కనిష్ఠ స్థాయిలోనే ముగిసినా గత కొద్ది రోజులుగా మద్దతు స్థాయిల కన్నా పైనే ఉండడం ట్రెండ్‌లో సానుకూలతను సూచిస్తోంది.

**శుక్రవారం స్థాయిలివే...**

**నిరోధం : 11310 మద్దతు : 11230**

◆ రికవరీని కొనసాగిస్తే మైనర్ ఇంట్రాడే నిరోధం 11310 కన్నా పైన నిలదొక్కుకోవాలి. అప్పుడే మరింత సానుకూల ధోరణికి ఆస్కారం ఉంటుంది. ప్రధాన నిరోధం 11350. ఆ పైన బలంగా క్లోజయినప్పుడే మరింత అప్‌ట్రెండ్‌లో ప్రవేశిస్తుంది.

◆ మైనర్ మద్దతు స్థాయి 11230 కన్నా దిగజారితే మరింత బలహీనత ప్రదర్శిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 11000.

■ వి.సుందర్ రాజా

## ప్రారంభ సెషన్ మెరుగు

**ఆస్ట్రో వ్యూ**

**తిథి** : ఫాల్గుణ శుక్ల ఏకాదశి/ద్వాదశి **నక్షత్రం** : పునర్వసు/పుష్యమి

**అప్రమత్తం** : అశ్విని, మఖ, మూల/భరణి, పుబ్బ, పూర్వాషాఢ నక్షత్ర జాతకులు, సింహ, ధనుస్సు రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 10.37**

**ధోరణి:** నిఫ్టీ ఫ్యూచర్స్ 10.35 వరకు మెరుగ్గాను, ఆ తర్వాత చివరి వరకు నిస్తేజంగాను ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం** : నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 10.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 11 గంటల సమయానికి ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని 3 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవచ్చు.

**నిరోధం : 11310, 11350**

**మద్దతు స్థాయిలు : 11230, 11190**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక** : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

# సీఐఐ తెలంగాణ చైర్మన్‌గా కృష్ణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తెలంగాణ చాప్టర్ కొత్త చైర్మన్‌గా సైయెంట్ ఎండీ కృష్ణ బోదనపు ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన చాప్టర్ వార్షిక సదస్సులో ఈయనను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, ఎనర్జీ విభాగం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐఐ 125 ఏళ్ల లోగోను ఆవిష్కరించారు. ప్రస్తుత సీఐఐ తెలంగాణ చైర్మన్ డీ రాజు సేవలను జయేశ్ రంజన్ ప్రశంసించారు. ఐపీఆర్, ఎంఎస్ఎంఈ కనెక్ట్ మొదలైన కార్యక్రమాలను చేపట్టారని, సీఐఐతో కలిసి తెలంగాణ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. తెలంగాణలో ప్రతి ఏడాది విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని, ఈ ఏడాది కూడా 10 శాతం పెరిగిందని చెప్పారు. మూడేళ్లలో 22 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి స్థాయిని చేరుకుంటామని అజయ్ మిశ్రా తెలిపారు.







## అమరావతిపై తీర్మానం చేసినా..
# కేంద్రం వినాలని లేదు

- మా రాష్ట్ర పార్టీ కోరినవన్నీ చేయాలని లేదు
- రాజధాని అంశం రాష్ట్ర పరిధిలోదే!: జీవీఎల్

న్యూఢిల్లీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అమరావతిని రాజధానిగా కొనసాగించాలని బీజేపీ రాష్ట్ర శాఖ తీర్మానించింది నిజమేనని, అయితే కేంద్రం దానిని వినాలని లేదని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు స్పష్టం చేశారు. పీపీఏ రద్దుపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపట్టినప్పటికీ, కేంద్రం రాష్ట్రంపై చర్యలు తీసుకోగలిగిందా అని ప్రశ్నించారు. సహచర బీజేపీ ఎంపీ సుజనాచౌదరి విలేకరుల సమావేశంలో మాట్లాడిన 2-3 గంటలకే గురువారం రాత్రి జీవీఎల్ హడావుడిగా మీడియాతో మాట్లాడారు. తమ రాష్ట్ర పార్టీ కోరిన అన్ని అంశాలనూ కేంద్ర ప్రభుత్వం అమలుచేయాలని లేదని చెప్పారు. పార్టీపరంగా అనేక రాష్ట్ర ప్రభుత్వాలను బర్తరఫ్ చేయాలని కోరుతుంటామని.. కానీ కేంద్రం అలా చేయదని తెలిపారు. రాష్ట్ర రాజధాని ఏర్పాటు అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిదేనని పునరుద్ఘాటించారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి సైతం వేసవి రాజధానిని ప్రకటించడం దీనికి నిదర్శనమన్నారు. అమరావతి గురించి గానీ, రాజకీయాల గురించి గానీ బీజేపీ అధిష్ఠానం అనుమతితోనే తాను ప్రతి విషయం మాట్లాడతానని స్పష్టీకరించారు. రాజధాని విషయంలో పార్టీ నాయకులు, కేంద్ర ప్రభుత్వంతో చర్చించాకే చెబుతుంటానన్నారు. రాజధాని విషయంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో స్పష్టంగా చెప్పిందని, నిర్ణయాధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని పేర్కొందని తెలిపారు. రాజ్యాంగాన్ని మార్చి కేంద్రం తప్పుడు నిర్ణయాలు తీసుకోదన్నారు. ఎవరైనా కేంద్రం చేతిలో అధికారం ఉందని అమరావతి విషయంలో తప్పుడు హామీలు ఇచ్చినా, వ్యాఖ్యలు చేసినా.. అవన్నీ వారి వ్యక్తిగత అభిప్రాయాలుగానే పరిగణించాలని స్పష్టంచేశారు. ఇటీవల విజయవాడలో నగర ప్రముఖులు, మేధావులతో ఆ ప్రాంత సమస్యలపై సమావేశం జరిగిందని, కొందరు జేఏసీ ప్రతినిధులు కూడా పాల్గొన్నారని, వారు రాజధానిపై ఉన్న అనిశ్చిత పరిస్థితిని ప్రస్తావించారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మన పార్లమెంటరీ వ్యవస్థలో పరిమితులు ఉంటాయని వారికి చెప్పానన్నారు. రాజధాని ఏర్పాటు విషయం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిదని కేంద్రం పార్లమెంటులో టీడీపీ ఎంపీ కేశినేని నాని అడిగిన ప్రశ్నకు కేంద్రం స్పష్టమైన సమాధానమిచ్చిందని తెలిపానని చెప్పారు. సీఆర్‌డీఏతో చేసుకున్న ఒప్పందం మేరకు రైతులు భూములు ఇచ్చారు గనుక కచ్చితంగా వారికి న్యాయం జరుగుతుందని చెప్పానన్నారు. ఆ ప్రాంతంలో అభివృద్ధికి ప్రభుత్వం ఏయే నిర్ణయాలు తీసుకుంటుందో, ఏయే మౌలిక సదుపాయాలు కల్పించనుందో వివరంగా చెప్పానని తెలిపారు.

### నాపై ఫేక్‌న్యూస్..

తనను కించపరిచే విధంగా ఒక చానల్ ఫేక్‌న్యూస్ నడుపుతోందని జీవీఎల్ ఆరోపించారు. ఆ చానల్ పేరు చెప్పనని.. మరోసారి ఇలాంటి అవాస్తవ వార్తలు ప్రచారం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మళ్లీ తనపై కట్టుకథలు అల్లితే సమాచార ప్రసారశాఖకు ఫిర్యాదు చేస్తానని సదరు చానల్‌ను హెచ్చరించారు.





మా త్యాగాలను

మందడంలో చేతులకు సంకెళ్లతో మహిళల నిరసన, ఎర్రబాలెంలో పురుగు మందు డబ్బాలతో..

# వృథా చేస్తారా?

- రాజధానికే.. భూములిచ్చాం
- వేరేవారిని అడుగు పెట్టనివ్వం
- అమరావతిలో రైతుల గర్జన
- రాయపూడిలో వైదిక యాగం

గుంటూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): "ఏదో విధంగా మాలో చిచ్చు పెట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అమరావతి కోసం మేం చేసిన త్యాగాలను వృథా చేస్తోంది. రాజధానిని అటకెక్కించి, మేం త్యాగం చేసిన భూములను పేదలకు పంచుతామని చెబుతోంది. మా భూముల్లోకి వేరేవారిని అడుగుపెట్టనివ్వం" అని రైతులు నినదించారు. రాజధానిగా అమరావతినే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన ఆందోళనలు గురువారం 79వ రోజూ కొనసాగాయి. రాజధానిగా అమరావతినే కొనసాగించాలని.. సీఎం జగన్ మనసు మారాలని కాంక్షిస్తూ రాయపూడి రైతులు మైనార్టీల మహిళలతో కలిసి వైదిక రాష్ట్రీయ యాగం నిర్వహించారు. పెదపరిమిలో హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. మహిళలు తమ రెండు చేతులను పచ్చకండువాలతో కట్టేసుకుని నిరసన వ్యక్తం చేశారు. తుళ్లూరు దీక్షా శిబిరంలో మహిళలు కబడ్డీ ఆడి నిరసన వ్యక్తం చేశారు. 'జై అమరావతి' అంటూ కూతపెట్టారు. మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో భారీ వాహనశ్రేణితో అంగలకుదురు నుంచి 300మందికి పైగా రైతులు, మహిళలు వచ్చి మద్దతు తెలిపి, రూ.3లక్షల విలువైన నిత్యావసరాలు ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే ముమ్మిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 200మంది రైతులు వచ్చి మద్దతు తెలిపారు. మాజీమంత్రి పీతల సుజాత రాజధాని గ్రామాల్లో పర్యటించారు. ఎన్నారై ఆలపాటి రవీంద్ర రైతులకు మద్దతు తెలిపారు. దెందులూరు నియోజకవర్గం జనసేన నేత లక్ష్మణ్ 12గంటల నిరాహార దీక్ష చేశారు.

### ఫలించిన రైతుల ఆందోళన!

మంగళగిరి(క్రైమ్): రైతుల ఆందోళన ఫలించింది. పేదల ఇళ్లస్థలాల కోసం మంగళగిరి మండలం నిడమర్రు, ఎర్రబాలెం, కృష్ణాయపాలెం గ్రామాల్లోని పంటభూములు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 3న సీఆర్‌డీఏ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసులు తన సిబ్బందితో నిడమర్రులో పొలాలను చదును చేసేందుకు రాగా రైతులు అడ్డుకున్నారు. 4న సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాశ్, సీఆర్‌డీఏ కమిషనర్ లక్ష్మీనరసింహం పోలీస్ బందోబస్తుతో పనులు ప్రారంభించారు. ఎర్రబాలెంలోని భూములు కూడా చదును చేసేందుకు అధికారులు వస్తున్నారనే సమాచారంతో రైతులు, జేఏసీ నేతలు ఆకుల ఉమామహేశ్వరరావు, వెలిమిచర్ల శివన్నారాయణ ఆధ్వర్యంలో పొలాల వద్ద ఆందోళనకు దిగారు. పురుగుమందు డబ్బాలు పట్టుకుని.. అధికారులు తమ మాట వినకపోతే.. తమకు ఆత్మహత్యే శరణ్యమని నినాదాలు చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న సీఆర్‌డీఏ అధికారులు ఆఫీస్‌కే పరిమితమయ్యారు.



తుళ్లూరులో యాగం చేస్తున్న రైతులు



అమరావతిపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుజనా

# మార్చడం కుదరదు

## నిర్ణయాధికారం ఉందని రాజధానిని మార్చేస్తారా?

## అమరావతి రైతులకు అన్యాయం జరగనివ్వం

**రాజధానికి భూములివ్వడమే వారి తప్పా?.. రాజ్యాంగం, కోర్టులే కాపాడతాయి**

**జగన్ సర్కారుకు వైరస్ సోకింది: సుజనా... అమరావతిపై 2పుస్తకాల ఆవిష్కరణ**

న్యూఢిల్లీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర రాజధానిని నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిదే. అలాగని ప్రభుత్వం మారినప్పుడల్లా రాజధాని మార్చడం కుదరదంటే కుదరదు' అని బీజేపీ ఎంపీ సుజనాచౌదరి స్పష్టం చేశారు. రాజధానిని నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిదేనని కేంద్రం చెప్పిందంటే దానర్థం ఇప్పటికే స్థాపించిన అమరావతిని మార్చుకోవచ్చని కాదన్నారు. అమరావతి కోసం రైతులు చేస్తున్న న్యాయపోరాటంపై సూర్యనారాయణ మాస్టారు "అమరావతి ఆక్రందన' శీర్షికతో రచించిన తెలుగు పుస్తకాన్ని, 'స్టాప్ ది అన్‌డూయింగ్ ఆఫ్ అమరావతి' అనే శీర్షికతో రచించిన పుస్తకాన్ని సుజనా తన అధికార నివాసంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 'ప్రజలు అత్యధిక మెజారిటీతో అధికారమిచ్చారని రాజధానిని తమ రాజకీయ స్వార్థం కోసం మార్చేస్తారా? అలాగైతే బ్రిటిష్‌వారిపై పోరాడి సాధించుకున్న భారతదేశాన్ని.. ఇప్పుడు తమకు అత్యధిక మెజారిటీ ఉందని కేంద్రం బ్రిటిష్‌వారికి మళ్లీ అప్పగించేస్తుందా' అని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వానికి వైరస్ సోకిందని.. అందుకే అక్కడ వింతపాలన సాగుతోందని ఎద్దేవాచేశారు. 'అభివృద్ధిని పూర్తిగా పక్కనపెట్టి కక్ష సాధింపులతోనే గడుపుతోంది. 9నెలల్లో తట్ట మట్టి తీయలేదు. ఒక్క ఇటుక పెట్టలేదు. ఒక్క పరిశ్రమా రాలేదు. సమీక్షతో పెట్టుబడిదారులంతా వెయ్యి కిలోమీటర్ల వేగంతో పరుగు పెడుతున్నారు. ఏపీ అంటేనే పెట్టుబడులు రావడంలేదు' అని నిప్పులు చెరిగారు.

### భూముల దుర్వినియోగం..

రైతులు అమరావతి కోసం ఇచ్చిన భూములను దుర్వినియోగం చేసే హక్కు ప్రభుత్వానికి లేదని సుజనా స్పష్టంచేశారు. రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం జరగదని సుజనా బదులిచ్చారు. 'రాజ్యాంగం ఉంది. కోర్టులు ఉన్నాయి. వారికి కచ్చితంగా న్యాయమే జరుగుతుంది. కేంద్రం తగిన సమయంలో తగిన విధంగా స్పందిస్తుంది' అని చెప్పారు.

### ఎల్లయ్యో పుల్లయ్యో చెబితే స్పందించం

అమరావతికి బీజేపీ కట్టుబడి ఉన్నదని ఆ పార్టీ రాష్ట్రశాఖ తీర్మానించిందని, మరోపక్క బీజేపీ జాతీయ స్థాయి నేతలు కొందరు అందుకు భిన్నంగా మాట్లాడుతున్నారని.. బీజేపీ, కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ వైఖరిపట్ల రైతుల్లో అనుమానాలు చెలరేగుతున్నాయని ప్రస్తావించగా.. కొందరు నేతల వ్యక్తిగత అభిప్రాయాలను పార్టీపై రుద్దనవసరంలేదని సుజనా అన్నారు. ఏ ఎల్లయ్యో, పుల్లయ్యో చెప్పేవాటికి స్పందించనక్కర్లేదని చెప్పారు. అమరావతి విషయంలో బీజేపీ తొలి నుంచీ ఒకే వైఖరితో ఉందని.. కచ్చితంగా కాపాడుకుని తీరతామని స్పష్టం చేశారు.

### ప్రాంతాల మధ్య చిచ్చు..

వైసీపీని 151 సీట్ల అత్యధిక మెజారిటీతో ప్రజలు గెలిపిస్తే.. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల బాగోగులు, అభివృద్ధిని పక్కనపెట్టి మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చు రేపడం ఎంతవరకు సమంజసమని సుజనా ప్రశ్నించారు. 'అమరావతి రాజధానిని కొనసాగించాలంటూ ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళన చేస్తున్న మహిళలను సైతం బూటుకాళ్లతో పోలీసులు తన్ని, దాడులు చేస్తున్నారు. భయభ్రాంతులను చేస్తున్నారు. రాజధాని కోసం రైతులు వేల ఎకరాల భూమిని ఇవ్వడమే తప్పా? 3నెలల్లో 52 మంది రైతులు చనిపోయినా సీఎం పట్టించుకోరా? వెనుకబడిన, కరవుపీడిత ప్రాంతంగా ఉన్న రాయలసీమ, వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధిపై దృష్టిపెట్టకుండా పరిపాలనా వికేంద్రీకరణ పేరుతో రాజకీయ కక్ష సాధించే దిశగా పాలిస్తున్నారు' అని ధ్వజమెత్తారు.

## పేదల ఆక్రందనలు పట్టని ఉన్మాది జగన్

**రైతులు ప్రాణాలకు తెగించడం కలచివేస్తోంది.. చంద్రబాబు ట్వీట్**

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాల పేరుతో వైసీపీ ప్రభుత్వం అసైన్డ్ భూములను లాక్కోవడంపై టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ట్విటర్‌లో స్పందించిన చంద్రబాబు... అమరావతి ఉద్యమానికి సంఘీభావంగా పశ్చిమగోదావరి జిల్లా గోపాలపురం నుంచి వచ్చిన రైతులతోనూ ఆయన మాట్లాడారు. "కలెక్టరేట్‌లో, తహసీల్దార్ కార్యాలయంలో, స్పందన కార్యక్రమంలో, పంట పొలాల్లో.. ఇలా ప్రతి చోట పురుగు మందుల డబ్బాలు చేతపట్టుకుని, మా భూమి జోలికొస్తే చచ్చిపోతాం" అంటోన్న రైతులు, పేదల ఆక్రందనలు మనసును కలచివేస్తున్నాయని మాజీ సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే రోజు మూడు జిల్లాల్లో జరిగిన దుర్ఘటనలు తనను తీవ్రంగా కలిచివేశాయని ఆయన గురువారం ట్వీట్ చేశారు. భవిష్యత్‌తరాల కోసం రాజధానికి భూమినిచ్చి రైతులు త్యాగాలు చేస్తే వారిని ఇబ్బంది పెడుతూ జగన్ ఉన్మాదిలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు.

### తెలుగు మహిళల సేవలు ప్రశంసనీయం

టీడీపీ అనుబంధమైన తెలుగు మహిళావిభాగం విద్యార్థుల సంక్షేమానికి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని చంద్రబాబు కొనియాడారు. పరీక్షల సమయంలో ఇంటర్ విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు, ఎగ్జామ్ కిట్లు, మాస్కులు పంపిణీ చేయడాన్ని తెలుగు మహిళా విభాగం నేతలు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా, వారిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆచంట సునీత,స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

### రాజ్యాంగ వ్యవస్థలు పట్టని జగన్: వర్ల

మంగళగిరి, మార్చి 5: "ప్రజాస్వామ్యం, రాజ్యాగ వ్యవస్థల పట్ల సీఎం జగన్‌కు ఏమాత్రం గౌరవం లేనట్లుంది. బుధవారం మంత్రిమండలి సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలే దానికి తార్కాణం. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి తీరాలని, గెలిస్తేనే మంత్రులకు పదవులు, ఎమ్మెల్యేలకు టిక్కెట్లు అని సీఎం జగన్ బెదిరింపు ధోరణితో వ్యవహరించడం సరికాదు. కేబినెట్‌లో సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలను కోర్టులు సుమోటోగా స్వీకరించాలి" అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం ఐదుగురు రెడ్లకు బాధ్యతలు అప్పగించారని, తనవారిపై ఉన్న నమ్మకాన్ని ఇతరులపై ఎందుకు పెట్టడంలేదని ప్రశ్నించారు.

## చాక్లెట్లిచ్చి నెక్లెస్‌లు కొట్టేస్తున్నారు

- భయభ్రాంతులను చేసేందుకే వింత ఆర్డినెన్స్‌లు: కన్నా

గుంటూరు(సంగడిగుంట), మార్చి 5: "రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పేరుతో ప్రజలకు చాక్లెట్‌లు పంచుతూ నెక్లెస్‌లు కొట్టేస్తోంది. గత ప్రభుత్వం చేసిన అక్రమాలకు ఈ ప్రభుత్వంలో ఫ్యాక్షనిజం తోడైంది. నకిలీ బ్రాండ్‌లతో మద్యం అంటకడుతూ కొత్తరకం దోపిడీకి తెర తీశారు. వైసీపీ కార్యకర్తలు విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు" అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. గుంటూరులో గురువారం బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో కన్నా మాట్లాడారు. జనసేనతో కలిసి అన్ని స్థానాలకు పోటీ చేస్తామన్నారు. మహిళా మోర్చ జాతీయ నేత పురందేశ్వరి నేతృత్వంలో ఎన్నికల కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. భయ భ్రాంతులకు గురి చేసి ఎన్నికల్లో గెలిచేందుకు వైసీపీ వింత వింత ఆర్డినెన్స్‌లు తెస్తుందన్నారు. ఆ విష పూరిత జీవోలతో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

## భూలక్ష్మిది జగన్ సర్కార్ చేసిన హత్య: అనిత

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): "పేదల భూమిని పంచే పెద్దలు జగన్మోహన్‌రెడ్డి. భూలక్ష్మి భూమిని లాక్కున్నారు. భూమే లేని లోకం ఎందుకని భూలక్ష్మి బలవన్మరణానికి పాల్పడింది. ఆమె సమాధిపై 'జగనన్న- వైఎస్సార్' ఇళ్ల కాలనీకి పునాది వేయండి. జగన్ సర్కారు దౌర్జన్యాన్ని ఎదిరించి ఓడిపోయి.. ఆత్మహత్యకు పాల్పడింది. ఇది ఆత్మహత్య కానే కాదు. ముమ్మాటికీ జగన్ తన పేరు కోసం చేసిన హత్య" అని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ట్వీట్ చేశారు. 'జగన్ చీటెడ్ బీసీస్', 'యాంటీ బీసీ జగన్' హ్యాష్ ట్యాగ్స్‌ని తన ట్వీట్‌కు జత చేశారు.

# పేదలకు జాగా పెద్ద దగా!

**పాతిక లక్షలమందికి ఇవ్వడానికి ప్రభుత్వం కొన్నదెంత?**

- స్థానిక ఎన్నికల కోసమే హడావుడి:టీడీపీ ఫైర్



అమరావతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పేదలకు పాతిక లక్షల ఇళ్ల స్థలాల పంపిణీ పేరుతో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న ప్రచారం పెద్ద దగా అని తెలుగుదేశం పార్టీ ఆరోపించింది. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే అధికార పార్టీ నేతలు స్థలాల హడావుడి మొదలు పెట్టారని విమర్శించింది. గురువారం మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆ పార్టీ అధికార ప్రతినిధి బొండా ఉమామహేశ్వరరావు విలేకరులతో మాట్లాడారు. "పాతిక లక్షల మంది పేదలకు ఒక సెంటు చొప్పున కొత్తగా ఇంటి స్థలం ఇవ్వాలంటే పాతిక వేల ఎకరాల భూమి కావాలి. అందులో రోడ్లు వంటి ఇతర మౌలిక వసతుల కల్పనకు మరో ఇరవై వేల ఎకరాలు అవసరం. అంటే మొత్తం 45 వేల ఎకరాలు! దీనికోసం ప్రభుత్వం ఎక్కడెక్కడ ఎంత భూమి కొనుగోలు చేసింది? నిజానికి, ఈ పది నెలల్లో సెంటు భూమి కూడా కొన్నదే లేదు" అని ఆయన మండిపడ్డారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 14.50 లక్షల కుటుంబాలకు పక్కా ఇళ్ల నిర్మాణం చేపట్టామని, మరో ఐదు లక్షల మందికి స్థలాలు ఇచ్చామని... వాటిని కూడా కలిపే ఇప్పుడు పాతిక లక్షల లెక్కను ప్రభుత్వం చెబుతోందన్నారు. తాము నాడు చేపట్టిన ఇళ్లలో ఐదేళ్లలో 8 లక్షలు పూర్తి చేశామని, ధనికులు ఉండే కాలనీల మాదిరిగా అన్ని వసతులతో వాటిని నిర్మించి పేదవాడు కూడా ఆత్మ గౌరవంతో ఉండేలా చేశామని చెప్పారు. తన వాదనకు సాక్ష్యంగా ఆయన పలు జిల్లాల్లో నిర్మాణం చేసిన పక్కా గృహాల కాలనీల వీడియోలను, ఫొటోలను ఈ సమావేశంలో ప్రదర్శించారు. పేదలకు కొత్తగా ఇంటి స్థలాలు ఇవ్వాలంటే భూమి కొనుగోలు చేయాలని, ఆ పని చేయకుండా తరతరాలుగా పేదల స్వాధీనంలో ఉన్న భూములను దౌర్జన్యంగా ప్రభుత్వం లాక్కొని పంచిపెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. మొత్తం రెవెన్యూ యంత్రాంగం అంతా ఊళ్ల మీద పడి అసైన్డ్ భూముల కోసం వెతుకుతోంది. ఏవీ దొరక్క చివరకు శ్మశానాల్లో, కొండల్లో, చెరువుల్లో ఇళ్ల స్థలాలు ఇస్తున్నారు. అక్కడకు పోవడానికి దారి కూడా లేదు. ఇంకా పాతికేళ్లయినా అక్కడ పేదలు నివసించే పరిస్థితి లేదు' అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేసులు పెడతారని మాట్లాడకుండా ఉండలేమని, కేసులు పెడుతున్న డీజీపీ..కోర్టు చుట్టూ తిరుగుతున్నారని కూడా గుర్తుంచుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు. కేసులు ఎలా ఎదుర్కోవాలో తమకు తెలుసునని, చట్టం ఒక్క జగన్ కోసమే లేదన్నారు.

### పిచ్చి మద్యంపై మాట్లాడితే ఉలుకెందుకో..

మద్యం షాపుల్లో పిచ్చి మద్యం విక్రయాల గురించి చెబితే ప్రభుత్వం ఉలిక్కిపడి రకరకాల విమర్శలు చేస్తోందని టీడీపీ అధికార ప్రతినిధి బొండా ఉమా మహేశ్వరరావు అన్నారు. "పిచ్చి మద్యం బ్రాండ్లను నేను చూపిస్తే అదేదో మహాపరాధం మాదిరిగా మాట్లాడుతున్నారు. వైసీపీ మిత్రపక్షం టీఆర్ఎస్ ప్రభుత్వానికి చెందిన ఎక్సయిజ్ మంత్రి తెలంగాణ సచివాలయంలో మద్యం బ్రాండ్లు అన్నీ ప్రదర్శించి మరీ మాట్లాడారు. 'వైఎస్ జగన్ మిస్టిక్' పేరుతో కూడా ఒక చీప్ లిక్కర్ అమ్ముతున్నారట! ఇక్కడ అమ్ముతున్న బ్రాండ్లు దేశంలో మరే రాష్ట్రంలో అయినా కనిపిస్తున్నాయా?జే ట్యాక్స్ నిజం కాదా? పిచ్చి బ్రాండ్లు నిజం కాదా? ఎనిమిదింటికి మద్యం షాపులు మూతపడగానే వలంటీర్లు డోర్ డెలివరీ చేయడం నిజంకాదా? వైసీపీ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం వ్యాపారం చేస్తుండటం నిజం కాదా? రూ. 50 మద్యం రూ.150 అయింది. ఆ వంద ఎవరి జేబుల్లోకి వెళ్తోంద"ని ప్రశ్నించారు.

# అసైన్డ్ అంటేే అలుసా!?

(మొదటి పేజీ తరువాయి)

నిలిచిన భూమి రాత్రికి రాత్రి మాయమవుతుందని తెలిసి పేదల గుండెపగిలిపోతోంది. అక్కడా, ఇక్కడా అని కాదు! రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి. ఉగాది నాటికి 25 లక్షల పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల అమలుకు... రెవెన్యూ అధికారులు స్థలాల వేట ప్రారంభించారు. అసైన్డ్, గ్రామకంఠం, పోరంబోకు భూములను సాగుచేసుకుంటున్న దళిత, గిరిజన, బడుగు రైతులే వీరికి అలుసవుతున్నారు.

### ఆ భూములపైనే కన్ను

ఇంటి స్థలాల కోసం ప్రభుత్వ భూములతో పాటు భారీగా ప్రైవేటు భూములను సేకరించాలని తొలుత నిర్ణయించారు. 26 వేల ఎకరాల ప్రైవేటు భూమిని సేకరించాలని, ఇందుకోసం రూ. 14 వేలకోట్లు అవసరమని అంచనా వేశారు. భూసేకరణకు అన్ని వేల కోట్లా... అని ఆర్థిక శాఖ చేతులెత్తేసింది. ఆర్థిక భారం పడకుండా స్థలాలు సేకరించాలని సర్కారు సూచించింది. అంతే, ప్లాన్ మారింది. భూసేకరణ మార్గదర్శకాల్లో పేర్కొన్న రెండు అంశాలనే పేదలపైకి అస్త్రంగా ప్రయోగిస్తున్నారు. అవి... గతంలో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను వెనక్కు తీసుకొని ఇంటి స్థలాలకు పంపిణీ చేయొచ్చు. గతంలో ఇంటి స్థలాలు తీసుకొని నిర్మాణాలు చేయకుంటే, వాటిని కూడా స్వాధీనం చేసుకోవచ్చు. అసైన్డ్ సాగు భూములను వెనక్కు తీసుకుంటే పరిహారం ఇవ్వాలని చెప్పారు. అసైన్డ్ ఇంటి స్థలాన్ని తీసుకుంటే రూపాయి కూడా ఇచ్చేది లేదని తేల్చారు. భూ యజమానుల పరిస్థితి, వారి భవిష్యత్తుతో నిమిత్తం లేకుండా భూములు లాక్కుంటున్నారు.

### దయా దాక్షిణ్యమేనా...

'మీపై దయతలచి ఇచ్చిన భూములు. ఇన్నాళ్లు తిన్నది చాలు. ఇక ఇచ్చేయండి' అన్నట్లుగా అసైన్డ్ భూములపై రెవెన్యూ జులుం ప్రదర్శిస్తున్నారు. అసైన్డ్ భూములను కూడా అర్హులైన పేదలకే ఇస్తారు. దళిత, గిరిజన, బడుగువర్గాల జీవనోపాధి కోసం కేటాయిస్తారు. ఆ భూములను లబ్ధిదారులు, వారి వారసులు అనుభవించవచ్చు. కానీ, యాజమాన్య హక్కులు మాత్రం ఉండవు. అంతమాత్రాన... వాటిపై ప్రభుత్వానికి అన్ని హక్కులు ఉన్నట్లు కాదు. వాటిని ఎడాపెడా స్వాధీనం చేసుకోవడం కుదరదు. విస్తృత ప్రజా ప్రయోజనాల నిమిత్తం చేపట్టే ప్రాజెక్టులు... అంటే జలాశయాలు, రహదారుల నిర్మాణం కోసం అవసరాన్ని బట్టి మాత్రమే సేకరించవచ్చు. సేకరించే స్థలాలకు పరిహారం ఎంత ఇస్తారు, ప్రత్యామ్నాయం ఏమిటో కూడా చెప్పడంలేదు. అడిగినప్పుడు ఇస్తే పరిహారం వస్తుందని, బలవంతంగా తీసుకుంటే దమ్మిడీ కూడా రాదని బెదిరింపులకు దిగుతున్న సంఘటనలూ వెలుగులోకి వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో పంటలను తొలగించి మరీ రాత్రికిరాత్రి భూమిని చదును చేస్తున్నారు.

### ఆత్మహత్యాయత్నాలు...
### ఆగుతున్న గుండెలు

తూర్పు గోదావరి జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన నిరుపేద రైతు సత్వాడ బాలరాజును... అడిగినప్పుడు భూమి ఇవ్వకుంటే పరిహారం దక్కదని అధికారులు హెచ్చరించారు. ఆయన అదే రోజు రాత్రి గుండె ఆగి మరణించారు. ఈ ఘటన తర్వాతైనా ప్రభుత్వం తమ జోలికిరాదని పేద రైతులు భావించారు. కానీ, ఆ తర్వాత అసైన్డ్ భూముల సేకరణ వేగం మరింత పెరిగింది. అంతేకాదు, గ్రామ కంఠం, చెరువుల సమీపంలోని వాగు, పోరంబోకు భూములనూ సేకరణ పరిధిలోకి తీసుకొచ్చారు.

- ✔ కర్నూలు జిల్లా పాములపాడు మండలం ఎర్రగూడూరుకు చెందిన భూలక్ష్మికి రెండెకరాల భూమి ఉంది. భూసేకరణకు వ్యతిరేకంగా న్యాయం కోరుతూ ఇప్పటికే కోర్టును ఆశ్రయించారు. అయినా, ఆ భూమిని ఇంటి స్థలాలకోసం తీసుకునే ప్రయత్నం చేయడంతో పురుగుల మందు తాగి చనిపోయింది.
- ✔ విశాఖ జిల్లా మునగపాక మండలంలో రైతు వెంకట విష్ణుమూర్తి అనుభవంలో ఉన్న గ్రామకంఠం భూమితోపాటు 12 సెంట్ల స్థలాన్ని కాపాడుకోవడం కోసం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు.
- ✔ ప్రకాశం జిల్లా చిన్న కందుకూరుకు చెందిన మాణిక్యమ్మ 1.11 ఎకరాల భూమిని సాగుచేసుకుంటున్నారు. స్థలాలకోసం ఆ భూమిని తీసుకునేందుకు ఇప్పటికే పంటను దున్నించారు. దీంతో ఆమె చావనైనా చస్తాను కాని భూమిని వదులుకోనంటూ పురుగుల మందు డబ్బా చేతపట్టుకొని పోరాటం చేస్తున్నారు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

### పేదలకోసం పేదలే బలి

పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు అసైన్డ్, గ్రామకంఠం భూములను ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించినప్పుడు రెవెన్యూ అధికారులు చిత్రమైన సమాధానం చెబుతున్నారు. "గతంలో ఓ పేదకు ఎకరం సాగు భూమి ఇస్తే ఒక్కరే అనుభవించారు. ఇప్పుడు ఆదే భూమిని 40 మంది పేదలకు ఇంటి స్థలాలుగా ఇస్తున్నాం. అందువల్ల ఎక్కువమందికి మేలు జరుగుతుంది కదా!" అని వాదిస్తున్నారు. అంతే తప్ప... తమ చర్య వల్ల ఎన్నో ఏళ్లుగా బువ్వ పెడుతున్న భూమిని పేదల నుంచి దూరం చేస్తున్నామని మాత్రం అంగీకరించడంలేదు.

"ఇప్పటిదాకా ప్రైవేటుగా భూములు సేకరించి ఇంటి స్థలాలు ఇచ్చాం. ఇప్పుడంతా రివర్స్‌లో నడుస్తోంది. పేదలకు ఇంటిస్థలం ఇవ్వాలంటే, మరో పేద సాగు భూమిని లాక్కోవడమే మార్గం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు" అని ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి ఆవేదన వ్యక్తం చేశారు.

## కాలేజీ భూమి ఇళ్ల స్థలాలకు..

**అడ్డుకోవాలంటూ హైకోర్టులో పిల్**

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా కోటవురట్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన భూమిని ఇళ్లస్థలాలకు ఇచ్చేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ప్రభుత్వం 1977లో గ్రామకంఠం భూమిని కళాశాలకు ఇచ్చిందని, ఆ భూమిలోని 5.49 ఎకరాలను ఇళ్లస్థలాలకు ఇచ్చేందుకు అధికారులు సిద్ధం చేశారని తెలిపారు. దీనిపై కాలేజీకి సమాచారం కూడా ఇవ్వలేదన్నారు. కళాశాల భూమిని ఇళ్ల స్థలాలకు కేటాయించకుండా అడ్డుకోవాలని కోరుతూ రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ పి.వెంకటసూర్యారావు పిటిషన్ దాఖలు చేశారు.

## బయటివాళ్లు ఉండొద్దనడం రాజ్యాంగ విరుద్ధం

**అభివృద్ధి కోసమే రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాలు.. హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వం**

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): 'రాజధాని ప్రాంతంలో బయటివాళ్లు నివసించరాదనడం రాజ్యాంగ విరుద్ధం. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ఇళ్ల స్థలాల పంపిణీకి దురుద్దేశాలు ఆపాదించడం సరికాదు' అని ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. రాజధాని పరిధిలో 1,251 ఎకరాల భూమిని పేదల ఇళ్ల స్థలాలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత నెల 25న జీవో 107ను జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లను విచారించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం.. వాటిపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి జె.శ్యామలారావు హైకోర్టుకు నివేదిక సమర్పించారు. రాజధాని అభివృద్ధి చెందాలంటే జనాభా ఉండాలని, ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వడం వల్ల ఈ ప్రాంతానికి జనాభా తరలివస్తారని అందులో పేర్కొన్నారు. ల్యాండ్‌పూలింగ్ ద్వారా సేకరించిన భూమిలో ఐదు శాతాన్ని పేదల ఇళ్ల స్థలాల కోసం కేటాయించవచ్చని సీఆర్‌డీఏ చట్టం చెబుతోందన్నారు. వెనుకబడిన వర్గాలకు అందుబాటులో లేనంతగా రాజధాని నిర్మాణం, అభివృద్ధి పనులు ఉండరాదన్నారు. రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలాల కోసం 1338 ఎకరాలు గుర్తించామని, దీనిలో 1251 ఎకరాలకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చామని తెలిపారు. రాజ్యాంగ నిబంధనల మేరకే ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, అందువల్ల జీవో 107కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను కొట్టివేయాలని అభ్యర్థించారు.

# ఇంజనీరింగ్ కాలేజీలకు ఫీజు ఫిక్స్!

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించారు. అయితే కొన్ని కాలేజీల విషయంలో పున:సమీక్ష చేయాల్సిన అవసరం ఉందని కమిషన్ సభ్యులు అభిప్రాయపడినట్టు తెలిసింది. ఆడిటర్ రిపోర్టును బట్టి చూస్తే పలు కాలేజీలకు ఫీజును గతంలో కంటే తగ్గించాల్సి ఉందన్న భావన ఈ సమావేశంలో వ్యక్తమయినట్టు చెబుతున్నారు. పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను దృష్టిలో ఉంచుకుని కాలేజీల పని తీరును బట్టి వాస్తవంగా ఎంతవస్తే అంతే సిఫారసు చేద్దామని పలువురు సభ్యులు అన్నట్లు సమాచారం. చివరకు శుక్రవారం మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుందామని కమిషన్ సభ్యులు అనుకొన్నారు. గురువారం నాటి కసరత్తు ప్రకారం, ఐదారు టాప్ కాలేజీలకు ఫీజు రూ.లక్షకు పైనే ఖరారు అయ్యే అవకాశం ఉంది. మిగిలిన కాలేజీల ఫీజును శుక్రవారం ఖరారు చేస్తారు. అదేరోజు కొత్త ఫీజుల జాబితాను ప్రభుత్వానికి అందజేయాలని కమిషన్ భావిస్తోంది. కాలేజీలను కేటగిరీలుగా చేయరాదని, వాస్తవికదృష్టితో రకరకాలుగా ఫీజులు ఉంటాయని తెలుస్తోంది.

ఇంజనీరింగ్ కాలేజీలకు ఫీజుల ఖరారులో విద్యాబోధన , సదుపాయాలు, ఫ్యాకల్టీ, ప్లేస్‌మెంట్లు, ఆదాయ, వ్యయాలు, ఏఐసీటీఈ నిబంధనల అమలు .. తదితర అంశాలను పరిగణనలోనికి తీసుకొంటారు. దీనికోసం ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ బృందాలు గత నవంబర్ 27 నుంచి ఇంజనీరింగ్ కాలేజీల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాయి. జనవరి నెలాఖరుకల్లా ఈ ప్రక్రియను పూర్తిచేశాయి. ఫిబ్రవరి 4 నుంచి కాలేజీలతో వ్యక్తిగత విచారణ మొదలుపెట్టి మార్చి 3తో ముగించాయి. కాలేజీలు సమర్పించిన ఫీజుల ప్రతిపాదనలు, తనిఖీల నివేదికలు, వ్యక్తిగత విచారణ అనంతరం..గురువారం కమి షన్ సమావేశమైంది. మొత్తం మీద చూస్తే .. ఇంజనీరింగ్ ట్యూషన్ ఫీజులు తగ్గించే అవకాశం ఉంది. గతంలో కంటే ఏరకంగా చూసినా పెరగవని స్వయంగా కమిషన్ ఛైర్మన్ జస్టిస్ వీ ఈశ్వరయ్య కూడా ఇప్పటికే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. కాగా, కన్వీనర్ కోటా ఫీజుకు దాదాపు డబుల్ ఫీజును కేటగిరీ-బి అడ్మిషన్లలో వసూలు చేసుకునేలా సిఫారసు చేయాలని కమిషన్ నిర్ణయించింది.

### మంచివి, పిచ్చివి ఒకే గాటనా..

ధరల పెరుగుదలను(ద్రవ్యోల్బణం) దృష్టిలో పెట్టుకుని ప్రతి మూడేళ్లకు ఒకసారి ఫీజులను సవరించాల్సి ఉండగా.. వాటిని తగ్గిస్తామని చెప్పడం కమిషన్‌కు తగదని పలు కాలేజీల మేనేజ్‌మెంట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తామని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఆర్థికభారం తగ్గించుకునే ఆలోచనతోనే ఫీజులు తగ్గిస్తున్నారని అంటున్నాయి. ఇలా అయితే ఇంజనీరింగ్‌లో నాణ్యమైన విద్య ఎలా అందించగలుగుతామని వాపోతున్నాయి. ప్రమాణాలు లేని కాలేజీలను, మంచి కాలేజీలను ఒకేగాటన కట్టడం మంచిది కాదని అంటున్నారు.

## ఆ రైల్లో సిబ్బంది అందరూ మహిళలే

విజయవాడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మొత్తం మహిళా సిబ్బందితో విజయవాడ నుంచి రైలు నడపాలని విజయవాడ రైల్వే డివిజన్ నిర్ణయించింది. విజయవాడ-గూడూరు మధ్య ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో ఈ విధానాన్ని త్వరలో ప్రవేశ పెట్టనున్నారు. పైలట్ నుంచి టీటీ, గార్డు, స్వీపింగ్ వరకూ అంతా మహిళలే పనిచేస్తారు.

## అంగన్‌వాడీల్లో 5వేల పోస్టులు ఖాళీ

న్యూఢిల్లీ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఐదు వేల అంగన్‌వాడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రాజ్యసభలో గురువారం వైసీపీ సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతిఇరానీ లిఖితపూర్వకంగా జవాబిచ్చారు. 2019 డిసెంబరు 31నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 1665 అంగన్‌వాడీ వర్కర్లు, 3347 హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

# ఇటలీపై కరోనా పంజా

**107 మంది మృతి.. 3 వేల మందికి వైరస్.. ఇరాన్‌లోనూ 107కి చేరిన మృతులు**

**చైనాలో 3వేలు దాటిన మరణాలు.. స్విట్జర్లాండ్‌లో తొలి కరోనా మృతి**



రోమ్, మార్చి 5: కరోనా ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోంది. 80కి పైగా దేశాలకు పాకింది. జన్మస్థలం చైనాలో తీవ్రత కాస్త తగ్గుముఖం పట్టినా.. ఇటలీ, ఇరాన్ దేశాల్లో అత్యధిక మరణాలు నమోదవుతున్నాయి. ఇటలీలో 107 మంది మృత్యువాత పడగా 3 వేల మందికి పైగా వైరస్ సోకింది. దీంతో పాఠశాలలు, వర్సిటీలను మూసివేశారు. జపాన్, యూఏఈ, లెబనాన్, ఇరాక్‌లోనూ స్కూళ్లను మూసివేశారు. చైనా వెలుపల నమోదైన కొత్త కేసుల్లో 80 శాతం పైగా ఇటలీ, ఇరాన్, దక్షిణ కొరియాలోనే ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా 95 వేల మందికి పైగా వైరస్ సోకగా.. 3,200 మంది మరణించారు. సౌదీ అరేబియాలో మక్కా యాత్రపై నిషేధం విధించారు. అమెరికాలో మృతుల సంఖ్య 11కు చేరింది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త సైనిక విన్యాసాలు రద్దయ్యాయి. మరోవైపు స్విట్జర్లాండ్‌లో తొలి కరోనా మృతి నమోదైంది. ఇరాన్‌లో కరోనా మృతుల సంఖ్య 107కు చేరింది. 3,513 మందికి వైరస్ సోకినట్లు నిర్ధారించారు. కరెన్సీ నోట్ల వినియోగాన్ని తగ్గించాలని ఆరోగ్య మంత్రి సయీద్ నమాకి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వరసగా రెండో శుక్రవారం ప్రార్థనలను రద్దు చేశారు. బెత్లెహాం నగరంలో క్రీస్తు జన్మించిన స్థలంగా పేర్కొనే ప్రాంతంలోని చర్చిని నిరవధికంగా మూసివేసినట్లు పాలస్తీనా ప్రకటించింది. వెస్ట్‌బ్యాంక్ నుంచి పర్యాటకుల రాకను నిషేధించింది. కాగా.. ఇరాన్‌లోని ఆస్పత్రుల్లో రక్షణ దుస్తులు, సర్జికల్ మాస్కులు ధరించిన సిబ్బంది డ్యాన్సులు చేస్తూ రోగులకు భరోసా కల్పించే వీడియోలను ట్విటర్‌లో లక్ష మందిపైగా వీక్షించారు. చైనాలో తాజాగా 31 మందితో కలిపి కరోనా మృతుల సంఖ్య 3 వేలు దాటింది. కొత్త కేసుల సంఖ్య 80,400కు చేరింది. వైరస్‌పై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశించారు. వుహాన్‌లో పరిస్థితి తీవ్రంగానే ఉన్నప్పటికీ కొత్త కేసులు తక్కువగా నమోదవుతుండడం కొంత సానుకూల పరిణామమని పేర్కొన్నారు.

### దక్షిణ కొరియాలో 6వేల మందికి వైరస్

దక్షిణ కొరియాలో వైరస్ బారిన పడ్డవారి సంఖ్య 6,088కు, మృతుల సంఖ్య 35కు చేరింది. జనం భారీగా క్యూ కడుతుండడంతో మాస్కుల సరఫరా అధికారులకు తలనొప్పిగా మారింది. గుర్తింపు కార్డు చూపినవారికి రెండు మాస్కులు మాత్రమే ఇస్తున్నారు. ప్రజలు ధైర్యంగా ఉండాలంటూ ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ లేఖ రాశారు. మరోవైపు చైనా, దక్షిణ కొరియాల నుంచి వచ్చే పర్యాటకులను 2 వారాలు క్వారంటైన్ చేయాలని జపాన్ నిర్ణయించింది.

## ప్రఖ్యాత పాత్రికేయుడు
# పొత్తూరి ఇకలేరు



పొత్తూరి వెంకటేశ్వరరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె. శ్రీనివాస్

హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత పాత్రికేయుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్, ప్రజాస్వామికవాది పొత్తూరి వెంకటేశ్వరరావు(86) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని స్వగృహంలో కన్నుమూశారు. ఆయనకు సతీమణి సత్యవాణి(79), కుమార్తెలు అనసూయా వాత్సల్య, డాక్టర్ పద్మజ, కుమారులు ప్రేమ్‌గోపాల కృష్ణ, రవిప్రకాశ్ ఉన్నారు. 1934, ఫిబ్రవరి 8న గుంటూరు జిల్లా, పొత్తూరులో పుట్టిన ఆయన 'ఆంధ్రజ్యోతి' వ్యవస్థాపక ఎడిటర్ నార్ల వెంకటేశ్వరరావు రచనల ప్రేరణతో, 1957లో ఆంధ్రజనత పత్రిక ద్వారా పాత్రికేయ జీవితాన్ని ప్రారంభించారు. ఐదు దశాబ్దాలపాటు పత్రికారంగానికి విశేష సేవలందించారు. ఆంధ్రభూమిలో సహాయ సంపాదకుడిగా, ఈనాడు, ఆంధ్రప్రభ, ఉదయం పత్రికల్లో ఎడిటర్‌గా పనిచేశారు. కొంత కాలం ఆకాశవాణిలోనూ కొనసాగారు. టీటీడీ ప్రచురణలకు గౌరవసంపాదకత్వం వహించారు. 1999-2003 కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్‌అకాడమీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. పారమార్థిక పదకోశం, నాటి పత్రికలు-మేటి విలువలు, వ్యాసప్రభ, చింతన, చిరస్మరణీయులు కాశీనాథుని నాగేశ్వరరావు జీవితచరిత్ర, వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు జీవిత చరిత్ర తదితర పుస్తకాలు రచించారు. ఆయన పరిశోధనా గ్రంథం 'ఆంధ్రజాతి అక్షరసంపద - తెలుగు పత్రికలు' తెలుగు పత్రికారంగ చరిత్ర రచనల్లో ఉత్కృష్టమైనదని విమర్శకుల మన్ననలను పొందింది. పాత్రికేయ రంగంలో పొత్తూరి సేవలకుగాను తెలుగు వర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. పొత్తూరి మృతిపట్ల ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తీవ్రవిచారం వ్యక్తం చేశారు. సాయంత్రం 5గంటలకు జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో పొత్తూరి అంత్యక్రియలు ముగిశాయి. అంతకుముందు విద్యావేత్త చుక్కా రామయ్య, 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె. శ్రీనివాస్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్‌అకాడమీ మాజీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

### మానవహక్కుల వాదిగా..

జిల్లెళ్లమూడి అమ్మ భక్తుడిగా, ఆధ్యాత్మిక చింతన కలిగిన పొత్తూరి వెంకటేశ్వరరావు మానవహక్కుల పరిరక్షణ కోసం గళమెత్తిన సందర్భాలెన్నో! నక్సలైట్లు, జనజీవన స్రవంతిలో కలవాలనే ఆకాంక్షతో కన్సర్న్డ్ సిటిజన్ కమిటీ సభ్యుడిగా రెండుసార్లు పొత్తూరి చూపిన చొరవ ప్రత్యేకమైంది. అప్పటి ముఖ్యమంత్రులు చంద్రబాబు, వైఎస్‌లను శాంతిచర్చలకు ఒప్పించడంతో పాటు నక్సలైట్లతోనూ మాట్లాడారు. ఒక సందర్భంలో తనకు గుండె ఆపరేషన్ జరిగిన నెలలోపే నక్సలైట్లతో సంభాషించేందుకు నల్లమల అడవికి వెళ్లారు. ఆ సమయంలోనూ ఆయన ఆధ్యాత్మిక ధ్యానాన్ని విస్మరించలేదని అప్పటి కన్సర్న్డ్ సిటిజన్ కమిటీ ప్రతినిధి ప్రభాకర్ చెప్పారు. మానవహక్కుల పరిరక్షణకై కన్నాభిరాన్, ఆచార్య హరగోపాల్ వంటి ఉద్యమనేతలతో కలిసి పలు సందర్భాలలో వేదిక పంచుకున్నారు. తొలినాళ్లలో విశాలాంధ్రవాది అయిన పొత్తూరి అనంతరం తెలంగాణ ఉద్యమానికి మద్దతుపలికారు. వరవరరావు వంటి మేధావుల నిర్బంధాన్ని వ్యతిరేకించారు. ఎన్‌కౌంటర్లు లేని సమాజాన్ని కాంక్షించారు. అందుకే ప్రజాస్వామిక వాదులంతా పొత్తూరిని మానవతావాదిగా అభిమానిస్తారు.

### జర్నలిజంలో మైలురాయి: గవర్నర్

అమరావతి, గుంటూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఐదు దశాబ్దాలుగా పాత్రికేయ వృత్తితో సమాజానికి సేవలందించిన సీనియర్ జర్నలిస్టు పొత్తూరి వెంకటేశ్వరరావు ఎందరికో ఆదర్శంగా, జర్నలిజంలో మైలురాయిగా నిలిచారని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ కొనియాడారు. పొత్తూరి మృతిపట్ల సంతాపం ప్రకటించారు. జర్నలిస్టు నుంచి సంపాదకుడిగా ఎదిగిన పొత్తూరి మరణం తనకు ఎంతో బాధ కలిగించిందని సీఎం జగన్ పేర్కొన్నారు. పత్రికా సంపాదకానికే వన్నె చేకూర్చిన పొత్తూరి మరణ వార్త బాధకలిగించిందని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు.



పొత్తూరి మరణం పత్రికా రంగానికి తీరని లోటని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా పేర్కొన్నారు. పత్రికా రంగానికి తీరని లోటని ప్రెస్ అకాడమీ ఛైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్ అన్నారు. మంగళగిరి హ్యాపీ రిసార్ట్స్‌లో జరుగుతున్న ఐజేయూ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో పొత్తూరికి ఘననివాళి అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐజేయూ జాతీయ అధ్యక్షుడు గీతార్థ పాఠక్, ప్రధాన కార్యదర్శి సబీనా ఇంద్రజిత్, ఏపీ మీడియా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పి.ఢిల్లీ బాబు రెడ్డి సంతాపం తెలిపారు.

### ఆత్మీయుడిని కోల్పోయా: చంద్రబాబు

సామాజిక బాధ్యతతో జర్నలిజానికే వన్నె తెచ్చిన పొత్తూరి వెంకటేశ్వరరావు పాత్రికేయులందరికీ మార్గదర్శకుడని మాజీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన మృతిపట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తంచేశారు. గొప్ప ఆత్మీయుడిని కోల్పోయానని పేర్కొన్నారు. పొత్తూరి మరణం పట్ల టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# దేశంలో మరో కేసు

**ఘజియాబాద్ వ్యక్తికి కొవిడ్-19 నిర్ధారణ**

**ఇటీవల ఇరాన్ వెళ్లొచ్చిన బాధితుడు**

**దేశంలో 30కి పెరిగిన కేసుల సంఖ్య**

**మోదీ బ్రస్సెల్స్ పర్యటన వాయిదా**

న్యూఢిల్లీ, మార్చి 5: దేశంలో మరో కరోనా కేసు నమోదైంది. ఇటీవల ఇరాన్ వెళ్లొచ్చిన ఘజియాబాద్‌కు చెందిన వ్యక్తికి వైరస్ సోకినట్లు గురువారం తేలింది. దీంతో దేశంలో మొత్తం కేసుల సంఖ్య 30కి చేరింది. ఈ జాబితాలో కేరళకు చెందిన ముగ్గురు వ్యక్తులు కూడా ఉన్నారు. వారు చికిత్స అనంతరం కోలుకుని డిశ్చార్జి అయ్యారు. మిగతా బాధితులు వేర్వేరు ఆస్పత్రుల్లోని ఐసోలేషన్ వార్డుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో 16 మంది ఇటలీకి చెందిన పర్యాటకులు. గురుగావ్‌కు చెందిన పేటీఎం ఉద్యోగికి వైరస్ సోకినట్లు బుధవారం వెల్లడైంది. అతను 91 మందితో దగ్గరగా మసలినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. కరోనా ప్రభావం ఈ నెలలో జరగాల్సిన భారత్-ఈయూ సదస్సుపైనా పడింది. ఆరోగ్య శాఖ అధికారుల సూచన మేరకు ప్రధాని నరేంద్ర మోదీ బ్రస్సెల్స్ పర్యటన వాయిదా పడింది. భారతీయ వైద్య బృందం ఇరాన్ వెళ్లిందని, ఖ్వామ్ నగరంలో స్క్రీనింగ్ కేంద్రం ఏర్పాటు చేయనుందని విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ తెలిపారు. అక్కడున్న భారతీయులను తీసుకొచ్చేందుకు మాట్లాడుతున్నామని చెప్పారు. విదేశాలకు వెళ్లి వచ్చిన తండ్రి కారణంగా దుబాయ్‌లో 16 ఏళ్ల బాలికకు కరోనా సోకింది. ఆమె దుబాయ్‌లోని ఇండియన్ స్కూల్‌లో చదువుతోంది. దీంతో యూఏఈలో కేసుల సంఖ్య 28కి చేరింది. దేశంలో కనీసం 3 నెలల వరకు ఔషధ ముడి పదార్థాలకు కొరత లేదని కేంద్ర మంత్రి సదానంద గౌడ తెలిపారు. మన దౌత్య కార్యాలయాలు ప్రవాసులకు సహాయం అందిస్తున్నాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రవీశ్ కుమార్ వివరించారు.

### ఆస్పత్రి నుంచి కరోనా అనుమానితుల పరార్

జమ్మూ/శ్రీనగర్: కరోనా అనుమానిత లక్షణాలతో జమ్మూ ప్రభుత్వ ఆస్పత్రి ఐసోలేషన్ వార్డులో ఉంచిన ఇద్దరు వ్యక్తులు గురువారం పరారయ్యారు. అయితే వెంటనే వారిని పట్టుకొని తీసుకొచ్చారు. వీరు ఇటలీ, దక్షిణ కొరియాల్లో పర్యటించి వచ్చారు. ప్రభావిత దేశాల్లో పర్యటించి వచ్చిన ఐదుగురు వ్యక్తులను శ్రీనగర్ ఆస్పత్రిలోని ఐసోలేషన్ వార్డులో ఉంచారు.

# నిర్భయ దోషులకు 20న ఉరి

**తెల్లవారుజామున 5.30కి అమలు.. కొత్త తేదీ ఖరారు చేసిన ఢిల్లీ కోర్టు**

న్యూఢిల్లీ, మార్చి 5: నిర్భయపై సామూహిక అత్యాచారం, హత్య కేసులో దోషులుగా నిర్ధారించిన నలుగురికీ ఈ నెల 20వ తేదీన ఉరిశిక్ష విధించనున్నారు. ఆ రోజు తెల్లవారుజామున 5.30 గంటలకు దోషులు ముఖేశ్‌కుమార్‌సింగ్ (33), పవన్ గుప్తా (25), వినయ్ శర్మ (26), అక్షయ్‌కుమార్‌సింగ్ (31)లకు శిక్ష అమలు చేయనున్నారు. ఈ మేరకు అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ధర్మేంద్ర రాణా గురువారం శిక్ష అమలు తేదీని ఖరారుచేశారు. నిజానికి వీరిని గత మంగళవారమే(3న) ఉరి తీయాల్సి ఉంది. అయితే పవన్ తనకు క్షమాభిక్ష పెట్టాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు పిటిషన్ పెట్టుకున్నారు. దీంతో తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు నలుగురు దోషులకు ఉరిశిక్ష అమలును కోర్టు సోమవారం వాయిదా వేసింది. పవన్ క్షమాభిక్ష దరఖాస్తును రాష్ట్రపతి తిరస్కరించడంతో.. నలుగురు దోషులను ఉరి తీయడానికి కొత్త తేదీని నిర్ణయించాలని ఢిల్లీ ప్రభుత్వం బుధవారం కోర్టును అభ్యర్థించింది. చట్టపరంగా క్షమాభిక్ష కోసం అన్ని అవకాశాలను దోషులు ఉపయోగించుకున్నారని.. ఏ కోర్టులోనూ వారి వినతులు పెండింగ్‌లో లేవని తెలిపింది. దోషులకు ఇక ఎలాంటి నోటీసులూ ఇవ్వనక్కర్లేదని ప్రాసిక్యూషన్ తరపు న్యాయవాది కూడా తెలిపారు. దీంతో శిక్ష అమలుకు కొత్త తేదీని నిర్ధారించారు. మరణ శిక్ష నుంచి తప్పించుకోవడానికి చట్టపరంగా తమకున్న అన్ని అవకాశాలను నలుగురు దోషులూ ఉపయోగించుకున్నారు. ఇప్పటివరకు మూడు సార్లు ఈ దోషుల డెత్ వారెంట్లను కోర్టు నిలిపివేయడం గమనార్హం. దక్షిణ ఢిల్లీలో 2012 డిసెంబరు 16న నిర్భయ(23)పై కదిలే బస్సులో ఆరుగురు సామూహిక అత్యాచారం చేశారు. పక్షం రోజులు మృత్యువుతో పోరాడి ఆమె కన్నుమూసింది. కేసు విచారణ సమయంలో ఆరుగురు నిందితుల్లో ఒకరైన రామ్‌సింగ్ తీహార్ జైల్లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంకొకరు జువెనైల్ కావడంతో విడుదలయ్యాడు.



### విడివిడిగానా.. ఒకే దఫానా?

నిర్భయ దోషులు నలుగురినీ కలిపి ఒకేసారి ఉరితీయాలన్న ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను కేంద్రం సుప్రీంకోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఈ నెల 23న విచారణ జరుపుతామని జస్టిస్ ఆర్.భానుమతి, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ బోపన్నలతో కూడిన ధర్మాసనం గురువారం వెల్లడించింది. అయితే ఢిల్లీ కోర్టు వారిని 20న ఉరితీయాలని నిర్దేశించిందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ప్రస్తావించారు. మరణశిక్ష అమలు కాకుండా ఈ దోషులు న్యాయవ్యవస్థను అపహాస్యంచేశారని తెలిపారు. ఏదైనా కేసులో ఒకరి కంటే ఎక్కువ మంది దోషులకు ఉరిశిక్ష పడితే.. వారిని విడివిడిగా ఉరి తీయాలా.. లేక ఒకేసారి ఉరితీయాలా అనేదానిపై 23న విచారణ జరుపుతామని బెంచ్ స్పష్టం చేసింది. ఎవరైనా, ఏదైనా దరఖాస్తు చేయాలనుకుంటే 20వ తేదీ లోపు చేయాల్సిందిగా చెప్పాలని మెహతా కోరగా.. అలా చెప్పబోమని స్పష్టం చేసింది.

### వీలుంటే.. కళ్లారా చూస్తా

20వ తేదీ తమ జీవితాలకు శుభోదయమని నిర్భయ తల్లి ఆశాదేవి వ్యాఖ్యానించారు. ఉరిశిక్షకు కొత్త తేదీని నిర్ణయించిన నేపథ్యంలో ఢిల్లీ కోర్టు వద్ద ఆమె మాట్లాడారు. అవకాశముంటే ఆ నలుగురిని ఉరితీయడం కళ్లారా చూస్తానన్నారు. 'వారికి ఉరిశిక్ష పడాలని.. అప్పుడు ఇలాంటి నేరాలు ఎవరూ చేయరని చనిపోయే ముందు నా కుమార్తె కోరుకుంది. ఏ మాత్రం అవకాశమున్నా.. వారు చావడం చూడాలనుకుంటున్నాను' అని తెలిపారు. వారి మరణ శిక్షకు ఇదే చివరి తేదీ అవుతుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు.






## టైమ్ కవర్‌పేజీపై ఇందిరాగాంధీ, అమ్రిత్ కౌర్

**ప్రపంచంలోని 100 శక్తిమంతుల మహిళల జాబితాలో చోటు**

న్యూయార్క్, మార్చి 5: ప్రపంచంలోని ఈ ఏడాది వంద మంది శక్తిమంతుల మహిళల జాబితాను టైమ్ మ్యాగజీన్ విడుదల చేసింది. భారత్ నుంచి దివంగత ప్రధాని ఇందిరా గాంధీ, మాజీ స్వాతంత్ర్య సమర యోధురాలు అమ్రిత్ కౌర్ ఈ మ్యాగజీన్ కవర్‌పేజీపై చోటు సంపాదించుకున్న వారిలో ఉన్నారు. 1947 సంవత్సర మహిళగా అమ్రిత్ కౌర్‌ను, 1976 ఏడాది మహిళగా ఇందిరను టైమ్ అభివర్ణించింది. 1975లో భారతదేశ ఆర్థిక వ్యవస్థ అస్థిరత కారణంగా ఇందిర ప్రభుత్వంపై దేశ ప్రజలు తీవ్ర నిరసనలు తెలిపారని, అనంతరం నిర్వహించిన ఎన్నికల్లో తన ఎన్నిక చెల్లుబాటు కాకపోవడంతో ఇందిర ఎమర్జెన్సీని విధించారని టైమ్ పేర్కొంది. ఆక్స్‌ఫర్డ్‌లో విద్యాభ్యాసం తర్వాత కపుర్తల యువరాణి అమ్రిత్ కౌర్ 1918లో భారత్‌కు తిరిగి వెళ్లారని, గాంధీ బోధనలకు ఆకర్షితురాలై స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారని తెలిపింది. దీంతోపాటు బాల్య వివాహాలు వంటి దురాచారాలపైనా ఆమె పోరాడారని వివరించింది.

## అల్లర్ల కేసులో ఆప్ కౌన్సిలర్ అరెస్టు

న్యూఢిల్లీ, మార్చి 5: ఈశాన్య ఢిల్లీ మతఘర్షణల కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్‌ను ఢిల్లీ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి అంకిత్ శర్మ హత్య కేసులో అతను నిందితుడు. అంతకుముందు కోర్టు ఎదుట లొంగిపోయేందుకు అనుమతించాలని తాహిర్ చేసిన అభ్యర్థనను అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టు మేజిస్ట్రేట్ విశాల్ పహుజా తిరస్కరించారు. కేసు ఈ కోర్టు పరిధిలోనిది కాదని, ఘటన జరిగిన ప్రాంతం ఏ కోర్టు పరిధిలో ఉందో ఆ కోర్టులోనే లొంగిపోవాలని స్పష్టం చేశారు. అయితే, అతని ప్రాణాలకు ముప్పు ఉందని, 'మారిన పరిస్థితుల' నేపథ్యంలో సంబంధిత కోర్టులో అతను లొంగిపోలేడని అతని తరపు న్యాయవాది ముకేశ్ కాలియా తెలిపారు. అందుకే ఈ కోర్టులో లొంగిపోయేందుకు వచ్చాడని విన్నవించారు. తాహిర్ అభ్యర్థనను కోర్టు తిరస్కరించడంతో ఢిల్లీ పోలీసు బృందం అతన్ని అరెస్టు చేసింది.

## 'పీఎఫ్'పై వడ్డీరేటు 8.5 శాతానికి తగ్గింపు

న్యూఢిల్లీ, మార్చి 5: ఉద్యోగులకు కేంద్రం చేదు వార్తనందించింది. 'ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్'(ఈపీఎఫ్‌ఓ).. వారి భవిష్యనిధిపై ఇస్తున్న వడ్డీ రేటును 8.5%కి తగ్గించింది. బుధవారం జరిగిన 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ'(సీబీటీ) సమావేశం.. ఈ మేరకు నిర్ణయం తీసుకుందని కేంద్ర కార్మికమంత్రి సంతోష్ గంగ్వార్ తెలిపారు. ఈపీఎఫ్‌ఓ.. 2018-19 ఆర్థిక సంవత్సరానికి 8.65 శాతం వడ్డీరేటు చెల్లించిందని.. దీన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20)కి 8.5 శాతానికి తగ్గించాలని నిర్ణయించిందని ఆయన చెప్పారు. దీనివల్ల ఈపీఎఫ్‌ఓకు 700 కోట్లు ఆదా అవుతుంది.

## మసీదు నిర్మాణంపై హోలీ తర్వాత ట్రస్టు

లఖ్‌నవూ, మార్చి 5: అయోధ్యలో మసీదు నిర్మాణానికి సంబంధించి ట్రస్ట్‌ను హోలీ పండుగ తర్వాత ప్రకటిస్తామని ఉత్తరప్రదేశ్‌కు చెందిన సున్నీ వక్ఫ్ బోర్డు తెలిపింది. సుప్రీంకోర్టు కేటాయించిన ఐదెకరాలు తీసుకోవాలని, అందులో మసీదుతో పాటు ఇండో-ఇస్లామిక్ పరిశోధన కేంద్రం, ఆస్పత్రి, గ్రంథాలయం నిర్మించాలని నిర్ణయించినట్లు సున్నీ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ జఫర్ ఫరూఖీ గత నెలలోనే చెప్పారు. అయితే, గురువారం నాటి బోర్డు సమావేశంలో దీనిపై ఎలాంటి చర్చ జరగలేదన్నారు.

## హెచ్1బీ వీసాల కుదింపు

వాషింగ్టన్, మార్చి 5: హెచ్1బీ వీసాలను ట్రంప్ సర్కారు భారీ సంఖ్యలో కుదిస్తోంది. ప్రతి ఐదు దరఖాస్తుల్లో ఒకదానిని ఏదో ఒక కారణంతో తిరస్కరిస్తోంది. అమెరికా కంపెనీలైన గూగుల్, అమెజాన్‌లతో పోలిస్తే భారతీయ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్‌లకు ఇచ్చే వీసాల తిరస్కరణ ఏటికేడు పెరుగుతోంది. 2018లో డినైల్ రేట్ 24శాతం ఉండగా, 2019లో ఇది 21శాతంగా నమోదైంది. కంపెనీల వారీగా చూస్తే 2019లో డినైల్ రేట్ టీసీఎస్ 31%, ఇన్ఫోసిస్ 35%, విప్రో 47%, టెక్ మహీంద్ర 37% నమోదైంది.

## 'అక్షయ్ గోల్డ్' నిందితులకు రిమాండ్

చిత్తూరు లీగల్, మార్చి 5: అక్షయ్ గోల్డ్ ఫామ్స్ అండ్ విల్లాస్ నిందితులు ఆరుగురు గురువారం సాయంత్రం చిత్తూరు జిల్లా కోర్టులో లొంగిపోయారు. వారికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏవీ రవీంద్రబాబు ఈ నెల 19 వరకు రిమాండు విధించారు. అక్షయ్ గోల్డ్ సంస్థను 2010లో ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో స్థాపించారు. ఎక్కువ వడ్డీ ఆశ చూపి లక్షలాది మంది నుంచి రూ.వెయ్యి కోట్ల వరకు డిపాజిట్లు సేకరించారు. మొదట్లో వడ్డీ సక్రమంగా చెల్లించేవారు. తదనంతరం చెల్లింపులు ఆగిపోవడంతో డిపాజిట్‌దారులు 2013లో ఆ సంస్థపై శ్రీకాళహస్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సుమారు 20 మందిపై కేసు నమోదు చేసి విచారణను 2014లో సీఐడీకి అప్పగించారు. అయితే, నిందితులు నేటికీ పోలీసులకు చిక్కలేదు. ఇలా తప్పించుకు తిరుగుతున్న 20 మందిలో ప్రకాశం జిల్లాకి చెందిన ఎం.శ్రీనివాసరావు(ఏ6), డి. పుల్లారావు (ఏ7), ఆత్మకూరి రమేష్ బాబు(ఏ8), తులసీ శ్రీనివాసరావు(ఏ11), తనికొండ వెంకటరావు(ఏ20), అనంతపురం జిల్లాకి చెందిన నాగరాజు మంజుల(ఏ16) గురువారం సాయంత్రం జిల్లా కోర్టులో న్యాయమూర్తి ఎదుట లొంగిపోయారు. జిల్లా జడ్జి రవీంద్రబాబు వీరికి ఈ నెల 19 వరకు రిమాండ్ విధించారు. వీరికి బెయిల్ మంజూరు చేయాలని ఓ న్యాయవాది బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా జడ్జి దానిని డిస్మిస్ చేశారు.

## ఏకాభిప్రాయం తర్వాతే ఎన్‌పీఆర్

**కేంద్రానికి పార్లమెంటరీ ప్యానెల్ సూచన**

న్యూఢిల్లీ, మార్చి 5: ఎన్‌పీఆర్, జనగణనపై ప్రజల్లో భయం, అసంతృప్తి ఉందని పార్లమెంటరీ ప్యానెల్ గుర్తించింది. ప్రజల అనుమానాలను నివృత్తి చేసి, జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం సాధించిన తర్వాతే ఎన్‌పీఆర్‌ను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ చొరవ తీసుకుంటేనే ఇది సాధ్యమని ప్యానెల్ అభిప్రాయపడింది. లేకుంటే చాలా రాష్ట్రాలు ఎన్‌పీఆర్‌ను అడ్డుకుంటాయని పేర్కొన్నది. కాంగ్రెస్ నేత ఆనంద్ శర్మ నేతృత్వంలోని హోం వ్యవహారాల పార్లమెంటరీ ప్యానెల్ తన నివేదికను గురువారం రాజ్యసభకు సమర్పించింది. మరోవైపు జనగణన నుంచి ఎన్‌పీఆర్‌ను వేరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని 190 మంది ఆర్థిక, సామాజికవేత్తలు కోరారు.

## ఉద్యోగుల సమస్యలపై కమిటీ వేయండి

**సీఎంకు సచివాలయ ఉద్యోగుల అధ్యక్షుడి విన్నపం**

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): సచివాలయం తరలింపుపై ఉద్యోగులు అప్రమత్తమయ్యారు. జీఓ.13 తమకు తెలియకుండానే వచ్చిందని, దాన్ని విడుదల చేసినప్పుడు సంబంధిత ఉద్యోగుల కష్టనష్టాలు పరిగణనలోకి తీసుకోలేదని, ఇకపై అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎం జగన్‌కు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి వినతిపత్రం అందజేశారు. తరలింపు వల్ల ఎదురయ్యే సమస్యలు, డిమాండ్లు తెలుసుకోవడానికి సమావేశం ఏర్పాటు చేయాలనిఉద్యోగులు కోరుతున్నారు.

## తప్పుడు పత్రాలతో మోసం!

**బీఎస్ 3 వాహనాలు బీఎస్4గా రిజిస్ట్రేషన్**

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో వెలుగు చూసిన రవాణా కుంభకోణంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు రవాణాశాఖ సంయుక్త కార్యదర్శులు ప్రసాదరావు, రమాశ్రీ వెల్లడించారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో బీఎస్3 లారీలను బీఎస్4గా చూపించి వాటిలో కొన్నింటిని బస్సులుగా మార్చిన వ్యవహారంపై చట్టపరమైన చర్యలకు సిద్ధమైనట్టు చెప్పారు. విజయవాడలో గురువారం మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి వాహనాలను కొనుగోలు చేసి ఏపీలో తప్పుడు పత్రాలు సృష్టించి వాటిని ఇష్టారాజ్యంగా నడుపుతోన్న వ్యవహారం ఇటీవలే తమ దృష్టికి వచ్చిందన్నారు. అనంత కేంద్రంగా మొత్తం 88 లారీలు బీఎస్ 3నుంచి 4గా చూపించి రిజిస్ట్రేషన్ చేయించినట్లు చెప్పారు. ఇప్పటి వరకూ 68వాహనాలను సీజ్ చేశామని, అందులో మూడు లారీలను ఆర్టీఏ అనుమతి లేకుండా బస్సులుగా మార్చిన విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. ఏపీతోపాటు కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, నాగాలాండ్ తదితర ప్రాంతాల నుంచి తెచ్చిన నిషేధిత లారీలను తీసుకొచ్చి వాటిని అనుమతి లేకుండా బస్సులుగా మార్చడం నేరమన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చినట్లు తప్పుడు ఎన్‌వోసీలతో ఏపీ రవాణాశాఖను మోసం చేశారని తేలిందన్నారు. కాగా, ఈ బస్సుల వ్యవహారం మాజీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డినే ప్రచారం జరుగుతోంది.

## ఏడుగురు కాంగ్రెస్ ఎంపీలపై వేటు

**సమావేశాలు ముగిసేదాకా సస్పెన్షన్**

న్యూఢిల్లీ, మార్చి 5: లోక్‌సభ అసాధారణ నిర్ణయం నిర్ణయం తీసుకుంది. సభ నియమావళిపై ఏ మాత్రం గౌరవం లేకుండా దుష్ప్రవర్తనతో వ్యవహరించారని.. ఏడుగురు కాంగ్రెస్ ఎంపీలను బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకు సస్పెండ్ చేసింది. రాజస్థాన్‌లో బీజేపీ మిత్రపక్షం ఆర్‌ఎల్‌పీ ఎంపీ హనుమా న్ బెనీవాల్ సోనియాగాంధీ, ఆమె కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని.. ఆయన్ను తక్షణం సస్పెండ్ చేయాలని.. ఢిల్లీ హింసాకాండపై చర్చించాలని కాంగ్రెస్ సభ్యు లు గురువారం సభలో గందరగోళం సృష్టించారు. వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశా రు. అప్పుడు ఎంపీ రమాదేవి సభాధ్యక్ష స్థానంలో ఉన్నారు. అదే సమయంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ గనుల చట్టాల సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. దానిపై మాట్లాడుతుండగా.. పలువురు కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్ టేబుల్‌పై ఉన్న పేపర్లు లాగి విసిరేశారు. దాంతో రమాదేవి సభను గంటసేపు వాయిదావేశారు. తిరిగి మధ్యాహ్నం సమావేశం కాగానే.. బీజేపీ ఎంపీ మీనాక్షి లేఖీ సభాధ్యక్ష స్థానంలో కూర్చున్నారు. స్పీకర్ స్థానాన్ని అగౌరవపరిచే విధంగా గౌరవ్ గొగోయ్, టీఎన్ ప్రతాపన్, డీన్ కురియకోస్, మాణికా టాగోర్, రాజ్‌మోహన్ ఉన్నితన్, బెన్నీ బెహనన్, గుర్జీత్‌సింగ్ అవుజ్లా వ్యవహరించారని.. పార్లమెంటరీ చరిత్రలో తొలిసారి ఇలా జరిగిందంటూ.. వారి పేర్లు ప్రస్తావించినందున గురువారం వారు సభలో ఉండడానికి వీల్లేదని స్పష్టం చేశారు. వెంటనే ప్రహ్లాద్ జోషీ ఈ ఏడుగురినీ సమావేశాలు ముగిసేదాకా సస్పెండ్ చేయాలని కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ సభ్యుల అభ్యంతరాల నడుమ సభ మూజువాణి ఓటుతో దానిని ఆమోదించింది. అనంతరం సభను శుక్రవారానికి వాయిదావేశారు. కాగా.. తమ సభ్యుల సస్పెన్షన్‌ను లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత అధీర్ రంజన్ చౌదురి తప్పుబట్టారు. ఇది నియంతృత్వ నిర్ణయమని.. ఢిల్లీ అల్లర్లపై ప్రతిపక్షాల గళాన్ని బలహీనపరిచేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. కాగా.. సస్పెన్షన్ నిర్ణయాన్ని బీజేపీ స్వాగతించింది. కొందరు కాంగ్రెస్ సభ్యుల తీరు దారుణమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి జోషీ అన్నారు.

# కరోనా కలవరం



## ప్రపంచ వ్యాప్తంగా బడికి 30 కోట్ల మంది దూరం

న్యూఢిల్లీ: కరోనా వైరస్ ప్రపంచవ్యాప్తంగా 30 కోట్ల మంది విద్యార్థులపై ప్రభావం చూపింది. మన దేశ రాజధాని న్యూఢిల్లీతోపాటు చైనా, ఇటలీ, అమెరికా, దక్షిణ కొరియా, ఇరాన్, జపాన్, ఫ్రాన్స్, పాకిస్థాన్‌తోపాటు 22 దేశాలలో పాఠశాలలను మూసివేశారు. ప్రపంచవ్యాప్తంగా విద్యపై ఊహించని విధంగా ప్రభావం పడిందని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. పలు దేశాలలో ప్రభుత్వాలు కంపెనీలకు, తల్లిదండ్రులకు సహాయ సహకారాలు అందిస్తున్నాయి. తమ పిల్లలను చూసుకోవడానికి తల్లిదండ్రులకు 14 రోజులు సిక్ లీవ్ ఇస్తామని ఫ్రాన్స్ ప్రభుత్వం ప్రకటించింది. కొన్ని పాఠశాలలు, ప్రభుత్వ అధికారులు పిల్లలకు ఇంటి వద్దే ఆన్‌లైన్ ద్వారా పాఠాలు చెప్పించే ప్రయత్నంలో ఉన్నాయి. ఉపాధ్యాయులు ఆన్‌లైన్ పాఠాలు బోధించడానికి ఇటాలియన్ ప్రభుత్వం ఒక వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించింది.

## కరోనాకు పారాసిటమాల్ చాలు

- భారతీయులకు తట్టుకునే శక్తి ఉంది
- భారతీయ శాస్త్రవేత్త గగన్‌దీప్ కాంగ్

న్యూఢిల్లీ, మార్చి 5: ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా (కోవిడ్-19) వైరస్ ప్రభావం భారత్‌పై ఏమాత్రం ఉండబోదా? ఆ వైరస్‌ను తట్టుకునే శక్తి భారతీయులకు ఉందా? ఒకవేళ మనవాళ్లు ఆ వైరస్ బారిన పడ్డా.. 'ఉఫ్' అంటే ఒక్క దెబ్బకు పారిపోతుందా? ఈ ప్రశ్నలకు ఔననే అంటున్నారు భారతీయ శాస్త్రవేత్త గగన్‌దీప్ కాంగ్. ప్రస్తుతం క్రిస్టియన్ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆమె.. గతంలో తన పరిశోధనలకు ఎన్నో అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు. ప్రఖ్యాత 'రాయల్ సొసైటీ' ఫెలోషిప్ పొందారు. అన్నింటికీ మించి.. నార్వే ఆధారంగా పనిచేస్తున్న అంటువ్యాధుల సన్నద్ధత కార్యక్రమం (సీఈపీఐ)కి ఉపాధ్యక్షురాలిగా ఉన్నారు. కోవిడ్-19ని తట్టుకునే సామర్థ్యం భారతీయులకు ఉందని ఆమె తన పరిశోధనల ఆధారంగా చెబుతున్నారు. "కరోనాకు భయపడాల్సిన అవసరం లేదు. ఈ వైరస్ సోకిన ప్రతి ఐదుగురిలో నలుగురికి ఎలాంటి ప్రత్యేక వైద్యం అవసరం లేకుండానే.. తగ్గిపోతుంది. అంతగా అవసరమైతే పారాసెటిమాల్ వాడితే సరిపోతుంది. అది కూడా సాధారణ జలుబు, జ్వరానికి వాడినట్లే. మిగతా ఒక్కరి విషయంలోనే ఆందోళన" అని ఆమె పేర్కొన్నారు. ఆ మిగతా ఒక్క కేటగిరీలో వృద్ధులు ఉంటారని చెబుతున్నారు.

## బయోమెట్రిక్ వద్దు..!

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బయోమెట్రిక్ అటెండెన్స్.. ఇప్పుడు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, స్కూళ్లు, కాలేజీల్లో ఇది కామనైపోయింది. బయోమెట్రిక్ యంత్రంపై వేలు పెట్టేస్తే.. అటెండెన్స్ పడిపోతుంది. ఇకపై కొన్నాళ్లపాటు అది కుదరదు. ఎందుకంటే.. డాక్టర్లు వేలిముద్రతో బయోమెట్రిక్ అటెండెన్స్ వద్దంటున్నారు. కరోనా వైరస్ వ్యాప్తిచెందే ప్రమాదం ఉండటంతో.. వేలిముద్రలతో అటెండెన్స్ వద్దంటున్నారు. అదేస్థానంలో.. ఫేషియల్ రికగ్నైజేషన్, ఐరిస్ అటెండెన్స్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదంటున్నారు. కాగా.. ఇప్పటికే చాలా వరకు ప్రైవేటు సంస్థలు, కాలేజీల్లో వేలిముద్రతో బయోమెట్రిక్‌ను నిలిపివేశారు.

## మాస్కు ధర రూ. 20

- శానిటైజర్ ధరలకూ రెక్కలు

మంగళ్‌హాట్/హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కరోనా భయంతో మాస్కులు, శానిటైజర్లకు డిమాండ్ పెరిగిపోయింది. దీంతో వాటి ధరలకు రెక్కలు వచ్చాయి. సాధారణ రోజుల్లో మాస్కుల ధరలు రూ. 5 - రూ. 8 మధ్య ఉండగా.. ఇప్పుడు అవి రూ. 15 - రూ.20కి చేరుకున్నాయి. అటు శానిటైజర్ల ధరలు కూడా రెండింతల దాకా పెరిగాయి. డిమాండ్ 10 రెట్లు పెరిగిందని 'హిమాలయ డ్రగ్స్' సీఈవో ఫిలిప్ హైడోన్, గోద్రేజ్‌కు చెందిన సునీల్ కటారియా తెలిపారు.

## కరోనా వదంతులు.. ఇద్దరిపై ఫిర్యాదు

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కరోనాపై వదంతులు సృష్టిస్తున్న ఇద్దరు వ్యక్తులపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓ టీవీ చానల్‌లో చర్చ సందర్భంగా ఓ హోమియో వైద్యుడు వదంతులు వ్యాపించేలా వ్యాఖ్యలు చేశారని, ఇంకో సంఘటనలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. వీటిపై కేసు నమోదు చేస్తామని సైబర్‌క్రైం పోలీసులు తెలిపారు.

## కరోనా లక్షణాల రోగి ఆస్పత్రి నుంచి పరార్

చండీగఢ్, మార్చి 5: దగ్గుతో బాధపడుతూ ఓ రోగి ఆస్పత్రికి వచ్చాడు. పరీక్షలు చేసిన వైద్యులు, 'నీలో కరోనా వైరస్ లక్షణాలు కనిపిస్తున్నాయ్' అని చెప్పారు. ఐసొలేషన్ వార్డుకు తరలించే ప్రయత్నాల్లో ఉండగానే ఆస్పత్రి నుంచి అతగాడు పరారయ్యాడు. అతడెక్కడికి వెళ్లాడో తెలియక డాక్టర్లు హైరానా పడ్డారు. పంజాబ్‌లో ఈ ఘటన వెలుగుచూసింది. మోగా అనే పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల దుబాయి నుంచి తిరిగొచ్చాడు. దగ్గు తగ్గకపోవడంతో స్థానిక సివిల్ ఆస్పత్రికి వెళ్లాడు. శాంపిల్స్ తీసుకున్న వైద్యులు, కరోనా లక్షణాలు ఉన్నాయని నిర్ధారించి ఐసోలేషన్‌కు రిఫర్ చేశారు. వైద్యుల మాటలతో తీవ్ర ఆందోళనకు గురైన ఆ వ్యక్తి, తనను అక్కడి మీడియా ప్రతినిధులు ఫొటోలు తీస్తుండటంతో మరింత కంగారు పడిపోయి ఇంటికి పారిపోయాడు. పోలీసుల సాయంతో ప్రత్యేక డాక్టర్ల బృందం పరుగు పరుగున అతడి ఇంటికి వెళ్లి నచ్చజెప్పింది. మరికొన్ని పరీక్షల కోసం శాంపిళ్లు ఇచ్చేందుకు అంగీకరించిన ఆ వ్యక్తి, ఐసోలేషన్ వార్డుకు వెళ్లేందుకూ సరేననటంతో డాక్టర్లు ఊపిరి పీల్చుకున్నారు. బాధితుడి శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం పుణెకు పంపారు.



మాస్క్ ధరించి లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ నవనీత్ కౌర్ రాణా

## కట్టడికి ర్యాపిడ్ టీమ్‌లు!

- ఏర్పాటు చేయాలని రాష్ట్రాలను కోరిన కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 5: కరోనా వైరస్ నియంత్రణకు జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు ఏర్పాటు చేయాలని రాష్ట్రాలను కేంద్ర ఆరోగ్య శాఖ కోరింది. వైరస్ సోకకుండా అడ్డుకట్ట వేసే ప్రయత్నంలో ఈ బృందాల భాగస్వామ్యం అవసరమని పేర్కొంది. ప్రభుత్వం చేపట్టిన చర్యలను గురువారం రాజ్యసభలో ఆ శాఖ మంత్రి హర్షవర్ధన్ వివరించారు. కరోనాపై ఆందోళన అవసరం లేదని చెప్పారు. ఆరోగ్య శాఖ, మంత్రుల బృందంతోపాటు ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా పరిస్థితిని సమీక్షిస్తున్నారని తెలిపారు. బుధవారం వరకు వేర్వేరుచోట్ల 6,11,176 మంది ప్రయాణికులకు 'స్ర్కీనింగ్' నిర్వహించామని పేర్కొన్నారు. మొత్తం 29 'పాజిటివ్ కేసులు' నమోదయ్యాయని చెప్పారు. వారిలో కేరళకు చెందిన ముగ్గురు కోలుకున్నారని వివరించారు. 28,529 మందిని సామాజిక పర్యవేక్షణలో ఉంచినట్లు చెప్పారు. శానిటైజర్లు, మాస్కుల బ్లాక్ మార్కెటింగ్‌కు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని గురువారం లోక్‌సభలో పలువురు ప్రతిపక్ష ఎంపీలు సూచించారు. వాటి ధరలు అమాంతం పెరిగిపోవడాన్ని కాంగ్రెస్ పక్ష నేత అధిర్ రంజన్ చౌధురి ప్రస్తావించారు. పలు విమానాశ్రయాల్లో థర్మల్ స్ర్కీనింగ్ సౌకర్యం లేదని కనిమొళి (డీఎంకే) చెప్పారు. అటువంటి చోట్ల వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. ముందుజాగ్రత్త చర్యలపై ప్రభుత్వం విస్తృత ప్రచారం చేయాలని అఖిలేశ్ యాదవ్ (ఎస్పీ) సూచించారు.

## చేతులతో ముఖాన్ని తాకట్లేదు

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్, మార్చి 5: కరోనా వైరస్ సోకుతుందన్న భయంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొన్ని రోజులుగా తన ముఖాన్ని చేతులతో తాకడం లేదు. వైట్ హౌస్‌లో బుధవారం జరిగిన ఎయిర్‌లైన్స్ ఎగ్జిక్యూటివ్‌లతో జరిగిన సమావేశంలో ట్రంపే స్వయంగా ఈ విషయాన్ని చెప్పారు. సమావేశంలో వైట్‌హౌస్ కరోనా వైరస్ రెస్పాన్స్ కోఆర్డినేటర్ బిర్క్స్ మాట్లాడుతూ.. కరోనాను అడ్డుకోవాలంటే తరచూ చేతులు కడుక్కోవాలని, చేతులతో ముఖాన్ని తాకవద్దని చెప్పారు. దీనిపై ట్రంప్ స్పందిస్తూ పై విధంగా స్పందించారు. ముఖాన్ని చేతులతో తాకడాన్ని మిస్ అవుతున్నానని చెప్పారు. అయితే ఇటీవల ట్రంప్ చేతులతో తన ముఖాన్ని తాకిన ఫొటోలు, వీడియోలను చాలామంది సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ చేస్తున్నారు.

## తెలంగాణలో ఆ ఇద్దరికీ నెగటివ్

హైదరాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణకు భారీ ఊరట! రాష్ట్రం నుంచి పంపించిన రెండు కరోనా వైరస్ నమూనాల ఫలితాలు నెగెటివ్ వచ్చాయి. ఆ రెండు శాంపిల్స్‌లో కరోనా వైరస్ లేదని పుణె వైరాలజీ ల్యాబ్ గురువారం నివేదిక ఇచ్చింది. దాంతో, ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగంతోపాటు ప్రజల్లో నెలకొన్న ఉత్కంఠ వీడింది. తొలుత, 24 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు కరోనా పాజిటివ్ వచ్చిన విషయం తెలిసిందే. అతడు చికిత్స పొందిన ఆస్పత్రిలో శానిటేషన్ విధులు నిర్వహించిన 36 ఏళ్ల మహిళకు కరోనా లక్షణాలు కనిపించాయి. ఆమె నమూనాల్లో తీవ్ర వైరల్ లోడ్ ఉన్నట్లు కేంద్రం బుధవారం ప్రకటించింది. ఇటలీ నుంచి వచ్చిన 30 ఏళ్ల ఐటీ మహిళా ఉద్యోగికి కూడా కరోనా పాజిటివ్ వచ్చినట్లు తీవ్ర ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. ఆమె శాంపిల్స్‌లో కూడా గురువారం నెగెటివ్ వచ్చినట్లు తేలింది. దీంతో, తెలంగాణలో ప్రస్తుతం ఒకే పాజిటివ్ కేసు ఉంది.

## కువైత్‌లో కడప, చిత్తూరు వాసుల విలవిల

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

కరోనా మహమ్మారితో కువైత్‌లోని వ్యాపారాలన్నీ ఒక్క వారంలోనే అతలాకుతలం కావడంతో, దానిపై ఆధారపడ్డ ప్రవాసాంధ్ర ఉద్యోగులు అనేక మంది వీధిన పడే పరిస్థితి దాపురిస్తోంది. కువైత్‌లో పని చేస్తున్న భారతీయుల్లో కడప, చిత్తూరు జిల్లాల వారే ఎక్కువగా ఉండగా, వీరిలో అత్యధికులు చిన్నాచితకా ఉద్యోగాలు చేస్తున్నారు. కువైత్‌లో ఇప్పటివరకు 58 మందికి కరోనా సోకినట్లు నిర్ధారణయింది. దీంతో వీధుల్లో జనసందడి తగ్గి వ్యాపారాలన్నీ తగ్గు ముఖం పట్టడంతో తెలుగువారి ఉపాధికి గడ్డు పరిస్థితి ఏర్పడింది. ఇదే పరిస్థితి కొనసాగితే, వీరికి వేతనాలు అందడమూ కష్టమవుతుంది. దీంతో స్వదేశంలోని కుటుంబసభ్యులకు కష్టకాలం రానుంది. ప్రత్యేకించి ప్రజలు బయటి ఆహారాన్ని తగ్గించడంతో ఈ రంగంపై ఆధారపడ్డ తెలుగువారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వివిధ రెస్టారెంట్ల నుంచి తినుబండారాలను అరబ్బుల ఇళ్లకు డెలివరీ చేస్తున్న వారిలో అత్యధికులు తెలుగు డ్రైవర్లు కాగా, గత కొన్ని రోజుల నుంచి వీరికి పని లేదు.

## అనుమానితులు 13 మంది

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు, విజయవాడలో 104 కాల్‌సెంటర్‌ను శుక్రవారం నాటికి అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ కాల్‌సెంటర్ సిబ్బంది అనుమానితులకు సూలహాలు, సూచనలు అందిస్తారు. ఢిల్లీలో ఈనెల 6న జరిగే శిక్షణ కార్యక్రమానికి ఆడిషనల్ డైరెక్టర్ సావిత్రి, డీఎంఈ అధికారి నీలిమ, గుంటూరు మైక్రోబయాలజిస్ట్ ప్రశాంతి, కరోనా నోడల్ అధికారి రాంబాబు ఢిల్లీ వెళ్లారు. రాష్ట్రంలో ఈనెల 9న నిర్వహించే కార్యక్రమంలో మిగిలిన అధికారులకు వారు శిక్షణ ఇస్తారు. కాగా, దేశంలో వివిధ విమానాశ్రయాల్లో దిగి, ఏపీకి వస్తున్నవారి వివరాలు తమకు పంపించాలని కోరుతూ ఇమిగ్రేషన్ బ్యూరోకు రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లేఖ రాశారు. విశాఖపట్నం, గంగవరం, కృష్ణపట్నం పోర్టుల్లో కరోనా బాధితులను గుర్తించేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వారికి అక్కడే స్ర్కీనింగ్ నిర్వహించి అనుమానితులను ఆస్పత్రులకు తరలిస్తున్నారు.



విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో మాస్కులతో సిబ్బంది

### రాష్ట్రస్థాయి కమిటీ నియామకం

కరోనా కేసుల పర్యవేక్షణ, నివారణ, నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం రాష్ట్రస్థాయి కమిటీని నియమించింది. ఈ కమిటీకి ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా, ఏపీ ఎంఎస్ఐడీసీ ఎండీ మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. జిల్లాస్థాయిలో కూడా కలెక్టర్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసేందుకు ఆరోగ్యశాఖ సన్నాహాలు చేస్తోంది.

### నిధుల కొరతతో తిప్పలు

కరోనా నియంత్రణకు ఆరోగ్యశాఖ అధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. పాజిటివ్ కేసులు వస్తే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ప్రతి ఒక్కరినీ వేధిస్తోంది. ఈ శాఖలో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఎన్‌హెచ్ఎంలో ఉన్న కాస్త నిధులతో నెట్టుకొస్తున్నారు. కరోనాపై నేడు నిర్వహించనున్న సమీక్షలో ఆరోగ్యశాఖ ఆర్థిక పరిస్థితిపై అధికారులు సీఎంకు వివరించనున్నారు. కాగా, కరోనా నియంత్రణకు ఆర్థికశాఖ నుంచి రూపాయి కూడా అందలేదు. రోగుల నుంచి సేకరించిన నమూనాలు హైదరాబాద్‌కు పంపడానికి కూడా నిధులు విడుదల చేయడం లేదు. ఇక రాష్ట్రంలో తొలి విడతలో 45 ఐసోలేషన్ గదుల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఒక్కోదానికి రూ.7లక్షలు అవసరమని అంచనా వేశారు. వీటి నిర్మాణాన్ని ఒక కంపెనీకి అప్పగించారు. ఇప్పుడు ఆ నిధులు ఎక్కడ నుంచి విడుదల చేస్తారో కూడా తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

### కుప్పంలో కలకలం

చిత్తూరు జిల్లా కుప్పంలో కరోనా కలకలం సృష్టిస్తోంది. అడవిబూదుగూరు, మల్లానూరు పంచాయతీలకు చెందిన ఏడుగురు పురుషులు కంబోడియా వెళ్లారు. అక్కడినుంచి గత నెల చివరిలో సొంత గ్రామాలకు చేరుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్యాధికారులు వీరికి వైద్యపరీక్షలు జరిపించి, కరోనా లక్షణాలు లేవని నిర్ధారించుకున్నారు. తర్వాత వారిని గ్రామాలకు పంపించేశారు. అయితే వారిని ఇళ్ల బయటికి రాకుండా పరిశీలనలో పెట్టారు. వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించడానికి సిబ్బంది రోజూ వస్తుండడంతో ఆ ఏడుగురికీ కరోనా సోకిందన్న వదంతులు వ్యాపించాయి. అయితే వారిని కేవలం ముందు జాగ్రత్తగానే అబ్జర్వేషన్‌లో పెట్టామని, ప్రజలెవ్వరూ భయపడాల్సిన అవసరం లేదని జిల్లా వైద్య శాఖాధికారి పెంచలయ్య పేర్కొన్నారు.

### బెజవాడలో మరో ఇద్దరు?

విజయవాడలో మరో రెండు కరోనా అనుమానిత కేసులు నమోదైనట్లు తెలిసింది. ఇక్కడ పనిచేసే రైల్వే ఉద్యోగి భార్య తీవ్రమైన దగ్గు, జలుబుతో బాధపడుతుండటంతో రైల్వే ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఆమెకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. కరోనా అనుమానంతో నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి రిఫర్ చేసినట్టు తెలిసింది. అలాగే ఇటీవల జర్మనీకి వెళ్లొచ్చిన విజయవాడ వాసి ఒకరు తనకు కరోనా సోకిందనే అనుమానంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా.. వైద్యులు అతని నమూనాలను పరీక్షల నిమిత్తం ఢిల్లీకి పంపినట్లు సమాచారం. దీనిపై స్పందించడానికి రైల్వే ఆస్పత్రి వర్గాలు కూడా నిరాకరిస్తున్నాయి.

### మందుల ధరలు పెంచితే చర్యలు

గుంటూరు(మెడికల్): కరోనా వైరస్ సాకుగా చూపుతూ ఔషధ ధరలు పెంచి విక్రయించినా, అక్రమంగా నిల్వ ఉంచినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఔషధ పరిపాలనశాఖ డైరెక్టర్ జనరల్ ఎ.మల్లికార్జున హెచ్చరించారు. కరోనా వల్ల మందుల లభ్యత తగ్గిందని వదంతులు సృష్టిస్తూ కొందరు వ్యాపారులు ధరలు పెంచి విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. చైనా నుంచి దిగుమతి అవుతున్న కొన్నిరకాల మందుల ముడిసరుకు, దాని తయారీకి అవసరమైన కీ స్టార్టింగ్ మెటీరియల్ లభించడం లేదని చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. మందులను అధిక ధరకు విక్రయిస్తున్నట్లు, భారీగా అక్రమ నిల్వలు ఉంచినట్లు గుర్తిస్తే స్థానిక డ్రగ్ ఇన్‌స్పెక్టర్లకు, సెంట్రల్ మానిటరింగ్ యూనిట్‌కు (0863-2339246, 94901 53357) సమాచారం ఇవ్వాలన్నారు.

### ఆర్థిక వ్యవస్థపై కరోనా ప్రభావం: గల్లా

న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థపై కరోనా వైరస్ చూపే ప్రభావంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ అన్నారు. వైరస్‌పై లోక్‌సభలో మాట్లాడుతూ... కరోనా వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడుతుందంటున్నారని, జీడీపీ వృద్ధి 1-2శాతం వరకు తగ్గవచ్చనని అంచనా వేస్తున్నారని తెలిపారు. అదే జరిగితే 5శాతం కూడా లేని జీడీపీ వృద్ధి 3శాతానికి పడిపోతుందని హెచ్చరించారు. అప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థ ఏం కావాలని ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా వ్యాప్తిని నియంత్రించడానికి వ్యక్తిగత పరిశుభ్రత, అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని గల్లా సూచించారు.

### ఆస్ట్రేలియా నుంచి వచ్చా.. ఆరోగ్యంగా ఉన్నా

చిత్తూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని తన సొంత ఇంటిలో కుటుంబ సభ్యులతో హాయిగా, ఆరోగ్యంగా ఉన్నానని కుండ్ల గిరిధర్ చెప్పారు. "చైనా నుంచి వచ్చిన టెకీ కోసం గాలింపు" శీర్షికన "ఆంధ్రజ్యోతి" ప్రధాన సంచికలో గురువారం వచ్చిన వార్తపై ఆయన స్పందించారు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్న తాను కంపెనీ ఆదేశాలపై ఆస్ట్రేలియా వెళ్లానన్నారు. రెండు వారాల సెలవుపై గతనెల 25న మలేసియా మీదుగా బెంగళూరు వచ్చానని చెప్పారు. విమానాశ్రయంలో వైద్య పరీక్షల అనంతరం నేరుగా చిత్తూరు జిల్లాకు వెళ్లానని తెలిపారు.

## విదేశీ యాత్రలపై పడగ

- కరోనా భయంతో విహార యాత్ర బుకింగ్‌లు రద్దు

కాకినాడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): విదేశీ పర్యటనలపై కరోనా పెనుప్రభావం చూపుతోంది. వేసవికి సరదాగా విహారయాత్రకు వెళ్లాలనుకునే వారిని బెంబేలెత్తిస్తోంది. టూర్ల బుకింగ్‌లను పర్యాటకులు రద్దు చేసుకుంటున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో కొత్త బుకింగ్‌లు 70శాతం పైగా పడిపోయాయి. వేసవి సీజన్‌లో విదేశీ యాత్రలకు మార్చి, ఏప్రిల్‌లలో అడ్వాన్స్ బుకింగ్‌లు ప్రారంభమవుతాయి. ఈ రెండు నెలల్లో జిల్లా నుంచి ఏటా వందల సంఖ్యలో పర్యాటకులు బ్యాంకాక్, మలేసియా, సింగపూర్, శ్రీలంక, పుకెట్, బాలీ, టర్కీ, యూరోపియన్ దేశాలకు వెళ్లేవారు. టిక్కెట్లు అడ్వాన్స్‌గా బుక్ చేసుకునేవారు. కానీ కరోనా భయంతో వారంతా ప్రయాణాలు రద్దు చేసుకుంటున్నారు. 70శాతం బుకింగ్‌లు పడిపోయాయని పర్యాటక సంస్థల ప్రతినిధులు వివరించారు. సుమారు 30 దేశాలకు పర్యాటకులను పంపిస్తామని, కానీ ఈసారి సీజన్ ప్రారంభం అయినా కనీసం బుకింగ్‌లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఆన్‌లైన్‌లోనూ బుకింగ్‌లు పూర్తిగా పడిపోయాయి.

## రైల్వేకు కరోనా దెబ్బ!

- రిజర్వేషన్లు రద్దు చేసుకుంటున్న ప్రయాణికులు

గుంటూరు/భీమవరం క్రైం/విశాఖపట్నం, మార్చి 5 (ఆం ధ్రజ్యోతి): కరోనా వైరస్ ప్రభావం రైల్వేపై పడింది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు వెళ్లే వారి సం ఖ్య భారీగా తగ్గుతోంది. ముందుగా టికెట్లు బుక్ చేసుకున్నవారు పెద్దసంఖ్యలో తమ ప్రయాణాలు విరమించుకుంటున్నారు. గుంటూరు మీదగా రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లపై కరోనా ప్రభావం చూపిస్తోంది. కరోనా ప్రభావంతో ప్రజలు హైదరాబాద్ వెళ్లేందుకు వెనకడుగు వేస్తుండటమే ఈ పరిస్థితికి కారణమని రైల్వేవర్గాలు చెబుతున్నాయి. భీమవరం టౌన్ రైల్వేస్టేషన్‌లో గురువారం ఒక్కరోజే 60 మంది రిజర్వేషన్లు రద్దు చేసుకున్నారు. కాగా, రైళ్లలో ప్రయాణించేవారికి కరోనా వైరస్‌పై ఈ నెల 6నుంచి ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని భీమవరం టౌ న్ రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ ఎన్.దేవకుమార్ తెలిపారు. ప్రయాణికులకు మాస్కులు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే దు రంతో ఎక్స్‌ప్రెస్‌లో గురువారం చాలా బెర్తులు ఖాళీగా ఉ న్నాయి. ఎక్కిన కొద్దిమంది ప్రయాణికులు కూడా ముఖాలకు మాస్కులు కట్టుకొని కనిపించారు. రోడ్డు రవాణాశాఖపై కరోనా ప్రభావం పడింది. దూరప్రాంతాలకు వెళ్లే ఏసీ సర్వీసుల్లో ఆక్యుపెన్సీ సగానికి పడిపోయింది.

### విశాఖకు చైనా నౌక పోర్టు సిబ్బంది బెంబేలు

విశాఖపట్నం: చైనా నుంచి బయలుదేరిన ఫార్చ్యూన్ ఫ్రెండ్ అనే నౌక విశాఖ పోర్టుకు చేరుకుంది. ఇక్కడికి రావడానికి నెల క్రితమే అనుమతి తీసుకున్న ఈ నౌకలో ఒడిశాకు చెందిన వ్యాపారులు పెట్ కోక్‌ను దిగుమతి చేసుకున్నారు. గురువారం సాయంత్రం అది విశాఖ చేరుకోగా బెర్తింగ్ అనుమతి కోసం ఆన్‌రోడ్స్(సముద్రంలో అవుటర్ హార్బర్)లో వేచి ఉంది. దీనికి కస్టమ్స్ క్లియరెన్స్ లభించాక బెర్తు కేటాయించి పోర్టులోకి అనుమతిస్తారు. ఈ నౌకలో 17మంది చైనీయులు, ఐదుగురు బర్మా దేశీయులు ఉన్నట్టు సమాచారం. వీరిలో ఎవరికైనా అనారోగ్యం ఉంటే నౌక కెప్టెన్ ముందుగానే తెలియజేస్తారు. కరోనా పరీక్షలు ప్రారంభించిన తరువాత ఏదైనా నౌక వస్తే... పోర్టు వైద్యాధికారుల బృందం వెళ్లి అందులో అందరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తోంది.

## రోడ్లు, బస్సులు, రైళ్లు ఖాళీ



నిర్మానుష్యంగా మారిన ఎల్లప్పుడూ రద్దీగా ఉండే 'రహేజా టవర్' ప్రాంతం



వెలవెలబోతున్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్

ఏటా సంక్రాంతి, దసరా పండుగలప్పుడు హైదరాబాద్‌లోని రోడ్లన్నీ ఖాళీగా కనిపిస్తుంటాయి. మరీ ఆ స్థాయిలో కాదుగానీ.. బుధ, గురువారాల్లో రాజధాని నగరంలో రోడ్లపై రద్దీ గణనీయంగా తగ్గింది! నగరవాసికి కరోనా పాజిటివ్ రావడమే ఇందుకు కారణం! నిత్యం రద్దీగా ఉండే రహదారులు, షాపింగ్ మాళ్లు, సూపర్‌మార్కెట్లు, హోటళ్లు, సినిమా థియేటర్లు వెలవెలబోతున్నాయి. సూపర్‌మార్కెట్లు, మాల్స్‌లో బిల్లింగ్ సెక్షన్ల వద్ద కొనుగోలుదారులు బారులు తీరుతున్న దృశ్యాలు కనిపించట్లేదు. బస్సుల్లో సైతం ప్రయాణికులు చాలా పల్చగా కనిపిస్తున్నారు. నిత్యం కిటకిటలాడే రైళ్లు, రైల్వే స్టేషన్లు కూడా 2-3 రోజులుగా కాస్త పలచగా కనిపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే సైబరాబాద్ ఐటీ కారిడార్ నిర్మానుష్యంగా మారింది. ప్రముఖ ఐటీ కంపెనీలు టీసీఎస్, డెలైట్, ఇంటెల్ వంటి సంస్థలు తమ ఉద్యోగులకు 'వర్క్ ఫ్రం హోం' వెలుసుబాటు ఇవ్వడంతో వారంతా ఇంటి నుంచే విధులు నిర్వర్తిస్తున్నారు.

## స్వీయ జాగ్రత్తలతోనే కరోనాకు చెక్

- 'ఆంధ్రజ్యోతి'తో రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ కె.రాంబాబు

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం)

ఏ వ్యాధి అయినా లక్షణాలు కనిపిస్తే నియంత్రణ సులభమవుతుంది. అదే అంతర్లీనంగా ఉంటూ, వ్యాధి వ్యాప్తికి కారణమైతే అడ్డుకట్ట వేయడం చాలా కష్టమవుతుంది. ప్రస్తుతం కరోనా వైరస్ వ్యాప్తికి అదే కారణమంటున్నారు రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ కె.రాంబాబు. కరోనా బారిన పడినప్పటికీ సదరు వ్యక్తిలో లక్షణాలు బయటపడేందుకు కనీసం 14 రోజుల సమయం పడుతుందని, ఈ సమయంలోనే నిశ్శబ్దంగా మరొకరికి వ్యాప్తి చెందుతుందని ఆయన అంటున్నారు. ఈ నేపథ్యంలో వైరస్ లక్షణాలు, వ్యాపించకుండా తీసుకుంటున్న చర్యలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

### విదేశాల నుంచి వచ్చే వారితోనే..

ప్రతిరోజు మన దేశానికి అనేక దేశాల నుంచి ప్రయాణికులు వస్తుంటారు. వీరంతా వేర్వేరు దేశాల వ్యక్తులతో కలిసి ప్రయాణిస్తుంటారు. ఈ ప్రయాణంలో ఎక్కడైనా వైరస్ బారినపడిన వ్యక్తి తారసపడితే చుట్టుపక్కల వారికీ వచ్చే అవకాశముంది. ప్రస్తుతం 80కిపైగా దేశాల్లో ఈ వైరస్ వ్యాపించి ఉంది.

### 14 రోజుల తర్వాతే లక్షణాలు..

సాధారణంగా ఏదైనా వైరస్ బారినపడినప్పుడు దాని లక్షణాలు ఒకటి రెండు రోజుల్లోనే బయటపడుతుంటాయి. కానీ, కరోనా బారినపడితే ఆ లక్షణాలు 14 రోజుల తరువాత గానీ బయటపడడం లేదు. దీన్ని ఇంక్యుబేషన్ పీరియడ్ అంటాం. ఈ పీరియడ్‌లో ఆ వ్యక్తి అనేక ప్రాంతాల్లో తిరిగి ఎంతోమందికి వైరస్‌ను అంటిస్తాడు. ప్రస్తుతం వైద్య రంగాన్ని సవాల్ చేసే రీతిలో వైరస్ వ్యాప్తి చెందడానికి ప్రధాన కారణం ఇదే.

### గాలిలో వ్యాప్తి చెందదు..

కరోనా వైరస్ గాలిలో వ్యాప్తి చెందదు. వస్తువులు తాకడం, కరచాలనం తదితరాల ద్వారా వ్యాప్తి చెందుతుంది. కరోనా బాధితుడు దగ్గినప్పుడు అతని నోటి నుంచి బయటకు వచ్చిన వైరస్ నేలపై పడితే 4-5 గంటలు, దుస్తుల మీద పడితే 9, టేబుల్‌పై పడితే 8-9, ఎస్కలేటర్ మీద పది గంటలపాటు బతుకుతుంది. ఆ సమయంలో మరో వ్యక్తి ఆ వస్తువులపై చేయి వేస్తే వైరస్ వ్యాప్తి చెందుతుంది. అధిక శాతం వైరస్ చేతుల ద్వారానే వ్యాప్తి చెందే అవకాశమున్నందున శానిటైజర్‌ను అందుబాటులో ఉంచుకొని ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకోవడం మంచిది. సాధారణంగా ఏ ఇన్‌ఫ్లూయెంజా వైరస్ అయినా 28-30 డిగ్రీలు దాటితే చనిపోయే అవకాశముంది. అయితే కరోనా వైరస్ ఏవిధంగా మారుతుందో అర్థం కావడం లేదు. ఇతర వైరస్‌ల మాదిరిగానే ఇదీ వేడిలో బతికే అవకాశం లేదనే భావిస్తున్నాం. కరోనా లక్షణాల అనుమానం ఉంటే వైద్యులను సంప్రదించాలి. విశాఖలో ఒక్క పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదు. బుధవారం ఐదుగురి నుంచి సేకరించిన నమూనాల ఫలితాలు రావాలి. స్వీయ జాగ్రత్తలతోనే కరోనా వైరస్‌ను నియంత్రించే అవకాశముంది. ముఖానికి మాస్క్ ధరించడం, బయట ఉమ్మకుండా జాగ్రత్త పడడం, వీలైనంత వరకు జన సమూహాల్లోకి వెళ్లకుండా ఉండడం, జ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు వేధిస్తే వైద్యులను సంప్రదించడం, చేతులు తరచుగా శుభ్రం చేసుకోవడం, బయటకు వెళ్లి వచ్చిన తరువాత దుస్తులను వాషింగ్‌మెషీన్‌లో వేయడం, ఎండకు ఎక్కువగా ఎక్స్‌పోజ్ కావడం, చల్లని పానీయాలకు దూరంగా ఉండడం, వేడి నీరు, ఆహారం తీసుకోవడం చేయాలి. కరోనా బారిన పడితే మరణమే తప్ప చికిత్స లేదన్న వాదనలో నిజం లేదు. ఎవరూ అటువంటి భయాందోళనలు చెందవద్దు. ఇది కూడా ఒక రకమైన ఫ్లూ వైరస్ మాత్రమే. సకాలంలో చికిత్స అందిస్తే ప్రమాదం ఉండదు.

### ఆన్‌లైన్‌లో కొనే వస్తువులతో రాదు..

ఆన్‌లైన్ కొనుగోళ్ల వల్ల ఆయా వస్తువులతో వైరస్ వ్యాప్తి చెందే అవకాశముందన్న ప్రచారాన్ని విశ్వసించాల్సిన అవసరం లేదు. బాహ్య ప్రపంచంలో వైరస్ రోజుల తరబడి బతికే అవకాశం లేదు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇతర దేశాల సైట్ల నుంచి కొనుగోలు చేయకపోవడమే మంచిది.

### ఈ లక్షణాలుంటే అనుమానించాల్సిందే

జ్వరం, తలనొప్పి, దగ్గు, గొంతు నొప్పి, ముక్కు కారడం, ఆయాసం, విరేచనాలు, వాంతులు వంటి లక్షణాలుంటే అనుమానించాల్సిందే. వృద్ధులు, బాలింతలు, చిన్నారులు, గర్భిణులు, ఆస్తమా, కాలేయ వ్యాధి, కేన్సర్, హెచ్ఐవీతో బాధపడే రోగులు మరింత జాగ్రత్తగా ఉండాలి. వీరిలో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది కాబట్టి వేగంగా వైరస్ బారినపడే అవకాశముంది.

శ్రీలంక X వెస్టిండీస్
రెండో టీ-20
రాత్రి 7 గం. నుంచి
సోనీ సిక్స్‌లో...

బంగ్లాదేశ్ X జింబాబ్వే
మూడో వన్డే
మ. 1.30 నుంచి
స్టార్‌స్పోర్ట్స్ సెలెక్ట్-1లో



టీ20 ప్రపంచకప్‌లో తలపడిన ఐదు సార్లూ ఇంగ్లండ్‌పై గెలిచింది లేదు.. ఇక ఈసారి ఏం జరుగుతుందో అని సెమీస్‌కు ముందు భారత అభిమానుల్లో ఒకటే టెన్షన్.. కానీ మరేం ఫర్వాలేదంటూ వరుణుడి రూపంలో అవకాశం కలిసివచ్చింది. అంచనాలకు మించి గ్రూప్ దశను అజేయంగా ముగించడం హర్మన్‌ప్రీత్ సేనకు వరమైంది. ఊహించినట్టుగానే భారీ వర్షంతో మ్యాచ్ రద్దు కాగా.. రూల్స్ ప్రకారం ఒక్క మ్యాచ్ కూడా ఓడని భారత్ ఫైనల్లోకి ప్రవేశించింది. అటు మనకన్నా రన్‌రేట్ మెరుగ్గానే ఉన్నా ఒక్క ఓటమి ఇంగ్లండ్ జట్టుకు శాపంగా మారి టోర్నీ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. ఇక రెండో సెమీస్‌లో గెలిచిన ఆసీస్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది.

## అనుష్క ట్వీట్



### గొప్ప మ్యాచ్ చూడాలనుకున్నా

**న్యూఢిల్లీ:** తొలిసారి టీ20 వరల్డ్‌కప్ ఫైనల్‌కు చేరి చరిత్ర సృష్టించిన భారత మహిళల జట్టును టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ భార్య అనుష్క శర్మ అభినందించింది. మహిళల టీ20 వరల్డ్‌కప్‌ను దగ్గరిగా గమనిస్తున్న ఆమె..గురువారం భారత్-ఇంగ్లండ్ మధ్య జరగాల్సిన సెమీఫైనల్ వర్షంతో రద్దు కావడంపట్ల నిరాశ చెందింది. 'ఓ గొప్ప మ్యాచ్ చూడాలనుకున్న మనల్ని వరుణ దేవుడు అడ్డుకున్నాడు. అయితే మనం ఈ అవకాశాన్ని రెండుచేతులా అందిపుచ్చుకుందాం. ఆదివారం వరకు వేచి ఉండలేకపోతున్నా' అని అనుష్క ట్వీట్ చేసింది.



హర్మన్ బృందం సెల్ఫీ

## హర్మన్‌కు డబుల్ ధమాకా

**సిడ్నీ:** భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు గురువారం రెట్టింపు సంతోషం లభించింది. తొలిసారిగా జట్టు టీ20 ప్రపంచకప్ ఫైనల్‌కు చేరడం ఒకటైతే.. కౌర్ మ్యాచ్‌ను తిలకించేందుకు ఆమె తల్లిదండ్రులు మొదటిసారిగా స్టేడియానికి రావడం రెండోది. ఇంగ్లండ్‌తో సెమీస్‌ను చూసేందుకు వారు భారత్ నుంచి ఆసీస్‌కు చేరుకున్నారు. 'నా తల్లిదండ్రులు నేను క్రికెట్ ఆడుతుండగా చూడడం ఇదే తొలిసారి. నేను స్కూల్ క్రికెట్ ఆడే సమయంలో మా నాన్న అక్కడ ఉన్నారు. కానీ మా అమ్మ మాత్రం నేను బ్యాట్ పట్టుకోగా ఎన్నడూ ప్రత్యక్షంగా చూళ్లేదు. అయితే వర్షం కారణంగా వారికి నిరాశే కలిగింది. ఫైనల్లో వారి కోరిక నెరవేరనుంది' అని హర్మన్‌ప్రీత్ తెలిపింది.

# ఆడకుండానే ఫైనల్‌కు

### ఫైనల్ చేరిన భారత్
### ఇంగ్లండ్‌తో సెమీస్ వర్షార్పణం
### ఆస్ట్రేలియాతో అమీతుమీ
### మహిళల టీ20 ప్రపంచకప్

**సిడ్నీ:** మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు మొదటిసారిగా ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం పటిష్ఠ ఇంగ్లండ్‌తో జరగాల్సిన తొలి సెమీస్ మ్యాచ్ టాస్ కూడా వేయకుండానే వర్షంతో రద్దయింది. ఈ మ్యాచ్‌కు రిజర్వ్‌డే లేనందున నిబంధనల ప్రకారం గ్రూప్ టాపర్‌గా నిలిచిన జట్టును విజేతగా ప్రకటించారు. ఫలితంగా హర్మన్‌ప్రీత్ సేన తమ కెరీర్‌లోనే తొలిసారిగా ఈ మెగా ఈవెంట్ టైటిల్ పోరుకు అర్హత సాధించినట్టయింది. గతంలో నాలుగు సార్లు భారత జట్టు సెమీస్‌కు చేరినా నిరాశే ఎదురైంది. గ్రూప్ దశలో భారత మహిళలు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, బంగ్లాదేశ్, శ్రీలంక జట్లపై గెలిచారు. 2018 టోర్నీలోనూ సెమీస్ చేరిన భారత జట్టు ఇంగ్లండ్ చేతిలోనే ఓడి నిష్క్రమించగా, ఈసారి ఇలా బదులు తీర్చుకున్నట్టయింది. మరోవైపు గురువారమే జరిగిన రెండో సెమీస్‌లో దక్షిణాఫ్రికాను ఓడించిన ఆస్ట్రేలియా వరుసగా ఆరోసారి ఫైనల్లోకి అడుగుపెట్టింది. ఆదివారం జరిగే తుది పోరులో భారత్-ఆసీస్ మధ్య రసవత్తర పోరు ఖాయంగా కనిపిస్తోంది.

### ఫైనల్ చేరడం ఇలా కాదు..

లీగ్ దశను అద్భుతంగా ఆడిన భారత జట్టు చివరకు వర్షం కారణంగా ఫైనల్‌కు చేరడంపై అటు క్రికెట్ విశ్లేషకుల నుంచి అభిమానుల వరకు సోషల్ మీడియాలో మిశ్రమంగా స్పందించారు. 'ఫైనల్‌కు ఇలా చేరడం ఆమోదయోగ్యం కాకపోయినా టేబుల్ టాపర్‌గా నిలిచిన భారత్‌కు ఇది రివార్డు. ఆసీస్, కివీస్‌పై గెలవడం ప్రత్యేకం' అని హర్షా భోగ్లే ట్వీట్ చేయగా.. 'మ్యాచ్ జరిగితే గొప్పగా ఉండేది. అయినా ఫైనల్‌కు చేరిన భారత జట్టుకు శుభాకాంక్షలు. వరుసగా 4 మ్యాచ్‌లు గెలిచినందుకు ఇది బహుమతి' అని లక్ష్మణ్ స్పందించాడు. అలాగే భారత్ తుదిపోరుకు అర్హత సాధించినందుకు కెప్టెన్ కోహ్లీ, సెహ్వాగ్ సంతోషం వ్యక్తం చేశారు. ఫైనల్లోనూ గెలవాలని ఆకాంక్షించారు. ఇక ఇంతపెద్ద టోర్నీలో సెమీస్‌కు రిజర్వ్ డే లేకపోవడం దారుణమని, ఇది క్రికెటర్ల జీవితకాల కలను భగ్నంచేయడమేనని ఆసీస్ మాజీ ఆటగాడు మార్క్ వా విమర్శించాడు.

### కన్నీటి పర్యంతమైన ఇంగ్లండ్ అమ్మాయిలు

భారత్ సంబరాలు ఎలా ఉన్నా అటు ఇంగ్లండ్ అమ్మాయిలు మాత్రం ఈ 'ఓటమి'ని తట్టుకోలేకపోతున్నారు. 2018 టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన ఈ జట్టు భారత్‌ను ఎదుర్కొనేందుకు పక్కా ప్రణాళికతో సిద్ధమైంది. కచ్చితంగా ఓడిస్తామనే ధీమాతో ఉన్నా ఊహించినట్టుగానే భారీ వర్షం కురవడం వారి ఆశలపై నీళ్లు కుమ్మరించినట్టయింది. ఉదయం నుంచే వరుణుడు తడాఖా చూపడంతో టాస్ కూడా వీలు కాలేదు. తెరిపినిచ్చే అవకాశం కూడా లేకపోవడంతో అంపైర్లు మ్యాచ్ రద్దు వైపే మొగ్గు చూపారు. దీంతో పలువురు ఇంగ్లండ్ ప్లేయర్స్ కన్నీటి పర్యంతమయ్యారు.



ఇంగ్లండ్ కెప్టెన్ హీథర్‌నైట్‌తో హర్మన్

### నిబంధనలు మార్చాలి

చాలా నిరాశగా ఉంది. ప్రపంచకప్‌ను ఇలా ముగిస్తామనుకోలేదు. రిజర్వ్ డే లేకుండా, మ్యాచ్ ఆడకుండానే ఓడిపోవడం దారుణం. మా తొలి మ్యాచ్‌ను దక్షిణాఫ్రికా చేతిలో ఓడడంతో మూల్యం చెల్లించుకున్నాం. అయితే నిబంధనలు అలా ఉన్నాయి కాబట్టి చేసేదేమీ లేదు. కాకపోతే భవిష్యత్‌లోనైనా ఇలాంటి పరిస్థితి మరో జట్టుకు రాకుండా రిజర్వ్ డే కేటాయిస్తే బావుంటుంది. కేవలం వర్షం కారణంగా ఒక జట్టు ఇలా టోర్నీ నుంచి నిష్క్రమించడం సరికాదు.

*- హీథర్ నైట్ (ఇంగ్లండ్ కెప్టెన్)*

### సంతోషంగా ఉంది

తొలిసారి ఫైనల్‌కు చేరడంతో జట్టు చాలా సంతోషంగా ఉంది. దురదృష్టవశాత్తూ మేం మ్యాచ్ ఆడలేకపోయాం. అయితే ఎవరైనా నిబంధనలను పాటించాల్సిందే. వచ్చే టోర్నీల్లో నాకౌట్ మ్యాచ్‌లకు రిజర్వ్‌డే ఉంటుందని ఆశిస్తున్నా. కానీ తొలి మ్యాచ్ నుంచే మేం వ్యూహం ప్రకారం ఆడాం. ఒకవేళ సెమీస్ వీలు కాకపోతే ఎలా అనే ఆలోచనతో గ్రూప్ దశను అజేయంగా ముగించాలని భావించాం. ఇందుకు మా ప్లేయర్స్‌ను అభినందించాల్సిందే.

*- హర్మన్‌ప్రీత్ కౌర్ (భారత కెప్టెన్)*

## ఉత్తమ ఆటను ప్రదర్శించండి

### అమ్మాయిల జట్టుకు సచిన్ సలహా



**ముంబై:** ఒత్తిడిని దరిచేరనీయకుండా ఆత్మవిశ్వాసంతో ఫైనల్ మ్యాచ్ ఆడాలని బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ భారత మహిళల జట్టుకు సూచించాడు. 'స్వేచ్ఛగా ఆడి ఉత్తమ ప్రదర్శన ఇవ్వండి. ఇదే మహిళల జట్టుకు నా సందేశం. ఎలాంటి ఒత్తిడినీ దరిచేరనీయకండి. బయటి విషయాల గురించి ఏమాత్రం పట్టించుకోకుండా అంతా కలిసికట్టుగా ఉంటే చాలు. మహిళల జట్టు ప్రదర్శనను నేను గమనిస్తున్నాను. ఇప్పటికే వారంతా యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. టోర్నీ ఆరంభానికి ముందు నేను పలువురు మహిళా క్రికెటర్లను కలిశా. ట్రోఫీని భారత్‌కు తీసుకొస్తే గొప్పగా ఉంటుందని చెప్పా' అని సచిన్ గుర్తు చేసుకున్నాడు.

## రహానె.. సెక్యూరిటీ గార్డులా!



**ముంబై:** న్యూజిలాండ్ పర్యటనలో అజింక్యా రహానె బ్యాటింగ్ తీరును మాజీ చీఫ్ సెలెక్టర్ సందీప్ పాటిల్ తప్పుబట్టాడు. అలాగే చీఫ్ కోచ్ రవిశాస్త్రి, బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్‌పైనా విమర్శలు గుప్పించాడు. 'టెస్టు ఆటగాడిగా ముద్రపడిన రహానె సాంకేతికంగా తాను మంచి బ్యాట్స్‌మన్‌నని నిరూపించుకొనేందుకు ప్రయత్నించినట్టు కనిపించాడు. క్రీజులో అంతసేపు నిలిచినా భారీగా పరుగులు చేయకపోవడం, మరీ రక్షణాత్మకంగా ఆడడం ద్వారా అజింక్యా సెక్యూరిటీ గార్డుని తలపించాడు' అని పాటిల్ వ్యాఖ్యానించాడు. ప్రత్యర్థికి భారత బ్యాట్స్‌మెన్ అలా దాసోహమయ్యేలా ఆడుతుంటే రవిశాస్త్రి, రాథోడ్ ఏంచేస్తున్నారని ప్రశ్నించాడు. 'పరిస్థితిని అర్థం చేసుకోకుండా రహానె బ్యాటింగ్ చేస్తుంటే రవిశాస్త్రి, రాథోడ్ అతడికి మార్గదర్శనం చేయలేకపోయారు. ఒక బ్యాట్స్‌మన్ ఎలా ఆడితే మిగిలిన వారూ అతడిని అనుసరిస్తారు. అలా జరిగితే జట్టు నష్టపోతుంది' అని పాటిల్ అన్నాడు.

## క్వార్టర్స్‌లో మనీష్, ఆశీష్

### ఒలింపిక్ క్వాలిఫయింగ్ బాక్సింగ్



**అమ్మాన్ (జోర్డాన్):** ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ బాక్సింగ్‌లో భారత బాక్సర్లు దూసుకుపోతున్నారు. మనీష్ కౌశిక్ (63 కిలోలు), ఆశీష్‌కుమార్ (75 కి.) క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించారు. గురువారం జరిగిన ప్రీక్వార్టర్‌ఫైనల్లో..ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత మనీష్ 5-0తో చు ఎన్ లాయ్ (తైవాన్)ను చిత్తు చేశాడు. మరో ప్రీక్వార్టర్స్‌లో ఆశీష్ కుమార్ 5-0తో ఒముక్‌బేక్ (కిర్గిస్థాన్)పై విజయం సాధించాడు. క్వార్టర్స్ బౌట్లలో మూడోసీడ్ చింజోరిగ్ బాటార్‌సుఖ్ (మంగోలియా)తో మనీష్, ఇండోనేసియా బాక్సర్ మైకేల్ రొబర్డ్ ముస్కిటాతో ఆశీష్ తలపడతారు. వీరిద్దరూ సెమీఫైనల్‌కు చేరితే టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తారు. మహిళల విభాగంలో భారత్‌కు చెందిన సిమ్రన్‌జీత్ కౌర్ (60 కి.), సాక్షి చౌధరి (57 కి.) ఇప్పటికే క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు.

## ఆసీస్.. వరుసగా ఆరోసారి

### తుది పోరుకు కంగారూలు
### రెండో సెమీస్‌లో దక్షిణాఫ్రికాపై విజయం

**సిడ్నీ:** నాలుగు సార్లు విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా జట్టు తమ స్థాయికి తగ్గ ప్రదర్శనతో చెలరేగింది. గురువారం జరిగిన రెండో సెమీస్‌లో దక్షిణాఫ్రికాపై డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన 5 పరుగుల తేడాతో నెగ్గింది. ఈ విజయంతో ఆసీస్ వరుసగా ఆరోసారి మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఫైనల్లో అడుగుపెట్టింది. సిడ్నీ మైదానంలోనే జరగాల్సిన భారత్-ఇంగ్లండ్ సెమీస్ భారీ వర్షంతో రద్దయింది. రోజంతా వర్షం ఇలాగే కురిస్తే అటు దక్షిణాఫ్రికాకు కూడా అదృష్టం కలిసి వచ్చి ఫైనల్‌కు చేరేది. కానీ తమ పురుషుల జట్టు మాదిరే వీరినీ దురదృష్టం వెంటాడినట్టుంది. ఈ మ్యాచ్ సమయానికి వరుణుడు తెరిపినివ్వడంతో టాస్ గెలిచిన సఫారీలు ఫీల్డింగ్ ఎంచుకున్నారు. దీంతో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. వర్షాన్ని దృష్టిలో ఉంచుకుని ఆసీస్ ధాటిగా ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. కెప్టెన్ మెగ్ లానింగ్ (49), బెత్ మూనీ (28), హీలీ (18) రాణించారు. డిక్లెర్క్‌కు మూడు వికెట్లు దక్కాయి.

**సంక్షిప్త స్కోర్లు**
**ఆస్ట్రేలియా:** 20 ఓవర్లలో 134/5 (లానింగ్ 49; డిక్లెర్క్ 3/19).
**దక్షిణాఫ్రికా:** 13 ఓవర్లలో 92/5 (వోల్వార్ట్ 41 నాటౌట్; షట్ 2/17).

### లక్ష్యం 13 ఓవర్లలో 98

ఆసీస్ ఇన్నింగ్స్ ముగియగానే మరోసారి భారీ వర్షంతో సిడ్నీ మైదానం తడిసి ముద్దయింది. దీంతో ఆసీస్ శిబిరంలో ఆందోళన నెలకొంది. అటు అంతర్జాతీయ టీ20ల్లో ఆసీస్‌పై ఒక్క మ్యాచ్ కూడా గెలవని ప్రొటీస్ మాత్రం మ్యాచ్ రద్దు అయితే ఫైనల్‌కు వెళ్లచ్చనే ఆనందంలో ఉంది. కానీ గంట తర్వాత వర్షం ఆగడంతో మ్యాచ్‌ను 13 ఓవర్లలో 98 పరుగుల లక్ష్యానికి కుదించారు. ఈ ఛేదనలో పోరాడిన దక్షిణాఫ్రికా 5 వికెట్లు కోల్పోయి 92 పరుగులు చేసి ఓడింది. ఆఖరి ఓవర్‌లో 19 పరుగులు రావాల్సి ఉండగా 13 రన్స్ మాత్రమే సాధించడంతో ఓటమిపాలైంది.



ఆసీస్ మహిళల విజయానందం

# ఆటలన్నీ ఆగినట్టే!

### కరోనా ఎఫెక్ట్..



**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ ప్రపంచాన్ని వణికిస్తోంది. దీని ప్రభావం అన్ని రంగాలపైనా పడింది. ముఖ్యంగా ఒలింపిక్స్ జరిగే ఏడాది కావడంతో క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారు. టోక్యోకు అర్హత సాధించాలనే ఆశావహులపై కరోనా పంజా విసురుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో క్వాలిఫయింగ్ టోర్నీలు వైరస్ కారణంగా రద్దవడం, లేదా వాయిదా పడుతుండడంతో అథ్లెట్లు తీవ్ర నిరాశలో మునిగిపోతున్నారు. ఇటీవలి కాలంలో కరోనా వైరస్‌కు గురైన టోర్నీలు..

**అథ్లెటిక్స్**

- ఈ నెల 13 నుంచి 15 వరకు నాన్జింగ్‌లో జరగాల్సిన వరల్డ్ అథ్లెటిక్స్ ఇండోర్ చాంపియన్‌షిప్స్‌ను వచ్చే ఏడాదికి వాయిదా వేశారు.
- ఉభయ కొరియాల్లో జరగాల్సిన ప్యాంగ్‌యాంగ్, సియోల్ మారథాన్‌లను రద్దు చేశారు. అలాగే పారిస్ హాఫ్ మారథాన్‌ను రద్దు చేశారు.
- చైనాలోని చెంగ్డూలో మేలో నిర్వహించాల్సిన మిక్స్‌డ్ రిలే ఒలింపిక్ ట్రయాథ్లాన్ ఈవెంట్‌ను స్పెయిన్‌కు మార్చారు. అయితే, అక్కడ జరిగేదీ డౌటే.

**బ్యాడ్మింటన్**

ఒలింపిక్ క్వాలిఫికేషన్ ఈవెంట్లు జర్మన్ ఓపెన్ (మార్చి 3-8), వియత్నాం ఓపెన్ (మార్చి 24- 29), పోలిష్ ఓపెన్ (మార్చి 26-29)లు రద్దయ్యాయి.

**బాక్సింగ్**

వుహాన్‌లో జరగాల్సిన ఒలింపిక్ బాక్సింగ్ అర్హత పోటీలను జోర్డాన్‌కు తరలించారు. ఈనెలలో నిర్వహించాల్సిన అన్ని రకాల బాక్సింగ్ టోర్నీలను జపనీస్ బాక్సింగ్ సంఘం రద్దు చేసింది.

**ఫుట్‌బాల్**

చైనాలో నిర్వహించాల్సిన అన్ని ఫుట్‌బాల్ ఈవెంట్లనూ ఆ దేశ సంఘం రద్దు చేసింది. వైరస్ భయం రోజురోజుకూ పెరుగుతుండడంతో యూరో-2020లో కొన్ని మ్యాచ్‌లను రద్దు చేసే అవకాశం ఉంది.

**ఫార్ములా వన్**

వచ్చే నెల 19న నిర్వహించాల్సిన చైనీస్ గ్రాండ్ ప్రీని వాయిదావేశారు. ఆస్ట్రేలియా గ్రాండ్ ప్రీకి మాత్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. బహ్రెయిన్ గ్రాండ్ ప్రీ, వియత్నాం గ్రాండ్ ప్రీని షెడ్యూల్ ప్రకారం నిర్వహించే అవకాశాలున్నాయి.

**టెన్నిస్**

ఈ నెల 6 నుంచి రొమేనియాతో డేవిస్ కప్ మ్యాచ్‌ను చైనా వదిలేసుకొంది. పురుషుల టీమ్ రొమేనియా వెళ్లే పరిస్థితులు లేకపోవడమే ఇందుకు కారణం. చైనాలో వచ్చే నెలలో షెడ్యూల్ చేసిన జియాన్ ఓపెన్‌నూ రద్దు చేశారు. జపాన్-ఈక్వెడార్‌తో డేవిస్ కప్ మ్యాచ్‌కు ప్రేక్షకులను అనుమతించకుండా నిర్వహించనున్నారు.

**ఆర్చరీ**

బ్యాంకాక్‌లో జరగనున్న ఆసియా కప్ వరల్డ్ ర్యాంకింగ్ టోర్నీ నుంచి భారత్ తప్పుకొంది. థాయ్‌లాండ్‌లో ఈ నెల 8 నుంచి 15 వరకు టోర్నీని షెడ్యూల్ చేశారు.

- ప్రమాదకర కరోనా వైరస్ కారణంగా వచ్చే నెల 3 వరకు ఇటలీలో జరిగే అన్ని మేజర్ టోర్నీలను ప్రేక్షకులు లేకుండా నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇటాలియన్ కప్ సెమీస్ మ్యాచ్‌లను వాయిదా వేశారు. ఇటలీ-దక్షిణ కొరియా మధ్య శుక్రవారం నుంచి జరగనున్న డేవిస్ కప్ మ్యాచ్‌లను తలుపులు మూసి నిర్వహించనున్నారు. నార్త్ ఇటలీలో ఇంగ్లండ్-ఇటలీ మధ్య జరగాల్సిన ఫ్రెండ్లీ మ్యాచ్ సందిగ్ధంలో పడింది.
- ఐపీఎల్‌లో ఆడే తమ ఆటగాళ్లపై న్యూజిలాండ్ క్రికెట్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఫ్యాన్స్‌కు దూరంగా ఉండాలని ఈపాటికే సూచించింది. కాగా, శ్రీలంక పర్యటనలో కరచాలనం చేయబోమని ఇంగ్లండ్ కెప్టెన్ రూట్ ప్రకటించాడు.

## పేస్‌కు ఘనంగా వీడ్కోలు పలకాలని..!

### ● క్రొయేషియా x భారత్
### ● డేవిస్ కప్ క్వాలిఫయర్స్ నేటి నుంచి



**జాగ్రెబ్ (క్రొయేషియా):** భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్‌కు భారత జట్టు ఘనంగా వీడ్కోలు పలకాలనుకుంటోంది. శుక్రవారం నుంచి జరిగే డేవిస్ కప్ క్వాలిఫయర్స్‌లో అండర్‌డాగ్స్‌గా బరిలోకి దిగుతున్న భారత్.. ఆతిథ్య క్రొయేషియాపై విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. అయితే, టాప్ సింగిల్స్ ప్లేయర్ సుమీత్ నగల్‌ను బెంచ్‌కే పరిమితం చేసి.. రామ్‌కుమార్‌ను సింగిల్స్‌లో ఆడించాలనే సాహసోపేత నిర్ణయం తీసుకుంది. యూఎస్ ఓపెన్ మాజీ విజేత, ప్రపంచ 37వ ర్యాంకర్ మారిన్ సిలిచ్ క్రొయేషియాకు నేతృత్వం వహించనున్నాడు. ప్రజ్నేష్ గుణేశ్వరన్ మరో సింగిల్స్ ఆటగాడు కాగా.. డబుల్స్‌లో లియాండర్ పేస్ - రోహన్ బోపన్న జోడీ కీలకం కానుంది. ఇదే చివరి డేవిస్ కప్ అని పేస్ ఇంతకుముందే ప్రకటించాడు. 1995లో చివరిసారి క్రొయేషియాతో తలపడిన భారత్ 3-2తో నెగ్గింది.

## హారికకు రెండో గెలుపు



**లుసన్నే (స్విట్జర్లాండ్):** ఫిడే మహిళల గ్రాండ్ ప్రీ చెస్ టోర్నీలో తెలుగమ్మాయి ద్రోణవల్లి హారిక వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. గురువారం జరిగిన నాలుగో రౌండ్‌లో జార్జియా గ్రాండ్ మాస్టర్ ననా డిజాంగ్‌నిడ్జ్‌ను హారిక ఓడించింది. నల్లపావులతో ఆడిన హారిక 27 ఎత్తుల్లో డిజంగ్‌నిడ్జ్ ఆటకట్టించింది. దీంతో నాలుగు రౌండ్ల నుంచి హారిక మొత్తం 3 పాయింట్లతో టాప్‌లో నిలిచింది. అంతకుముందు మూడో రౌండ్‌లో ప్రపంచ చాంపియన్ జూ వెన్‌జున్‌కు హారిక షాకిచ్చింది.

## కెప్టెన్సీకి మష్రఫే గుడ్‌బై



**సిల్హట్:** బంగ్లాదేశ్ స్టార్ పేసర్ మష్రఫే మోర్తజా ఆ జట్టు వన్డే కెప్టెన్సీ నుంచి గురువారం వైదొలిగాడు. జింబాబ్వేతో శుక్రవారం ఇక్కడ జరిగే మ్యాచ్ వన్డే కెప్టెన్‌గా మష్రఫేకి చివరిది కానుంది. బంగ్లాదేశ్ స్టార్ క్రికెటర్లలో ఒకడైన 36 ఏళ్ల మోర్తజా త్వరలోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికే ఉద్దేశంతోనే కెప్టెన్సీనుంచి తప్పుకొన్నట్టు తెలుస్తోంది. అయితే ప్రస్తుతానికి జట్టు సభ్యుడిగా కొనసాగుతానని పార్లమెంట్ సభ్యుడు కూడా అయిన మష్రఫే చెప్పాడు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*